












2025-26

రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ
తెలంగాణ, హైదరాబాదు.

విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక



# వెన్నెల - 5
# తెలుగు వాచకం
## పదో తరగతి
(ఇతర మాధ్యమాల వారికోసం)

2025-26





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు

విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

SCERT TELANGANA

## సేవారంగంలో తెలంగాణ మహిళలు

### 1. సంగెం లక్ష్మీబాయి :



ఘట్‌కేసర్ సమీపంలోని ఒక గ్రామంలో 1911, జూలై 27వ తేదీన జన్మించిన సంగెం లక్ష్మీబాయి భారత స్వాతంత్ర్య సమర యోధురాలు. మద్రాసులో వివిధ విద్యా సంస్థలలో విద్యను అభ్యసించిన తరువాత హైదరాబాద్‌కు వచ్చి రెడ్డి మహిళా కళాశాల హాస్టల్ బాధ్యతలు చూసుకుంటూనే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. చాలామంది మహిళలను పాల్గొనేలా ప్రేరేపించింది. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి, ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని ఒక సంవత్సరంపాటు జైలు శిక్ష అనుభవించింది. 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర శాసనసభ సభ్యురాలిగా ఎన్నికయి 1954 నుండి 1956 వరకు విద్యాశాఖ మంత్రిగా పనిచేసింది. 1957 నుండి 1972 వరకు మెదక్ లోక్‌సభ సభ్యురాలిగా పనిచేసింది. జీవితాంతం మహిళల, బాలికల సంక్షేమం కోసం పాటుపడింది. సంతోష్‌నగర్ చౌరస్తాలో రెండెకరాల స్థలంలో ఉన్న తన స్వంత ఇంటిలో మహిళలు, అనాధ బాలికల కోసం ఇందిరా సేవాసదన్ (ఇప్పటి ఐ.ఎస్.సదన్)ను తన స్నేహితులతో కలిసి స్థాపించింది. తెలంగాణలో వినోభాబావే చేసిన తొలి పాదయాత్రలో పాల్గొనడమే కాకుండా చాలా సంఘాలలో వివిధ అత్యున్నత పదవులను నిర్వహించి జీవితాంతం మహిళల, బాలికల అభ్యున్నతి కోసం పాల్పడిన సంగెం లక్ష్మీబాయి 1979, జూన్ 3వ తేదిన మరణించింది.

### 2. సరోజినీ నాయుడు :



సరోజినీ నాయుడు 1879 సంవత్సరం ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించింది. 1915లో ఈమెకు మహాత్మగాంధితో పరిచయం ఏర్పడింది. 1930లో గాంధీ పిలుపునందుకొని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని ఎరవాడ జైలులో శిక్ష అనుభవించింది. ఈమె ఆంగ్లంలో ఎన్నో కవితలు రచించి కవయిత్రిగా మంచి పేరు సంపాదించింది. అంతేగాక "భారతకోకిల" (నైటింగేల్ ఆఫ్ ఇండియా) అని ప్రసిద్ధి పొందింది. గాంధీజీ పరిచయం అనంతరం భారతదేశం అంతటా పర్యటించి యువజన సంక్షేమం గురించి, శ్రమ సౌందర్యం గురించి, మహిళా విమోచనం గురించి ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలు ఇచ్చి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చింది. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో కూడా ఈమె సేవలు అజరామరం. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలోనే మొట్టమొదటి మహిళా గవర్నరుగా ఉత్తర ప్రదేశ్‌కు నియమించారు. గవర్నరు పదవిలో ఉండగానే 1950, మార్చి 2న కన్నుమూసింది. లక్నోలో ఆమె జ్ఞాపకార్థం ఒక స్మారకచిహ్నాన్ని నిర్మించారు.

### 3. సుమిత్రాదేవి :

1918, అక్టోబరు 9వ తేదీన సుమిత్రాదేవి జన్మించింది. సుమిత్రాదేవి ఆర్యయువజన పాఠశాల, జగజ్జీవన్ పాఠశాలను స్థాపించారు. 1942లో రాష్ట్ర కాంగ్రెసు సభ్యురాలయ్యారు. 1946లో నిజాం రాష్ట్ర నిమ్నజాతి మహాసభాధ్యక్షురాలిగా ఎన్నికై దళిత సంఘంలో ఎనలేని కృషి చేశారు. హరిజనులకు ఇళ్ళు కట్టించింది. వారి దాహార్తిని తీర్చడంకోసం అనేక బావులు, చెరువులు తవ్వించింది. దళితులకు భూమితోపాటు ఎడ్లను కూడా పంచిన సమర్థ నాయకురాలు ఆమె.

"నాకెక్కువ చదువురాదు. కాని దళిత జాతుల పిల్లలకందరికీ విద్య రావాలని నా ఆకాంక్ష" అని ఎప్పుడూ అంటూ ఉండేది. సుమిత్రాదేవి నాలుగు సార్లు శాసనసభకు ఎదురులేకుండా ఎన్నికయ్యారు. ఆమె పేరు వినగానే దళితవర్గాలు "మా తల్లి సల్లగుంటే మాకు బుక్కెడు బువ్వ దొరుకుద్ది. తలదాచుకుంటానికో గుడిసే యిస్తది. దున్నుకుంటానికి చేరెడు భూమిప్పిస్తది." అంటూ చేతులు జోడిస్తారు. సుమిత్రాదేవి దళితవర్గాల పాలిటి కల్పతరువు. నారీ లోకానికి ఆదర్శప్రాయురాలు.

## బాలల్లారా బంగరు కొండల్లారా!



డా॥ కపిలవాయి లింగమూర్తి

బాలల్లారా బంగరు కొండల్లారా!
భారత జాతికి నేతలు మీరే
భావి తరాలకు బాటలు మీరే
మన దేశానికి సంపద మీరే
మానవత్వపు మచ్చులు మీరే ॥ బాలల్లారా ॥

శాంతి దేవతకు రక్షణ మీరే
క్రాంతి పథాన రథములు మీరే
అమాయకతకు అంచులు మీరే
ఆనందానికి అవధులు మీరే ॥ బాలల్లారా ॥


ఇంటింటికిని జ్యోతులు మీరే
ఈశ్వరునకును ప్రీతులు మీరే
మర్మము లెరుగని మనుషులు మీరే
ధర్మమునకు ఆలంబన మీరే ॥ బాలల్లారా ॥

కపటము లెరుగని కర్తలు మీరే
నెపములు నేర్వని నేర్పరి మీరే
నిర్మలమునకు నెలవులు మీరే
నిందలెరుంగని బాబులు మీరే ॥ బాలల్లారా ॥

గౌతమ బుద్ధుని సుద్దులు మీరే
గాంధి తాత వారసులు మీరే
ఎంతగ ఎంతగ ఎదిగినగాని
అంతగ అంతగ ఒదుగుడి మీరు ॥ బాలల్లారా ॥

మల్లెపూవు వలె ఎడద తెల్లగా
మంచు బిందువటు మనసు చల్లగా
అప్పుడె విరిసిన మల్లెపూవులై
ఇప్పుడె కురిసిన హిమ బిందువులై ॥ బాలల్లారా ॥

లౌక్యములకును లోబడకుండ
బాల్యము నటులే భద్రపరచుక
మానవ జన్మ లభించినందుకు
మహానందమును పొందండి ॥ బాలల్లారా ॥



SCERT, TELANGANA

# వెన్నెల - 5

## తెలుగు వాచకం (ఇతర మాధ్యమాల వారికోసం)

## పదో తరగతి

SCERT, TELANGANA

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్

© Government of Telangana, Hyderabad

*New Edition*
*First Published 2022, 2023, 2024*

*Republished - 2025*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక 2025-26**

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

SCERT TELANGANA

## తెలంగాణ ప్రభుత్వం

## పాఠశాల విద్యాశాఖ



# తెలంగాణ తల్లి

తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు

SCERT, TELANGANA

# రాష్ట్ర గీతం

1. జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

2. పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి
భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి
హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల
బృహత్కథల తెలంగాణ కోటిలింగాల కోన
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

3. ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన
తెలుగులో తొలి ప్రజాకవి పాలకుర్కి సోమన్న
రాజ్యాన్నే ధిక్కరించి రాములోరి గుడిని గట్టి
కవిరాజై వెలిగె దిశల కంచర్ల గోపన్న
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

4. కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి
మల్లినాథసూరి మా మెతుకుసీమ కన్న బిడ్డ
ధూళికట్టనేలినట్టి బౌద్ధానికి బంధువతడు
దిగ్నాగుని గన్న నేల ధిక్కారమె జన్మహక్కు
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

5. పోతనదీ పురిటిగడ్డ రుద్రమదీ వీరగడ్డ
గండర గండడు కొమురం భీముడే నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోలుకొండ భాగ్యనగరి గొప్పవెలుగు చార్మినారు
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

6. రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల
సర్వజ్ఞ సింగ భూపాలుని బంగరు భూమి
వాణి నా రాణి అంటు నినదించిన కవికులరవి
పిల్లల మర్రి పిన వీరభద్రుడు మాలో రుద్రుడు
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

7. సమ్మక్కలు సారక్కలు సర్వాయి పాపన్నలు
సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు
ఊరూర పాటలైన మీరసాబు వీరగాథ
దండు నడిపె పాలమూరు 'పండుగోల్ల సాయన్న'
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

8. కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు
డప్పు ఢమరుకము డక్కి శారద స్వరనాదాలు
పల్లవులా చిరు జల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ
అను నిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

9. జానపద జనజీవన జావళీలు జాలువార
జాతిని జాగృతపరచే గీతాల జన జాతర
వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతేనేమి
తరుగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమయాగం
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

10. బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి
విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి
తడబడకుండా జగాన తల ఎత్తుకోని బ్రతుక
ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

11. సిరి వెలుగులు జిమ్మె సింగరేణి నల్ల బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువున సింగారం
సహజమైన వన సంపద సక్కనైన పువ్వుల పొద
సిరులు పండె సారమున్న మాగాణమె కద నీ యెద
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

12. గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ
పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలె
ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ జై జై తెలంగాణ
జై తెలంగాణ జై జై తెలంగాణ

– అందెశ్రీ

SCERT, TELANGANA

# జాతీయ గీతం

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధ్, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

**– రవీంద్రనాథ్ ఠాగూర్**

# వందేమాతరం

వందేమాతరం వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం
వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం
వందేమాతరం వందేమాతరం

**– బంకించంద్ర ఛటర్జీ**

# ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలందరిని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

**– పైడిమర్రి వేంకట సుబ్బారావు**

SCERT, TELANGANA

# ముందుమాట

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల వ్యావహారిక భాష 'తెలుగు'. ప్రజల దైనందిన వ్యవహారాల్లో తెలుగు భాషోపయోగం తప్పనిసరి. తెలంగాణలో నివసిస్తున్నవారందరూ తెలుగు భాషలో పట్టు సాధించాలి. రాష్ట్రంలోని విద్యార్థులు మన సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, వైభవాల గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణలో తెలుగు మాతృభాషగా కలిగినవారితోపాటు ఉర్దూ, కన్నడం, మరాఠీ, బెంగాలీ, తమిళంతో పాటు గిరిజన భాషలు మాతృభాషగా గలవారు కూడా నివసిస్తున్నారు. వీరందరూ తెలుగును తప్పనిసరిగా నేర్చుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 2018-19 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగును విధిగా బోధించడం కోసం 2018 ఏప్రిల్ మాసంలో చట్టాన్ని రూపొందించింది. ఇతర మాధ్యమాలకు చెందిన, ఇతర మాతృభాషల విద్యార్థులను దృష్టిలోపెట్టుకొని సరళమైన తెలుగువాచకాలను రూపొందిస్తున్నది. 2021-22 విద్యా సంవత్సరం కోసం 10వ తరగతి తెలుగువాచకాన్ని 'వెన్నెల-5' పేరుతో రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ రూపొందించింది.

అర్థం చేసుకోవడం, ఆలోచించడం, వ్యక్తీకరించడం అనే ప్రధాన ఉద్దేశాలతో ఈ వాచక రూపకల్పన జరిగింది. తెలుగు మాతృభాషకాని విద్యార్థులు తెలుగులో చదువడం, రాయడం అనే ప్రాథమిక సామర్థ్యాలతోపాటు భాష గురించిన ప్రాథమిక అవగాహనతో పదో తరగతిలోకి ప్రవేశిస్తారు. ఈ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు విన్నదాన్ని గురించి, చదివినదాన్ని గురించి ఆలోచించి ప్రతిస్పందించడం, విశ్లేషించడం వంటి సామర్థ్యాలు వృద్ధిచెందాలి. వ్యవహారంలో ఉన్న మౌఖిక, లిఖిత భాషారూపాలను/ప్రక్రియలను అర్థంచేసుకొని సందర్భోచితంగా వినియోగించగలగాలి. తెలుగు సాహిత్యంపట్ల ఆసక్తిని పెంచుకొని, తెలుగు భాషాసౌందర్యాన్ని, శైలిని, కవులను, రచయితలను అభినందించగలగాలి. పఠనం ఒక అలవాటుగా మార్చుకొని ఉన్నత వ్యక్తిత్వాన్ని, ఉత్తమ వైఖరులను పెంపొందించుకోవాలి.

ఈ వాచకంలో మొత్తం 8 పాఠాలు, ఉపవాచకంలో 5 కథలున్నాయి. వీటిని పిల్లల స్వభావం, సామాజిక స్పృహ, వ్యక్తిత్వ వికాసం, శ్రమ, గౌరవం, భాషాభిరుచి, నైతిక విలువలు, తెలుగు సంస్కృతి, తెలంగాణ కళలు, భూతదయ, సమయస్ఫూర్తి, ప్రకృతి గొప్పదనం, నిజాయితీ, స్త్రీ సాధికారత అనే ఇతివృత్తాల ఆధారంగా ఎంపిక చేయడం జరిగింది. ఇవి కథ, గేయం, వ్యాసం, పద్యం, పీఠిక, వచనకవిత వంటి ప్రక్రియల్లో ఉన్నాయి. ప్రతిపాఠంలో విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు, అభ్యసనాఫలితాలకు అనుగుణంగా అభ్యాసాలున్నాయి.

పదో తరగతి పూర్తయ్యేసరికి విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాల జాబితా ఈ వాచకం మొదట ఉంది. ఇది ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మార్గదర్శిగా ఉంటుంది. ఉపాధ్యాయులు ఈ వాచకాన్ని అర్థవంతంగా, సమర్థంగా ఉపయోగించడానికి వీలుగా 'ఉపాధ్యాయులకు సూచనలు' ఉన్నాయి. పదో తరగతి పూర్తయ్యేసరికి తెలుగులో సొంతంగా, సందర్భోచితంగా ప్రశ్నలకు జవాబులను ఇవ్వగలగాలి. 5, 6 వాక్యాలతో కూడిన పేరాలను రాయగలగాలి. కథలను, గేయాలను ధారాళంగా చదువగలగాలి, అర్థం చేసుకోవాలి.

మాతృభాషను బోధించడంకన్నా పిల్లలకు ఇతర భాషను నేర్పడంలోనే ఉపాధ్యాయుల బాధ్యత మరింత ఎక్కువ. కాబట్టి తప్పనిసరిగా పిల్లలచేత విరివిగా మాట్లాడిస్తూ, అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని వినియోగించి వీలైనంతమేరకు వాళ్ల మాతృభాషతో అన్వయిస్తూ అర్థమయ్యేటట్లు, స్వేచ్ఛగా మాట్లాడే భాషావాతావరణాన్ని కల్పించాలి. అందుబాటులోని బాలసాహిత్యాన్ని పిల్లలచేత చదివించాలి.

ఈ పాఠ్యపుస్తక రూపకల్పనలో పాల్గొన్న సంపాదకమండలి సభ్యులకు ధన్యవాదాలు. దీని రూపకల్పనలో విషయనిపుణులుగా సేవలందించిన భాషావిభాగ సభ్యులకు, పాల్గొన్న ఉపాధ్యాయులు, చిత్రకారులు, డి.టి.పి., లేఔట్ చేసిన వారికి అభినందనలు. ఈ పాఠ్యపుస్తకం భవిష్యత్ అభ్యసనానికి అవసరమైన పాటవాన్ని, సామర్థ్యాలను పెంపొందించడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

సంచాలకులు

రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

SCERT, TELANGANA

# ఉపాధ్యాయులకు సూచనలు

- ఈ వాచకాన్ని సమర్థంగా వినియోగించడానికి **"ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలను"** తప్పనిసరిగా చదువాలి.
- ఈ వాచకాన్ని 105 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు.
- సగటున ఒక్కొక్క పాఠానికి 12 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో 'చదువండి – ఆలోచించండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనల్లో ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాల'కు కలిపి రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించడానికి పాఠంలోని విషయం నిడివిని బట్టి 2 నుండి 3 కాలాంశాల వరకు కేటాయించుకోవాలి.
- **'ఇవిచేయండి'**లో ఇచ్చిన అభ్యాసాలకు మిగతా 5 కాలాంశాలను వినియోగించాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **'చదువండి – ఆలోచించి చెప్పండి'** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **'విద్యార్థులకు సూచనలు'**లోని అర్థ సంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శన పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయాపాఠాల స్వభావాన్నిబట్టి ఉపయోగించాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని విద్యార్థులు అర్థం చేసుకొనేలా చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా విద్యార్థులు అవగాహన పొందేలా చేయాలి. విద్యార్థుల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడం వంటివి చేయాలి.
- **'ఇవిచేయండి'**లోని అభ్యాసాలు విద్యార్థుల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని విద్యార్థులే సొంతంగా చేసేలా చూడాలి.
- ఒక్కొక్క అభ్యాసానికి ఒక కాలాంశం చొప్పున కేటాయించారు. కాబట్టి ఆయా కాలాంశాలలో విద్యార్థులు వాటిని ఎలా రాయాలో అవగాహన కల్పించాలి. విద్యార్థులు రాసిన అంశాలను పరిశీలించి సరిదిద్దాలి.
- **విద్యార్థులు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి. ఎట్టి పరిస్థితుల్లో గైళ్ళు, స్టడీమెటీరియళ్ళు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసి రాయడాన్ని పూర్తిగా నిరోధించాలి.** ఎందుకంటే పరీక్షలో పుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగానే రావు. ఆలోచించి జవాబులు రాసే స్వభావం కలిగిన ప్రశ్నలు వస్తాయి. పాఠంలోని అభ్యాసాలను సొంతంగా రాయగల్గిన విద్యార్థులు మాత్రమే వీటికి సమాధానాలు రాయగలుగుతారు.
- **'అవగాహన – ప్రతిస్పందన'** అభ్యాసంలో ఇచ్చిన **'వినడం – మాట్లాడడం'** కోసం ఇచ్చిన ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. **'చదువడం – అర్థం చేసుకోవడాని'**కి ఉద్దేశించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. పాఠం చదివి జవాబులు రాయాల్సిన ప్రశ్నలను ఇంటిపనిగా ఇవ్వాలి.
- **'వ్యక్తీకరణ – సృజనాత్మకత'** అభ్యాసంలోని ప్రశ్నలు స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలకు సంబంధించినవి. వీటిలో లఘుసమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటిపనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. విద్యార్థులు రాసిన సమాధానాలు విషయం, భావాలు, వాక్యాలు, పదాలు, అక్షరదోషాల పరంగా సరిచేయాలి.

SCERT, TELANGANA

- సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తర్వాత వీటిని ఇంటిపనిగా ఇచ్చి వ్యక్తిగతంగా రాయమనాలి.
- ప్రాజెక్టు పనులగురించి ముందుగా సూచనలివ్వాలి. రెండు, మూడు రోజుల సమయం ఇవ్వాలి. తర్వాత విద్యార్థులు రాసిన వాటిని సరిదిద్ది ప్రదర్శింపజేయాలి.
- పాఠం పూర్తి కావడమంటే **'బొమ్మను చూడండి' / 'చదువండి – ఆలోచించి చెప్పండి'** అనే ఉన్ముఖీకరణ అంశంతో మొదలుకొని పాఠం చివర ఇచ్చిన సూక్తివరకు అన్ని అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి అవగాహన కల్పించడం. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తయారుకావాలి.
- ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

  1) తరగతి 2) సబ్జెక్టు 3) అవసరమైన కాలాంశాల సంఖ్య

  4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

  5) మాసాలవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు / సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

  6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

  1) పాఠం పేరు 2) అవసరమైన కాలాంశాల సంఖ్య 3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

  4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

  5) ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచారసేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి–

  **I. ఉపోద్ఘాతం** : పలకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ

  **II. పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల బాహ్య పఠనం, ఉపాధ్యాయులు ఆదర్శ పఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన, సామర్థ్యాల సాధన.

  **III. విద్యార్థుల అవగాహన – పరిశీలన; IV. మూల్యాంకనం.**

- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయరాదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్‌లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకునేలా చూడాలి.
- తరగతి గదిలో విద్యార్థులు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించే వాతావరణాన్ని కల్పించాలి.
- తరగతి గదిలో భాషావాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన నిఘంటువులు, కవుల జీవితచరిత్రలు, దృశ్యశ్రవణ సామగ్రి వంటివి సమకూర్చుకొని వినియోగించాలి.
- పాఠశాలలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలు, భాషామేళాలు, భాషోత్సవాలు, బాలకవిసమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి.
- విద్యార్థులు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

SCERT, TELANGANA

# విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు

## I. అవగాహన - ప్రతిస్పందన

దీంట్లో వినడం - మాట్లాడడం; ధారాళంగా చదివి, అర్థంచేసుకొని, వ్యక్తీకరించడం అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో విద్యార్థులు కింది అంశాలను చేయగలగాలి.

- విన్న, చదివిన అంశాలను అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలను వ్యక్తపరచగలగాలి.
- తమ స్పందనలను చెప్పగలగాలి. కారణాలను వివరించగలగాలి.
- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, సొంతమాటల్లో చెప్పగలగాలి.
- భావాలకు తగిన పద్యపాదాలు, గేయపాదాలను గుర్తించగలగాలి. శీర్షిక సూచించగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలను, కీలకపదాలను రాయగలగాలి.
- తారుమారైన పద్యపాదాలను, గేయ పంక్తులను సరిచేసి రాయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యం లేదా కవితను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్కగుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని భావాలు రాయగలగాలి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

దీంట్లో స్వీయరచన, సృజనాత్మకత సామర్థ్యాలుంటాయి. వీటిలో విద్యార్థులు కిందివి చేయగలగాలి.

- 'గేయ' సారాంశాలు రాయగలగాలి.
- అభిప్రాయాలను రాయగలగాలి. కారణాలు వివరించగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- కథ, ఆహ్వానపత్రం, లేఖ, సంభాషణలు, ప్రశ్నావళులు వంటివి రాయగలగాలి.

## III. భాషాంశాలు

ఇది పదజాలం, వ్యాకరణాంశాలకు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్నవాటితోపాటు విద్యార్థులు కిందివి చేయగలగాలి.

- పదాలకు అర్థాలు, పర్యాయ పదాలను, నానార్థాలను రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.
- ప్రకృతికి వికృతిపదాలు, వికృతికి ప్రకృతిపదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలను వినియోగించగలగాలి.
- భాషాభాగాలు, విభక్తులు, కర్మ, కర్తృ, క్రియలు, సమాపక, అసమాపక క్రియలు, సామాన్య, సంశ్లిష్ట వాక్యాలను గుర్తించగలగాలి.
- సంధి పదాలను గుర్తించగలగాలి. వాటిని విడదీయడం, కలుపడం చేయగలగాలి.
- ద్విగు, ద్వంద్వ సమాసాలను గుర్తించగలగాలి. విగ్రహవాక్యాలను రాయగలగాలి.

SCERT, TELANGANA

# విషయ సూచిక


| క్ర.సం. | పాఠం పేరు, కవి / రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|
| 1 | చల్దులారగించుట - బమ్మెర పోతన | పిల్లల స్వభావం | పద్యం | జూన్ | 2 |
| 2 | పొదుపు కథలు - పాకాల యశోదారెడ్డి | భాషాభిరుచి | పీఠిక | జూలై | 12 |
| 3 | ప్రపంచ పదులు - సి. నారాయణరెడ్డి | వ్యక్తిత్వ వికాసం | గేయం | ఆగస్టు | 22 |
| 4 | భాగ్యోదయం - కృష్ణస్వామి ముదిరాజ | స్ఫూర్తి / సామాజిక స్పృహ | జీవిత చరిత్ర | సెప్టెంబర్ | 32 |
| 5 | నీతి పరిమళాలు - శతక కవులు | నైతిక విలువలు | పద్యం | అక్టోబర్ | 42 |
| 6 | తెలుగు మహిళ - ఇల్లిందల సరస్వతీ దేవి | తెలుగు సంస్కృతి | వ్యాసం | నవంబర్ | 54 |
| 7 | శ్రమజీవి - కనపర్తి రామచంద్రాచార్యులు | శ్రమపట్ల గౌరవం | వచన కవిత | డిసెంబర్ | 64 |
| 8 | హస్తకళా నైపుణ్యం - పరాంకుశం దామోదరస్వామి | తెలంగాణ కళలు | వ్యాసం | జనవరి | 72 |
| | **ఉపవాచకం - కథా విభాగం** | | | | |
| 1 | హంస ఎవరిది? | భూతదయ | కథ | జూలై | 82 |
| 2 | సమయస్ఫూర్తి | సమయస్ఫూర్తి | కథ | సెప్టెంబర్ | 84 |
| 3 | ఊరు - అడవి - పొట్లపల్లి రామారావు | ప్రకృతి గొప్పదనం | కథ | నవంబర్ | 86 |
| 4 | రిక్షావాలా - పబ్బరాజు గోపాల్‌రావు | నిజాయితీ | కథ | డిసెంబర్ | 88 |
| 5 | బకాసురుడి విందు - పోల్కంపల్లి శాంతాదేవి | స్త్రీ సాధికారత | కథ | జనవరి | 92 |

పదాలు - అర్థాలు 98


SCERT, TELANGANA

# 1 చల్దులారగించుట

– బమ్మెర పోతన

## చదువండి – ఆలోచించి చెప్పండి.

కార్తికమాసంలో బంధువులు, స్నేహితులతో కలిసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరిక చెట్టు నీడన) కలిసి భోజనం చేయటాన్ని 'వన భోజనం' అంటారు. అది ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు.

SCERT, TELANGANA

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

1. పై పేరా దేని గురించి ఉంది?
2. దీని ప్రత్యేకత ఏమిటి?
3. మీరు ఇటువంటి వాటిలో ఎప్పుడైనా పాల్గొన్నారా? దాని గురించి చెప్పండి.

### పాఠం ఉద్దేశం

బాల్యంలో స్నేహితులతో కులాసాగా గడిపే సంఘటనలు ఎప్పటికీ గుర్తుంటాయి. కాబట్టి ఇటువంటి ఆటలు, ఆనందాలు ఇతరులను నొప్పించకుండా ఆస్వాదించాలని చెప్పడం, భాగవతంలో వర్ణించిన బాలకృష్ణుని లీలలను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.


విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## పాఠ్యభాగ వివరాలు

భాగవతం పురాణ ప్రక్రియకు చెందినది. పురాణం అంటే పాతదైనా కొత్తగా కనిపించేది. పురాణాలు 18. వాటిలో భాగవతం ఒకటి. ప్రస్తుత పాఠం శ్రీమహాభాగవతం పదవ స్కంధం లోనిది. కంసుడు రేపల్లెకు పంపిన వేగులు ఈ కృష్ణలీలల గురించి కంసునితో చెపుతున్న సందర్భంలోనిది.

## కవి పరిచయం


**15వ శతాబ్దం**

పోతన 15వ శతాబ్దం వాడు. జనగామ జిల్లా బమ్మెర గ్రామంలో జన్మించాడు. లక్కమాంబ, కేసన ఆయన తల్లిదండ్రులు. ఈయన భోగినీదండకం, వీరభద్ర విజయం, నారాయణ శతకం, శ్రీమహాభాగవతం రచించాడు. సహజ పండితుడని ప్రసిద్ధి పొందాడు. తెలుగు నుడికారంతో, శబ్దాలంకార ప్రయోగంతో ఆకర్షణీయంగా రాయడం ఈయన ప్రత్యేకత.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలను చూడండి. వాటి గురించి మాట్లాడండి.
- మీ ఉపాధ్యాయులు చదివే విధానాన్ని శ్రద్ధగా గమనించండి. మీరూ చదువండి.
- పాఠం చదువండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- గీతగీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

# I

✿ శా. ఎండన్ గ్రుగ్గితి రాఁకటం బడితి రింకేలా విలంబింపఁగా
రండో బాలకులార చల్దిగుడువన్ రమ్యస్థలం బిక్కడీ
దండన్ లేఁగలు నీరు ద్రావి యిరవందం బచ్చికల్ మేయుచుం
దండం బై విహరించుచుండఁగ నమంద ప్రీతి భక్షింతమే. 1

**ఆలోచించండి - చెప్పండి**

1. కలిసి భోజనం చేయడానికి మీరు మీ స్నేహితులను ఎలా ఆహ్వానిస్తారు?
2. మీరు తినే చోటు ఎలా ఉండాలని అనుకుంటారు?


# II

వ. అనిన నగుఁగాక యని, వత్సంబుల నుత్సాహంబుల నిర్మలంబులగు జలంబుల ద్రావించి, పచ్చికల మొల్లంబులు గల పల్లంబుల నిలిపి, సొక్కంబులగు చల్దుల చిక్కంబులు సక్కడించి 2

✿ మ. జలజాంతస్థిత కర్ణికం దిరిగిరా సంఘంబులై యున్న రే
కుల చందంబునఁ గృష్ణునిం దిరిగిరాఁ గూర్చుండి వీక్షింపుచున్
శిలలుం బల్లవముల్ దృణంబులు లతల్ చిక్కంబులున్ బువ్వు లా
కులు కంచంబులుగా భుజించి రచటన్ గోపార్భకుల్ భూవరా 3

**ఆలోచించండి - చెప్పండి**

1. మిత్రులతో కలిసి బడిలో భోజనం చేసే సమయంలో మీరు ఎలా కూర్చుంటారు?
2. మీరు భోజనం చేసేటప్పుడు ఏం చేస్తారు?



SCERT, TELANGANA

## III

సీ. మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
యూరుఁగాయలు దినుచుండు నొక్కఁ
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరు సూపు నొక్కఁ
డేగురార్గుర చల్ది లెలమిఁ బన్నిదమాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ
డిన్నియుఁ దగఁ బంచి యిడుట నెచ్చెలితన
మనుచు బంతెన గుండు లాడు నొకడు

ఆ. కృష్ణుఁజూడు మనుచుఁ గికురించి పరుమ్రోలి
మేలి భక్ష్యరాశి మెసఁగు నొకడు
నవ్వు నొకఁడు సఖుల నవ్వించు నొక్కఁడు
ముచ్చటాడు నొకఁడు మురియు నొకఁడు. 4

**ఆలోచించండి - చెప్పండి**

1. మీరు భోజనం చేసే సమయంలో ఏఏ విషయాలను చర్చించుకుంటారు?



## IV

సీ. కడుపున దిండుగాఁ గట్టిన వలువలో
లాలిత వంశనాళంబు జొనిపి
విమల శృంగంబును వేత్ర దండంబును
జాఱి రానీక డాచంక నిఱికి
మీఁగడ పెరుఁగుతో మేళవించిన చల్ది
ముద్దడాపలి చేత మొనయనునిచి
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుఁగాయలు
వ్రేళ్ళ సందులను దా వెలయ నిఱికి

ఆ. సంగడీల నడుమఁ జక్కనఁ గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱఁగంద
శైశవంబు మెఱసి చల్దిగుడిచె 5

**ఆలోచించండి - చెప్పండి**

1. ఈ పద్యంలో కృష్ణుడు తింటున్నట్లు మీరెప్పుడైనా తిన్నారా? ఎందుకు అలా తినాల్సివచ్చింది?
2. భోజనం చేసే సమయంలో ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

SCERT, TELANGANA

## తాత్పర్యాలు

1. (శ్రీకృష్ణుడు గోపబాలకులతో ఇలా అంటున్నాడు.) ఓ పిల్లలారా! ఎండలో మాడిపోయారు. ఆకలితో ఉన్నారు. మరి చద్ది తినడానికి ఇంకా ఆలస్యం ఎందుకు? ఇక్కడకు రండి. ఇది చక్కని చోటు. మన లేగదూడలు ఈ పక్కనే నీరు తాగి, పచ్చిగడ్డి మేస్తూ గుంపుగా తిరుగుతూ ఉంటే, మనం ఎంతో సంతోషంగా చద్ది తిందాం.

2. ఈ విధంగా శ్రీకృష్ణుడు అనగానే గోపబాలురు "అలాగే చేద్దాం" అని అన్నారు. వారు లేగదూడలకు మంచినీళ్ళు తాగించి, పచ్చిగడ్డి బాగా ఉన్న పల్లపునేలలో వాటిని తోలి, తమ సద్దిమూటలను దించుకున్నారు.

3. మధ్యలో దుద్దు ఉండి చుట్టూ రేకులు ఉండే తామరపూవులాగా శ్రీకృష్ణుడు మధ్యలో కూర్చుండగా, అతని చుట్టూ గోపబాలురు కూర్చున్నారు. వారు శ్రీకృష్ణుని చూస్తున్నారు. తమ తమ సద్దులను తినడానికి అక్కడ ఉన్న బండలను, చిగురాకులను, గడ్డిపోచలను, తీగలను, చిక్కములను, పువ్వులను, ఆకులను కంచాలుగా చేసుకొని చద్దులు తిన్నారు.

4. ఒకడు వేలు మడిచి ఊరగాయలు తింటూ ఇతరులకు నోరూరేలాగా చేస్తున్నాడు. ఇంకొకడు పక్కవాని కంచములోని పదార్థాన్ని చటుక్కున మింగి, వాడు అడిగితే "నేను మింగలేదు. కావాలంటే చూడు." అని నోరు తెరిచి చూపిస్తున్నాడు. మరొకడు పందెం వేసుకొని అయిదారుగురి చద్దిని నోట్లోకి కుక్కుకొని తింటున్నాడు. ఒకడేమో తన పదార్థాలనన్నిటినీ అందరికీ వడ్డించి "స్నేహమంటే ఇదే" అంటూ బంతి భోజనం చేస్తున్నాడు. ఒకడు తన పక్కవానితో "అదిగో కృష్ణుని చూడు" అని చెప్పి మోసగించి అతని కంచంలోని మంచి పదార్థాన్ని అమాంతంగా తింటున్నాడు. ఒకడేమో నవ్వుతూ ఉన్నాడు. ఇంకొకడు నవ్విస్తున్నాడు. ఒకడు మాట్లాడుతున్నాడు. ఇంకొకడు సంతోషిస్తున్నాడు.

5. శ్రీకృష్ణుడు తన పొట్టకు కట్టుకొన్న బట్టల్లో పిల్లనగ్రోవిని పడిపోకుండా పెట్టుకొన్నాడు. కొమ్ముబూరను, బెత్తపుకర్రను జారిపోకుండా ఎడమచంకలో ఇరికించుకొన్నాడు. మీగడ పెరుగుతో కలిపిన చద్దిముద్దను ఎడమచేతిలో పెట్టుకున్నాడు. కుడిచేతి వేళ్ళసందున ఊరగాయలను పెట్టుకొని, తన స్నేహితుల మధ్యలో కూర్చుని, వారితో ఛలోక్తులాడుతూ, నవ్విస్తూ తింటున్నాడు. యజ్ఞములలో సమర్పించే హవిస్సులను స్వీకరించే శ్రీకృష్ణుడు ఈ విధంగా చిన్నపిల్ల వానిలాగా చద్ది తింటుంటే దేవతలు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడడం

**అ) కింది ప్రశ్నకు జవాబును చెప్పండి.**

1) పాఠంలోని చుక్క గుర్తుగల పద్యాలను కంఠస్థం చేయండి. వాటి భావాలను సొంతమాటల్లో చెప్పండి.

SCERT TELANGANA


విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) తారుమారైన కింది పద్యపాదాలను సరిచేసి రాయండి.**

శిలలుం బల్లవముల్ దృణంబులు లతల్ చిక్కంబులున్ బువ్వు లా
జలజాంతస్థిత కర్ణికం దిరిగిరా సంఘంబులై యున్న రే
కులు కంచంబులుగా భుజించి రచటన్ గోపార్భకుల్ భూవరా
కుల చందంబునఁ గృష్ణునిం దిరిగిరాఁ గూర్చుండి వీక్షింపుచున్.

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

**ఆ) దాశరథి కృష్ణమాచార్యులు రచించిన కింది గేయాన్ని చదువండి.**

తైలాలు లేకుండ వెలిగేటి దీపం

విద్యుత్తు లేకుండ వెలిసేటి దీపం

హృదయాలలో ఎప్పుడు నిలిచేటి దీపం

నిజమైన దీపం మా స్నేహదీపం

మనసులో దీపం, మలిపితే పాపం

వర్ణాలు వర్గాలు వదిలితే స్నేహం

వేషాలు రోషాలు మానితే స్నేహం

ప్రాణాల నర్పించగలిగితే స్నేహం

కష్టాల నష్టాల నోర్చితే స్నేహం

**పై గేయం ఆధారంగా కింది వాక్యాల్లో సరైనవాటిని గుర్తించి వాటి ఎదురుగా (✓) గుర్తు పెట్టండి.**

1) స్నేహం అనేది నిజమైన దీపం. ( )

2) స్నేహం కోసం అన్నింటినీ వదలాలి. ( )

3) స్నేహదీపం ఎప్పుడూ వెలుగదు. ( )

4) స్నేహదీపాన్ని మలపకూడదు. ( )

5) విద్యుత్తు ఉంటేనే స్నేహ దీపం వెలుగుతుంది. ( )

SCERT, TELANGANA

ఇ) కింది అంశాలు ఏ పద్యాలలో ఉన్నాయో వాటి ఎదురుగా ఉన్న బ్రాకెట్‌లో ఆ పద్య సంఖ్య రాయండి.

1) కృష్ణుడు అందరి మధ్యలో కూర్చున్నాడు – ( )

2) ఒక్కొక్కరు ఒక్కో పాత్రలో తింటున్నారు – ( )

3) తిందాం రమ్మనే పిలుపు – ( )

4) గోపబాలురు తమ తమ మూటలు విప్పారు – ( )

5) దేవతలు ఆశ్చర్యపోయారు – ( )

## II వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.

1) తినడానికి ముందు ఏమేమి సిద్ధం చేసుకోవాలి?

2) “కలిసి తినడంలో ఆనందం ఉంటుంది.” దీనిని సమర్థించండి.

3) భోజనం తెచ్చుకోని మిత్రులకు మీరు ఎలా సహాయం చేస్తారు?

4) మీరు ఇష్టంగా తినే పదార్థాలు ఏవి? ఎందుకు?

ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.

1) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.

1) మీ పాఠశాల నుండి ఏర్పాటు చేస్తున్న వనభోజనం కార్యక్రమానికి మీ విద్యాధికారిని ఆహ్వానిస్తూ **ఆహ్వానపత్రం** తయారుచేయండి.

( లేదా )

2) మీ పాఠశాల నుండి వెళ్ళిన వనభోజనం ఎలా జరిగిందో తెలుపుతూ ఊరిలోని స్నేహితునికి **లేఖ** రాయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) ప్రీతి : ______________________

2) విహరించు : ______________________

3) ముచ్చటలాడు : ______________________

**ఆ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సరైన అర్థాన్ని గుర్తించండి.**

1) బడికి వెళ్ళినప్పుడు విలంబం చేయకూడదు. (కోపం, ఆలస్యం)

2) నీరు పల్లానికి పారుతుంది. (ఎత్తుకు, ఒంపుకు)

3) కొన్ని పల్లవాలతో పచ్చడి చేస్తే బాగుంటుంది. (చిగురు, పండ్లు)

4) మనకు ఉపయోగపడే కార్యక్రమాలను టి.వి.లో వీక్షించాలి. (చూడాలి, పాడాలి)

### వ్యాకరణాంశాలు

**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించి బ్రాకెట్లలో రాయండి.**

1) కృష్ణుడు తన వేణువును నడుముకు చెక్కుకున్నాడు. (          )

2) పిల్లలు చుట్టూ కూర్చుని తింటున్నారు. (          )

3) దూడలను పచ్చిక ఉన్నచోట నిలిపారు. (          )

4) దేవతలు ఆహా! ఆహా! అంటూ ఆశ్చర్యపోయారు. (          )

5) అందరూ తమ తమ చద్దిమూటలు విప్పారు. (          )

**ఆ) కింది వాక్యాలలోని ఖాళీలను సరైన విభక్తి ప్రత్యయాలతో పూరించండి.**

1) కృష్ణుడు స్నేహితుల ________ ఆడుతున్నాడు. ( కు, తో, ను )

2) గోడ________ కేలెండర్ వేలాడుతున్నది. ( కు, ను, గురించి )

3) కృష్ణుడు వ్రేపల్లె________ పెరిగాడు. ( నుండి, వరకు, లో )

4) కొమ్మల________ కోతి కూర్చున్నది. ( మీద, లో, కొరకు )

5) పిల్లల________ తల్లులు చద్ది కట్టి ఇచ్చారు. ( కోసం, లో, తో )

SCERT TELANGANA

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ కృష్ణుని బాల్యానికి చెందిన ఒక కథను సేకరించి రాయండి. దానిని ప్రదర్శించండి.

**సూక్తి**

మనిషి తన చేతలతోనే గొప్పవాడవుతాడు,
జన్మతః కాదు.

– చాణక్యుడు

## మన ఇతిహాసం

# రామాయణం

## రామాయణాన్ని ఎందుకు చదువాలంటే...

మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. మానవ హృదయాల నుండి ఎప్పటికీ చెరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం – అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం – గురుభక్తి, శిష్యానురక్తి – స్నేహఫలం, ధర్మబలం – వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం –జీవకారుణ్యభావన, ప్రకృతిలాలన' – ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథంకాదు, ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. "రామో విగ్రహవాన్‌ధర్మః సత్యధర్మ పరాక్రమః" అన్న మహితోక్తిని మారీచుని నోటినుండి మహర్షి పలికించాడు. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణం వంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీనిని రచించి 'ఆదికవి'గా కీర్తిపొందాడు. 'రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడు పేర్లు దీనికున్నాయి. ఆరు కాండల (విభాగం)తో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో సాగిన రచన ఇది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది. వారి వారి ప్రతిభననుసరించి వాల్మీకి కథకు జోడింపులు చేసిన కవులూ ఉన్నారు. అవే నిజం అన్నంతగా ప్రచారం పొందాయి కొన్ని సంఘటనలు.

వాల్మీకి రామాయణ కథ సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాలవారికి స్ఫూర్తి కోసం చేసిన రచన.

SCERT, TELANGANA



విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## చదువండి - తెలుసుకొండి

### స్నేహసంపద

స్నేహానికి ఎల్లలు లేవు. పరిమితులు లేవు. అది ఒక మహా ప్రవాహం. లోతుకు వెళుతున్న కొద్దీ అనిర్వచనీయమైన అనుభూతిని, చిరస్మరణీయమైన మధుర జ్ఞాపకాలను స్నేహితులు పొందుతారు. స్నేహం త్యాగాన్ని కోరుతుంది. ప్రేమను కురిపిస్తుంది. హర్షాన్ని వర్షింపజేస్తుంది. సంతృప్తిని కలిగిస్తుంది, స్వార్థాన్ని సమూలంగా నశింపజేస్తుంది. కపటాన్ని, కాఠిన్యాన్ని దరిచేరనీయదు. హద్దులను చెరిపివేస్తుంది.. సద్బుద్ధిని ప్రవేశపెడుతుంది. ఆశలను చిగురింపజేస్తుంది. ఆశయాలను తలపింపజేస్తుంది. అభివృద్ధిని చేకూర్చుతుంది. సన్మార్గంలో పయనింపజేస్తుంది. అందుకే స్నేహమేరా జీవితం, 'స్నేహమేరా శాశ్వతం', 'స్నేహానికన్న మిన్న లోకాన లేదు' అనే మాటలు పాటలుగా ప్రసిద్ధికెక్కినాయి.

మంచి మిత్రులు ఎట్లా ఉంటారో భర్తృహరి నీతిశతకంలో నిర్వచించాడు. దానిని ఏనుగు లక్ష్మణ కవి కింది విధంగా అనువదించాడు.

**తే.గీ॥ అఘము వలన మరల్చు, హితార్థకలితుఁ**
**జేయు, గోప్యంబు దాఁచు, బోషించు గుణము,**
**విడువడాపన్ను, లేవడివేళనిచ్చు**
**మిత్రుఁడీ లక్షణంబుల మెలగుచుండు.**

పాపకార్యాల నుంచి నివారింపజేస్తూ హితాన్ని కలిగించే సత్కార్యాలలో ప్రవర్తింపజేస్తూ, రహస్యాలను రహస్యంగా ఉంచుతూ, మంచిగుణాలను ప్రశంసిస్తూ తగినట్లుగా సహాయం చేసే వ్యక్తులే సన్మిత్రులుగా పేర్కొనదగినవారని భర్తృహరి సన్మిత్రుల గురించి చెప్పాడు.

స్నేహంలో ఎక్కువ తక్కువలుండవు. అంతరంగ స్నేహితుడుగా రూపుదిద్దుకున్న వ్యక్తి ధనికుడా? పేదవాడా? కష్టాల్లో ఉన్నాడా? లేక సుఖపడుతున్నాడా? అనే ఆలోచన కలుగదు. భోగభాగ్యాలతో సుఖసంపదలతో, అన్నివిధాల ఉన్నతుడైన వ్యక్తితో మాత్రమే స్నేహం చేయాలి అనే స్వార్థభావన కూడ ఏర్పడదు. పైగా యథార్థ స్నేహితులు ఒకరి శ్రేయస్సుకై మరొకరు తమ సుఖాలను, ధనాన్ని, సమయాన్ని, చివరకు తమ దేహాలను కూడా త్యాగం చేయడానికి సిద్ధపడుతారు. సుఖదుఃఖాలను కూడ సమంగా పంచుకుంటారు అని వాల్మీకిమహర్షి శ్రీమద్రామాయణం కిష్కింధకాండలో తెలిపాడు. ఇట్టి స్నేహసంపదను సంపాదిద్దాం!

SCERT, TELANGANA

# 2 పొడుపు కథలు

– పాకాల యశోదారెడ్డి

## చదువండి – ఆలోచించి చెప్పండి.

చిటపట చినుకులు చిటారి చినుకులు

ఎంత కురిసినా వరదలు రావు..... ఏమిటదీ.....? (కన్నీళ్ళు)

దానం చేస్తే తరగనిది.....

అంతకంతకూ పెరిగేది..... ఏమిటదీ.....? (విద్య)

SCERT, TELANGANA

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. ఇలాంటివి మీరు ఎక్కడైనా, ఎప్పుడైనా విన్నారా?
2. వీటిని ఏమంటారు?
3. మీకు తెలిసిన కొన్ని పొడుపు కథలు చెప్పండి.

### పాఠం ఉద్దేశం

ఒక పుస్తకంపైన ప్రాథమికమైన అవగాహన కలుగజేస్తూ, పాఠకుల్లో ఆ పుస్తకం చదువాలనే కుతూహలాన్ని, ఆసక్తిని ఎలా కలుగజేస్తుందో తెలియజేస్తూ, ముందుమాట స్వరూపస్వభావాలను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం పీఠిక ప్రక్రియకు చెందినది. ఒక పుస్తకం యొక్క నేపథ్యాన్ని, లక్ష్యాలను, అందులోని పూర్వాపరాలను చర్చిస్తూ రచయితగానీ, మరో వ్యక్తిగానీ రాసే పరిచయ వాక్యాల్ని 'పీఠిక' అంటారు.

దీనికి ముందుమాట, భూమిక, తొలిపలుకు, మున్నుడి, ఆముఖం, ప్రస్తావన... వంటి పేర్లున్నాయి. ఈ పాఠం 'గోడమీద బొమ్మ' అనే పొడుపు కథామాల పుస్తకానికి పి. యశోదారెడ్డి రాసిన పీఠిక.

## రచయిత పరిచయం



08-08-1921
07-10-2007

పాకాల యశోదారెడ్డి పూర్వపు మహబూబ్ నగర్ జిల్లా ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన రచయిత్రి. ఈమె స్వగ్రామం బిజినేపల్లి. ధర్మశాల, మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు వంటి కథాసంపుటాలు వెలువరించింది. ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలు రాసింది. అధికార భాషాసంఘం తొలి మహిళా అధ్యక్షురాలిగా పనిచేసిన యశోదారెడ్డి 'మహాలక్ష్మి ముచ్చట్లు' పేరుతో అప్పట్లో రేడియో ధారావాహిక కార్యక్రమం నిర్వహించి బహుళ ప్రజాదరణ పొందింది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలను చూడండి. విషయాన్ని ఊహించండి.
- పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాల కింద గీతలు గీయండి.
- అర్థంకాని విషయాల గురించి మీ మిత్రులతో చర్చించండి.
- పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టికను చూసి తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.

SCERT, TELANGANA

# I

మన భారతీయ సంస్కృతి ఎంత ప్రాచీనమైందో అంత విచిత్రమైంది. దానికి ఔన్నత్యం ఎంత ఉందో అంత వైశాల్యమూ ఉంది. ఈ రెండింటిని మించిన లోతు కూడా ఉంది.

నిజానికి మనది వ్యవసాయిక దేశం. ఈ దేశీయుల సంస్కృతీ నాగరికతలకు పునాదులు పల్లెపట్టులు. అత్యంత ప్రాచీనమైన మన భారతీయ సంఘం గ్రామీణమైందే. ఆనాటి మన పూర్వులు ఆ పశుపాలనలో, ఆ పచ్చిక బయళ్ళలో, ఆ నీలాకాశంలోని మెరుపుల్లో, కుండపోతగా కురిసే వానల్లో ఏదో తమకు తెలియని రహస్యం దాగి ఉన్నట్లు భావించగలిగినారు. ఈ భావనే అన్ని తత్వ రహస్యాలకూ, సమస్యలకూ, ముడులకూ, ముడివిప్పులకూ కారణమైంది. వాటి నుండి పాఠాలు, ప్రవచనాలు, ప్రశ్నలు, సమాధానాలు ప్రారంభమైనవి. అంటే వేదకాలం నుండి ఈ ప్రశ్నోత్తర రూపమైన విజ్ఞానం మన సంస్కృతిలో కాలూనింది.

ప్రశ్నోత్తర రూపమైన ఈ విజ్ఞానం ప్రధానంగా మనకు మహాభారత వనపర్వంలో యక్షరూపియైన ధర్మదేవ, ధర్మజుల సంభాషణలో గోచరిస్తుంది. ఈ యక్ష ధర్మజుల సంవాదంలో ప్రకటితమైన మహావిజ్ఞానమే యక్షప్రశ్నలు అనే పేర సాహిత్యంలో ప్రసిద్ధమై వెలసింది. అందుకే ఈనాడు విడదీయరాని చిక్కును గూర్చి చెప్పవలసి వచ్చినప్పుడు "ఏంరా బాబూ? యక్షప్రశ్నవలె ఉంది" అని పోలిక చెప్పడం పరిపాటిగా మారింది. ఒక్కొక్కప్పుడు ఈ 'వలె' ఉపమావాచకం కూడా లేకుండా "ఇది యక్షప్రశ్నరా తండ్రీ!" అని అంటే చాలు. అది గడ్డు సమస్య అని అందరికీ సులభంగా తెల్సిపోతుంది.

తెలుగు సాహిత్యంలో మనకు ఎఱ్ఱాప్రెగడ ఈ యక్షప్రశ్నలను ప్రచారం చేసినాడు. మహాభారతాంధ్రీకరణ సందర్భంలో అరణ్యపర్వ సప్తమాశ్వాసంలో ఈ యక్షప్రశ్నలను తెనిగిస్తూ ధర్మదేవుడు అడిగిన ప్రశ్నలకు ధర్మరాజు చెప్పినట్లు వ్రాసినాడు. నిజానికి యక్షుడు అడిగిన ప్రశ్నలు పొడుపుకథల వలెనే ఉన్నవి. ఈ విధంగా ఎంతో పురాతనమైన ఈ ప్రశ్నోత్తర విధానం ఆయా కాలాల్లో ఆయా కవుల చేతుల్లో మెలగి జనబాహుళ్యంలో ప్రాచుర్యాన్ని పొంది, విద్వల్లోకంలో ప్రహేళికా రూపంలో, జనసామాన్యంలో పొడుపుకథా రూపంలో స్థిరపడింది. ఈనాడు ప్రహేళికా ప్రక్రియ అంతగా కానరాదు. కానీ తెలుగుజాతి జీవితంలో మాత్రం ఈ పొడుపుకథా రీతి వేరూని స్థిరంగా ఈనాటికీ నిలిచి ఉంది.

పొడుపుకథ అనే శబ్దానికి అనేక పర్యాయ పదాలున్నాయి. ఆయా ప్రాంతాలలో, ఆయా సంఘాలలో, వారి వారి అలవాట్లను పురస్కరించుకొని ఆయా పర్యాయపదాలు వాడుకలో స్థిరపడ్డాయి.

పొడుపుకథ అంటే జ్ఞానోదయాన్ని కలిగించేది. నిగూఢమైన అర్థాన్ని ప్రకాశింపజేసేది. మనస్సుకు సూటిగా తగిలేది. ఎదలో నాటేది లేదా వెంటనే అర్థం తోచక చిక్కుల పెట్టేది అని మనం గ్రహించవచ్చు.

**ఆలోచించండి - చెప్పండి**

1. ఆకాశంలో మెరుపుల్ని, కురిసే వానల్ని చూస్తుంటే మీకు ఏమనిపిస్తుంది?
2. గడ్డు సమస్య అంటే మీకేమి అర్థమైంది?

SCERT, TELANGANA

**మారుకతలు :**

రాయలసీమలో కొన్ని చోట్ల ఈ పొడుపు కథలకే మారుకతలు అని వాడుక ఉంది.

**శాస్త్రం :**

కరీంనగరు ప్రాంతంలో పొడుపుకథను శాస్త్రం అంటారు. 'ఏదీ ఒక శాస్త్రం ఏయ్, నీకు శాస్త్రం వచ్చా' అని అడుగుతుంటారు. ఇక్కడ శాస్త్రం అంటే రహస్యార్థంతో కూడిన ప్రశ్న అని అర్థం. విస్తృతమైన విషయం సూత్రబద్ధం చేయబడి సూక్ష్మరూపంలో ఇమిడి ఉంటుంది. అందుకే ఈ పొడుపుకథకు 'శాస్త్రం' అనే పేరు ఏర్పడి ఉండవచ్చు.



## II

**విప్పేకథలు :**

ఈ పేరు కొంత చదువు సంస్కారం ఉన్నవారు విచ్చుకథలకు మారుగా అర్థం సులభంగా తెలిసేందుకు వాడి ఉంటారు. ముడితో కూడిన కథ లేదా ప్రశ్న వేసినప్పుడు ఆ ముడిని విప్పి చెప్పడం, అంటే అందులో ఉన్న కాఠిన్యాన్ని తొలగించి సరళంగాచేసి వాస్తవాన్ని ప్రదర్శించడం అని భావించవచ్చు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరు ప్రధానంగా ఈ పొడుపు కథలు తెలుగుదేశమంతా వ్యాపించి ఉన్నాయి.

తెలుగువారి భాగ్యవిశేషం చేత అందరికీ, అన్ని కళారంగాలవారికీ అకాడమీలు ఏర్పడ్డాయి. అట్లే విజ్ఞానాభివృద్ధికి, మనోవికాసానికి, కల్పనాశక్తికి దోహదంగా బాలలకూ ఒక అకాడమీ ఏర్పడింది. బాలల అకాడమీ ద్వారా పిల్లలు పువ్వులు పుట్టికలు నిండినట్లుగా వారికి ఎన్నో పుస్తకాలు వస్తున్నాయి. అన్నిటికన్నా మెచ్చుకోదగింది పొడుపు కథలను సంపుటాలుగా వెలయించి ప్రకటించే ప్రయత్నం. దీనివల్ల ఆదరణలేక, అలవాటు తప్పి మరుగున పడిపోతున్న

SCERT, TELANGANA

మన జాతీయమైన ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం జరుగుతుంది. దీనివల్ల అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పేశక్తి, చెప్పలేకపోయినా ఆలోచించే అవకాశం కలుగుతుంది. ప్రాచీన విజ్ఞానంతో సంబంధం తగ్గుతూ మారుతున్న జీవనరీతిలో పాతబడ్డ ఆచార, వస్తువిశేషాల పరిచయం పిల్లలకు ఏర్పడుతుంది. కాబోయే రేపటి పౌరులు మన తెలుగుతనాన్ని మరచిపోకుండా చురుకుదనంతో ఉంటారని ఆశించే గోడమీద బొమ్మ – పొడుపుకథామాల మొదటి సంపుటాన్ని ప్రకటిస్తున్నారు.

గోడమీద బొమ్మలో 501 పొడుపు కథలున్నవి. 'గోడమీద బొమ్మ' అనే పేరులోనే పొడుపు కథ ఉంది. ఈ గోడమీద బొమ్మ ఉత్త బొమ్మ కాదు. అది గొలుసుల బొమ్మ. అంతే కాదు. అది వచ్చే పొయ్యేవారికి వొడ్డిచ్చే బొమ్మ మరి! ఆ బొమ్మ ఎవరో చెప్పుకోండి చూతాం? నన్నే చెప్పమంటారా! సరే! వినండి. తేలు... ఇట్లా ఉంటుంది మా గోడమీద బొమ్మ కథ. ఇందులో ఐదు వందల పొడుపు కథలు అకారాది క్రమంలో కూర్చబడ్డాయి.

ఎన్నో విచ్చు కథలు మన దేశంలో ప్రచారంలో ఉన్నప్పటికీ వాటిలో పిల్లలకు ఉపకరించే వాటిని మాత్రమే ఏరి కూర్చడం జరిగింది. కంటిలో వత్తి వేసుకొని ప్రయత్నించినా కనుమరుగై కొన్ని జారిపోతూనే ఉంటాయి. ఆ విధంగానే సంకలన కర్తలు ఎంతో ప్రయాసపడి కూర్చినా ఇంకా ఎన్నో మిగిలి ఉంటాయి. ఒకే పొడుపు కథ ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క తీరుగా ఉండవచ్చు. దేశం నలుమూలలా ఉన్న పలుకుబడినంతటినీ ఒకచోట చేర్చి సిద్ధం చేయవలసి ఉంది. ఆ దృష్టితో బాలల అకాడమీ కృషి చేస్తున్నది.

**ఆలోచించండి - చెప్పండి**

1. కథల ముడి విప్పడమంటే ఏమర్థమైంది?
2. తెలుగుతనాన్ని మరచిపోకుండా ఉండాలంటే ఏం చేస్తారు?

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడటం

**అ) కింది ప్రశ్నకు జవాబును చెప్పండి.**

1) కథలకు, పొడుపు కథలకు తేడా ఏమిటో చెప్పండి.

### ధారాళంగా చదవడం - అర్థం చేసుకోవడం

**అ) కింది పేరాను చదవండి. 5 ప్రశ్నలను తయారుచేయండి.**

ఎన్నో విచ్చు కథలు మన దేశంలో ప్రచారంలో ఉన్నప్పటికీ వాటిలో పిల్లలకు ఉపకరించే వాటిని మాత్రమే ఏరి కూర్చడం జరిగింది. కంటిలో వత్తి వేసుకొని ప్రయత్నించినా కనుమరిగి కొన్ని జారిపోతూనే ఉంటాయి. ఆ విధంగానే సంకలన కర్తలు ఎంతో ప్రయాసపడి కూర్చినా ఇంకా ఎన్నో మిగిలి ఉంటాయి. ఒకే పొడుపు కథ

SCERT TELANGANA

ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క తీరుగా ఉండవచ్చు. దేశం నలుమూలలా ఉన్న పలుకుబడినంతటినీ ఒకచోట చేర్చి సిద్ధం చేయవలసి ఉంది. ఆ దృష్టితో బాలల అకాడమీ కృషి చేస్తున్నది.

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

**ఆ) కొంగ, ఎండ్రికి మధ్య జరిగిన ఈ సంభాషణను చదువండి. ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబులను రాయండి.**

ఎండ్రి : ఏమిటి బకోత్తమా! ఎందుకు కన్నీరు కారుస్తున్నావు?

కొంగ : వచ్చావా మిత్రమా? ఏమని చెప్పను? కొన్ని దినాల్లో నా మిత్రులైన చేపలతోపాటు నీకూ ఓ ఆపద రానుందన్న విషయం తెలిసి కన్నీరు మున్నీరవుతున్నాను.

ఎండ్రి : ఈ మడుగులో మాకు వచ్చే ఆపదేమిటి బకోత్తమా?

కొంగ : ఇంతకుమునుపే కొందరు జాలరులు వచ్చి ఈ కొలనులో నీరు పరిశీలించి వెళ్ళారు. ఇంకొంత నీరు ఇంకాక వచ్చి ఈ కొలన్ను జల్లెడ పడదామనుకున్నారు. ఆ మాటలు విన్న నా మనసు మనసులో లేదు.

ఎండ్రి : అయితేనేమి మిత్రమా! ఆపద్బాంధవుడిలా మాకు నువ్వున్నావుగదా! ఏదైనా ఉపాయం ఆలోచించి నన్నూ, ఈ చేపల్ని రక్షించు.

కొంగ : (ఆలోచించి) ఆలోచించి చూస్తే నాకో ఉపాయం తడుతుంది మిత్రమా! దగ్గర్లో నాకు తెలిసిన ఓ పెద్ద చెరువుంది. నా చేతనైనంతమేర రోజూ కొన్నింటిని ముక్కుతో కరుచుకొనివెళ్ళి ఆ చెరువులో వదిలేస్తా.

ఎండ్రి : బాగుంది. మరి నా సంగతేమిటి?

కొంగ : విచారించకు మిత్రమా! నిన్నూ రక్షించేందుకు తగిన ఉపాయం ఆలోచిస్తాగా!

1) బకోత్తముడంటే ఎవరు? ______________

2) కొంగ విచారానికి కారణం ఏమిటి? ______________

3) కొలనులో నీటిని పరిశీలించింది ఎవరు? ______________

4) కొంగకు తట్టిన ఉపాయం ఏమిటి? ______________

5) కొలన్ను జల్లెడ పట్టడమంటే ఏమిటి? ______________

SCERT, TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.

1) విడదీయరాని చిక్కు ప్రశ్నలను యక్ష ప్రశ్నలు అనడానికి కారణం ఏమిటి?

2) 'పురాతనమైన ప్రశ్నోత్తర విధానమే పొడుపు కథా రూపంగా స్థిరపడ్డాయి' సమర్థించి రాయండి.

3) తేలు గురించి వచ్చే పొయ్యే వారికి వొడ్డించే బొమ్మ అని ఎందుకు అన్నారు?

4) 'పొడుపు కథలు' పాఠ్యభాగ రచయిత గురించి వివరించండి.

ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.

1) పొడుపు కథల గురించి సొంతమాటల్లో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.

1) మీ పాఠశాలలో జరగనున్న 'గోడమీద బొమ్మ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అతిథుల్ని ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రం తయారుచేయండి.

( లేదా )

2) పొడుపు కథల విశిష్టతను తెలుపుతూ మీ మిత్రునికి లేఖ రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.

1) కుండపోత : ________________

2) ఔన్నత్యం : ________________

3) చురుకుదనం : ________________

4) మరుగునపడు : ________________

5) పరిపాటి : ________________

SCERT, TELANGANA

ఆ) కింది ఉదాహరణ పదాన్ని అనుసరించి ఇచ్చిన అంత్యానుప్రాసలతో కొత్తపదాలను రాయండి.

ఉదా : జ్ఞానోదయం

1) ____________దయం    2) ____________దయం

3) ____________దయం    4) ____________దయం

5) ____________దయం

ఇ) కింది వాక్యాలలోని గీత గీసిన పదాలకు అదే అర్థాన్నిచ్చే మరి రెండు పదాలు రాయండి.

ఉదా : బాగా చదివితే పరీక్షలు పాసుకావడం సులువు.    తేలిక,    సరళం

1) వరదల్లో కొన్ని కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి.    __________, __________

2) బాలకార్మికుల్ని చూస్తే ఎదలో జాలి కలుగుతుంది.    __________, __________

3) ఎవరి మార్గంలో వారు పయనించడం ఉత్తమం.    __________, __________

4) హిందూ సంస్కృతి ఎంతో పురాతనమైనది.    __________, __________

## వ్యాకరణాంశాలు

అ) కింది వాక్యాలను చదువండి.

1) చిలుక జామపండు తిన్నది.

2) విష్ణు కథ చెప్పాడు.

3) జానకి పక్షులను పెంచింది.

4) రమ గురువులను సత్కరించింది.

పైన చదివిన వాక్యాలను ప్రశ్నార్థక వాక్యాల్లో చదువండి.

1) జామపండు తిన్నది ఎవరు?

2) కథ చెప్పింది ఎవరు?

3) పక్షులను పెంచింది ఎవరు?

4) గురువులను సత్కరించింది ఎవరు?

పై వాటిలో ఎవరు అనే ప్రశ్నకు సమాధానంగా వచ్చే వాటిని 'కర్త' అంటారు.

ఇప్పుడు మరోరకమైన ప్రశ్నార్థకాలు చూద్దాం.

1) చిలుక దేనిని తిన్నది?

2) విష్ణు ఏమి చెప్పాడు?

3) జానకి వేటిని పెంచింది?

4) రమ ఎవరిని సత్కరించింది?

SCERT, TELANGANA

ఈ ప్రశ్నలలో దేనిని, ఏమి, వేటిని, ఎవరిని అనే ప్రశ్నార్థకాలకు సమాధానంగా వచ్చేవాటిని 'కర్మ' అంటారు.

ఇక పనిని తెలిపే పదాలను 'క్రియ'లు అంటారని ముందే తెలుసుకొని ఉన్నారు.

**అంటే... ఒక వాక్యంలో పనిని చేస్తున్న వ్యక్తిని కర్త అని, ఆ పనిని అనుభవిస్తున్న వారిని కర్మ అని, పనిని తెలియజేసే పదాన్ని క్రియ అని గ్రహించాలి.**

**ఆ) కింది వాక్యాలను చదువండి. కర్త, కర్మ, క్రియ లను వేరుచేసి పట్టికలో రాయండి.**

1) బాలసుబ్రమణ్యం తెలుగులో వేల సినిమాపాటలు పాడాడు.

2) సీతారాములు పద్నాలుగేళ్ళు వనవాసానికి వెళ్ళారు.

3) రామప్ప గుడిపై శిల్పులు అందమైన శిల్పాలు చెక్కారు.

4) వాల్మీకి రామాయణం రాశాడు.

| క్ర.సం. | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| 1) | | | |
| 2) | | | |
| 3) | | | |
| 4) | | | |

SCERT TELANGANA

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ పొడుపు కథల గురించి తెలుసుకొన్నారు కదా! 10 పొడుపు కథలను సేకరించండి. వాటిని రాసి ప్రదర్శించండి.

**సూక్తి**

అందరితో కలిసి చెడుదారిలో వెళ్ళేబదులు ఒంటరిగా మంచి దారిలో వెళ్ళడం మేలు.

– గౌతమ బుద్ధుడు



విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

# చదువండి - తెలుసుకొండి

## పొడుపు పద్యాలు

పొడుపుకథలంటే అందరం చెవికోసుకుంటాం. అవి మెదడుకు పదునుపెడుతాయి. ప్రశ్నవిన్నప్పుడు ఆలోచనలో పడుతాం. జవాబు తెలిసినప్పుడు ఆనందపడుతాం. 'వేయికళ్ళపులి ఏట్లో వేటాడబోయింది' అన్నప్పుడు ఇదెక్కడి పులి? అనుకుంటాం. కాని, అది పులికాదు 'వల' అని తెలుసుకుంటే ఎంత సంతోషం! 'నాన్నకందవు, అమ్మకందుతాయి' అన్నప్పుడు అవేమిటబ్బా? అనిపిస్తుంది. అవి వస్తువులు కావు 'పెదవులు' అని తెలిస్తే 'అబ్బా!' అనిపిస్తుంది. 'నాన్న' అన్నప్పుడు పెదవులు ఒకదానికొకటి అందవు (తాకవు), 'అమ్మ' అన్నప్పుడు అందుతాయి (తాకుతాయి). ఇట్లా పొడుపుకథలు మెదడుకు మేత. ఇవి పాటల రూపంలో, పద్యాలుగా కూడ ఉంటాయి. ఇటువంటి పద్యాలను చూద్దాం.

**ఆ.వె. కనులు మూడుగలవు - కాదు త్రినేత్రుండు**
**పక్షిగాదు చెట్టుపైన నుండు**
**జలము దాల్చి యుండు నలమేఘుడును గాడు**
**దీని భావమేమి? తిరుమలేశ.**

మూడుకళ్ళుంటాయంట అనగానే 'శివుడు' అనుకుంటాం. కాని కాదంటాడు. చెట్టుపైన ఉంటుంది అనగానే పక్షేమో అనుకుంటాం.కాని కాదట. దాంట్లో నీళ్ళుంటాయి అనగానే 'మేఘమా' అనిపిస్తుంది. కాని అదికాదు అంటున్నాడు. ఈ మూడు లక్షణాలున్నదేమిటి? అని బాగా ఆలోచిస్తే జవాబుగా 'టెంకాయ' దొరికింది. ఇప్పుడు చూడండి అన్ని లక్షణాలు సరిపోతాయి. ఇంకొక పద్యం చూద్దాం.

**సీ. కొమ్ములు కలవని కోపించి పొడువదు**
**కట్టిబంధించిన కదలకుండు**
**ఈనదు పొర్లదు ఎన్నాళ్ళకైనను**
**బంధంబువేసిన పాలొసంగు**
**మేత కాసించదు మేఘంబులోనీళ్ళు**
**కావలెననుచుండు కడుపునిండ**
**దానికడుపునిండ దారిద్ర్యములు బాపు**
**బహుజీవరాసులు బ్రతుకవచ్చు**

**తే.గీ. దీనియర్థంబు తెలియగ దివిరినరులు**
**మది విచారించి పదునైదు మాసములను**
**సమ్మతిగజెప్పు భావజ్ఞ చక్రవర్తి**
**చెప్పలేకున్న నగుదునే చిన్నినవ్వు**

ఈ పద్యం చదువుతుంటే ఇది ఆవో, బర్రెనో అనిపిస్తుంది. కాని కాదు. అది 'చెరువు'. ఇప్పుడు చెప్పినవన్నీ సరిజూసుకోండి. చెరువుకు కొమ్ములు (ర, వ లకు కొమ్ములుంటే రు, వు లు అవుతాయి) ఉంటాయి. కాని పొడువదుకదా! కట్టకట్టిన తర్వాత కదలకుండా ఉంటుంది. అక్కడిక్కడ పొర్లదు. ఈనదు. బంధమేస్తే (మడికట్లు కడితే), దానికి కావలసిన పాలు (వంతు) నీటిని ఇస్తుంది. దానికి ప్రత్యేకంగా మేతవెయ్యాల్సిన పనిలేదు. మేఘం కురిస్తేచాలు నిండుతుంది. అది నిండిందా? ప్రజల దరిద్రంబోతుంది. పంటలు పండడంవల్ల. ప్రజలకేకాదు ప్రాణులన్నిటికీ మేలు జరుగుతుంది. ఈ పద్యంలో చమత్కారమేకాదు, చెరువుల అవసరాన్ని నొక్కిచెప్పే సందేశం కూడా ఉన్నది.

పొడుపుకథలవల్ల ఆలోచనపెరుగుతుంది. భాషపెరుగుతుంది. మనం కూడ కొత్త పొడుపుకథలను తయారుచేసుకోవచ్చు, రుచిచూడవచ్చు.

SCERT TELANGANA

# 3 ప్రపంచ పదులు

- సి. నారాయణరెడ్డి

**చదువండి - ఆలోచించి చెప్పండి.**

ఆత్మవిశ్వాసం ఉన్న కొందరి చరిత్రే ప్రపంచ చరిత్ర. ఆ విశ్వాసం వ్యక్తిలోని దివ్యత్వాన్ని, చైతన్యాన్ని వెలికితీస్తుంది. మీరు దేన్నైనా సాధించగలరు. మిమ్మల్ని మీరు ఏవిధంగా తీర్చిదిద్దుకుంటారో, ఆ విధంగానే ఎదుగుతారు. బలహీనులుగా భావిస్తే బలహీనులుగానే మిగిలిపోతారు. బలవంతులమని భావించుకుంటే బలవంతులే అవుతారు. తనపై తాను విశ్వాసాన్ని కోల్పోతే అది మృత్యువుతో సమానం.

*- స్వామి వివేకానంద (భారతజాతికి నా హితవు)*

SCERT, TELANGANA

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

1. వ్యక్తిలోని దివ్యత్వాన్ని, చైతన్యాన్ని వెలికితీసేది ఏది?
2. మనలను మనం ఎట్లా మలుచుకోవాలి?
3. మృత్యువుతో సమానమైనది ఏమిటి?

**పాఠం ఉద్దేశం**

మనిషి సంఘజీవి. సమాజంలోని తోటివారిపట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. సామూహిక జీవనంలో నిరాశానిస్పృహలకు లోనుకాకుండా అనుకున్నది సాధించుటకు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. కష్టపడే తత్వాన్ని ఏర్పరుచుకోవాలి. లక్ష్యంవైపుగా సాగాలి అనే విషయాలపట్ల అవగాహన కలిగిస్తూ, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే మార్గాలను చూపిస్తూ, తెలుగు కవిత్వ ప్రక్రియలో 'ప్రపంచ పదులు' సాహిత్య ప్రక్రియను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.



విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం గేయ ప్రక్రియకు చెందినది. ఒక నిర్దిష్ట గేయగతిలో ఐదు పాదాలుగా సాగిపోయే మాత్రా ఛందస్సులోని ప్రక్రియ.

ప్రస్తుత పాఠ్యభాగం "డా॥ సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం" ఆరవ సంపుటిలోని ప్రపంచ పదులు లోనిది.

## రచయిత పరిచయం



29-07-1931
12-06-2017

పూర్వపు కరీంనగర్ జిల్లా నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా, హనుమాజీపేట గ్రామంలో జన్మించిన ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి ప్రముఖ కవి, సాహితీ పరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.

నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వంభర, మధ్యతరగతి మందహాసం, ప్రపంచ పదులు మొ॥న 70 పైగా కావ్యాలు రాశాడు. భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించబడ్డాడు. 'విశ్వంభర' కావ్యానికి జాతీయస్థాయిలో అత్యున్నతస్థాయి సాహితీ పురస్కారమైన "జ్ఞానపీఠ అవార్డ్"ను అందుకున్నాడు.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

☞ మీ ఉపాధ్యాయులు చెప్పే గేయాన్ని, దాని భావాన్ని శ్రద్ధగా వినండి.

☞ గేయాన్ని మీరు కూడా రాగంతో పాడండి.

☞ గేయాన్ని చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.


☞ గీత గీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

## I



1) కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది
చెక్కనిదే శిలకడుపున శిల్పమెలా పుడుతుంది
ఫలితం అందేది తీవ్రపరిణామంలోనె సుమా
మరగనిదే నీరు ఎలా మబ్బు రూపుకడుతుంది
నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది.

2) పక్షిరెక్కలకు మబ్బులు గొడుగులు పట్టినప్పుడే సార్థక్యం
పారేయేటికి పైరుగొంతులో పాడినప్పుడే సార్థక్యం
ఏ లక్ష్యానికి కట్టుపడక బతుకీడ్చుకుపోతే ఏం లాభం?
నేర్చిన చదువుకు జాతి జాతకం మార్చినప్పుడే సార్థక్యం
కట్టుబానిసకు సంకెళ్ళు మట్టిగరిచినప్పుడే సార్థక్యం.




SCERT, TELANGANA

### ఆలోచించండి - చెప్పండి

1. "ఫలితం అందుకోవాలంటే తీవ్రపరిణామాలను ఎదుర్కోవాలి" అని చెప్పడానికి కవి వేటిని ఉదాహరించాడు?
2. నేర్చిన చదువుకు సార్థక్యం ఎప్పుడు కలుగుతుంది?

## II

3) బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ
అసలు సిసలు పసఉంటే అవరోధించేదెవరు
అరసికు లేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ



4) ఎంత దున్నినా మట్టికి ఎప్పుడైన కలత ఉన్నదా
ఎంత ఉరికినా ఏటికి ఎప్పుడైన నలత ఉన్నదా
అంతలోనె ఉసూరంటు అలసిసొలసి పోతున్నారా?
ఎంత ఎగిసినా నింగికి ఎప్పుడైన కొరత ఉన్నదా
ఎంత పీల్చినా గాలికి ఎప్పుడైన కోత ఉన్నదా?

**ఆలోచించండి - చెప్పండి**

1. 'అసలు సిసలు శక్తి ఉంటే మనలను ఎవరూ అడ్డుకోరు' అంటే మీకేమి అర్థమైంది?
2. మట్టిని, ఏరును, నింగిని, గాలిని చూసి మనం ఏం నేర్చుకోవాలి?



SCERT, TELANGANA

## సారాంశం

1) కొవ్వొత్తి కరిగితేనే కాంతి నివ్వగలుగుతుంది. రాయిని చెక్కినప్పుడే శిల్పంగా మారుతుంది. తీవ్రమైన మార్పులకు సిద్ధమైనప్పుడే ఫలితం దక్కుతుంది. ఎండవేడికి బాగా కాగిన నీరే ఆవిరై మబ్బుగా మారుతుంది. నాట్యమైనా, మరేదైనా ఆదరించబడాలంటే నిత్యం సాధన చేయాలి. కష్టపడడం ద్వారానే ఏ విజయమైనా, ఫలితమైనా వస్తుంది.

2) పక్షి వంటి అల్పప్రాణులకు నీడ ఇచ్చినప్పుడే మబ్బులకు ఒక ప్రయోజనం కలుగుతుంది. ఏ విధమైన లక్ష్యాన్ని పెట్టుకోకుండా సాదాసీదాగా బతుకుతూపోతే ఏమి ఉపయోగం? మానవ జీవితాలకు మేలు కలిగించినప్పుడే నేర్చుకున్న చదువుకు ప్రయోజనం. వెట్టిచాకిరి బంధనాలు తెగిపోయినప్పుడే, కష్టజీవుల బతుకులకు ప్రయోజనం దక్కినట్లు. స్వార్థాన్ని వదిలిపెట్టి ఇతరులకు ఉపయోగపడినప్పుడే మనిషి జీవితం సార్థకం అవుతుంది.

3) బురదలో పుట్టినంత మాత్రాన పద్మానికి విలువ తగ్గదు. తరాలుగా తాటాకుల మీదనే ఉన్నప్పటికినీ పద్యానికి విలువ తగ్గదు. అసలు సిసలు శక్తివున్నప్పుడు దాన్ని ఎవరూ అడ్డుకోలేరు. రసికత తెలియనివారు ఆదరించకపోయినా గానం (పాట) విలువ తగ్గదు. మూర్ఖులు ఎన్ని విధాలుగా ప్రయత్నించి అడ్డగించినా జ్ఞానం విస్తరణను ఆపలేరు. నిజమైన ప్రతిభకు, కళకు ఎప్పుడైనా శాశ్వత విలువ, గుర్తింపు లభిస్తుంది.

4) తరతరాలుగా మట్టిని దున్నుతున్నప్పటికినీ అది బాధపడదు. అలాగే ఎల్లప్పుడూ పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే ఏటికి కూడా అనారోగ్యం ఉండదు. మరి యీ కొద్ది ప్రయాణానికే అలసిపోయే మానవులారా! ఆలోచించుకోండి. ఎంత ఎత్తుకు ఎగిరినప్పటికీ ఆకాశానికి అంతు ఉండదు. ప్రాణికోటి ఎంత పీల్చుకుంటున్నా గాలికి కరువు ఉండదు. మనిషి కూడా ఇటువంటి చైతన్యంతో ఉన్నతమైన లక్ష్యం కోసం కృషిచేయాలి.

SCERT, TELANGANA

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడడం

**అ) కింది ప్రశ్నలకు జవాబులను చెప్పండి.**

1) మనిషికి ఏవిధమైన లక్ష్యం లేకుండా సాదాసీదాగా గడుపడం మంచిదా? ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకొని అందుకోసం కృషిచేయడం మంచిదా? చర్చించండి.

2) గేయాన్ని రాగయుక్తంగా పాడండి.





- మహాభారతం

## ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) గేయంలోని ప్రాసపదాలను గుర్తించి రాయండి.**

ఉదా: కలత ఉన్నదా - నలత ఉన్నదా

1) ______________ - ______________

2) ______________ - ______________

3) ______________ - ______________

4) ______________ - ______________

**ఆ) పాఠాన్ని చదువండి. కింది భావాలకు సమానమైన గేయ పంక్తులను గుర్తించి రాయండి.**

1) నాట్యమైనా, మరేదైనా ఆదరించబడాలంటే నిత్యం సాధన చేయాలి.

2) ఎంత పీల్చుకుంటున్నా గాలికి కరువు ఉండదు.

3) మానవ జీవితాలకు మేలు కలిగించినప్పుడే నేర్చుకున్న చదువుకు ప్రయోజనం.

4) నిజమైన ప్రతిభకు, కళకు ఎప్పుడైనా శాశ్వత విలువ, గుర్తింపు లభిస్తుంది.

**ఇ) ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సామల సదాశివ ఉర్దూలోని అమ్జద్ రుబాయిలను తెలుగులోకి అనువాదం చేశాడు. వాటిలోని రెండు రుబాయిలను చదువండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.**

నిన్ను నీవు గుర్తింప లేకున్న యెడల
ఇంతవరకు సాధించినదంత వృథయె
పుడమి యంతయు నీకు లోబడిన నేమి
నిన్ను నీవు లోబరచు కోకున్న వృథయె

ఫలము వలతేని విత్తనమలికి చూడు
పడయ దలచిన సర్వంబు విడిచి చూడు
యొక్కసారి స్వార్థము వీడి యొరుల వాడ
వై సమములేని యానంద మంది చూడు

**ప్రశ్నలు :**

1) నీవు ఇంతవరకు సాధించినది ఎప్పుడు వృథా అవుతుంది?

2) 'నిన్ను నీవు లోబరచుకోవడం' అంటే నీకేమర్థమైంది?

3) ఫలం కావాలంటే ఏం చేయాలి?

4) విడిచిపెట్టాల్సినదేది?

5) అనంతమైన ఆనందం ఎప్పుడు కలుగుతుంది?



SCERT TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) సి. నారాయణరెడ్డి గారి గురించి రాయండి.

2) 'కష్టపడడం ద్వారానే ఏ ఫలితమైనా లభిస్తుంది' అని నీవు ఎలా చెప్పగలవు?

3) 'ఏ లక్ష్యానికి కట్టుపడక బతుకీడ్చుకుపోతే ఏం లాభం?" అంటే నీకేమి అర్థమైంది?

4) మనిషి చిన్న చిన్న పనులకే అలసిపోకుండా లక్ష్యాన్ని సాధించాలంటే వేటి నుండి ప్రేరణ పొందాలి?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) 'మనం ఏర్పరచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే తీవ్రకృషిచేయాలి' పాఠం ఆధారంగా వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.**

1) ప్రముఖ వ్యక్తి మీ పాఠశాలకు వస్తే ఆయన గురించి తెలుసుకోవడానికి ప్రశ్నావళిని తయారుచేయండి.

( లేదా )

2) 'జీవితంలో అనుకున్నది సాధించాలంటే ఆటంకాలకు భయపడకుండా ముందుకు వెళ్ళాలి.' అనే విషయాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

**ఉదా:** రక్తికట్టుట

మా ఊరి యువకులు వేసిన హరిశ్చంద్ర నాటకం ఎంతో రక్తికట్టింది.

1) బురద : ____________________

2) బతుకీడ్చుట : ____________________

SCERT, TELANGANA

**ఆ) గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

**ఉదా:** నింగిలో నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి.

నింగి - ఆకాశం

1) వానలు బాగా కురిస్తే పంటలకు కొరత ఉండదు. ____________

2) మనం చదివిన దానిలో పస ఉండాలి. ____________

3) కోత కొచ్చిన పంట వర్షాలవల్ల నీటిలో మునిగిపోయింది. ____________

**ఇ) కింది వాక్యాలలో పర్యాయపదాలను గుర్తించి గీత గీయండి.**

**ఉదా:** బురదలో అడుగేస్తే ఆ అడుసును నీళ్ళతో కడుగాలి. లేకపోతే ఆ పంకము ఉన్న కాళ్ళతో ఇంటిలో నడిస్తే ఇల్లంతా బురద అవుతుంది.

1) పద్మములు కొలనులో వికసిస్తాయి. వికసించిన సరోజములను భగవంతునికి సమర్పించాలి.

2) సూర్యకాంతి ఎంతో మంచిది. ఆ దీప్తితో ప్రపంచం మేల్కొంటుంది.

**ఈ) ఈ కింది పదాలను కలుపుతూ అర్థవంతమైన వాక్యాలను తయారుచేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| సూర్యుడు | | | | కలువలు విచ్చుకున్నాయి |
| వెన్నెల | | కి | | పర్యాయ పదం |
| బల్బు | కాంతి | | | వెదజల్లుతాడు |
| దీప్తి | | ని | | ఇస్తుంది |

## వ్యాకరణాంశాలు

**అ) కింది వాక్యాలలోని 'కర్త, కర్మ, క్రియ' లను గుర్తించండి. వాటిని రాయండి.**

| | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| 1) రాము అన్నం తిన్నాడు. | ______ | ______ | ______ |
| 2) పోతన భాగవతం రాశాడు. | ______ | ______ | ______ |
| 3) వారు తిరుపతికి వెళ్ళారు. | ______ | ______ | ______ |

SCERT, TELANGANA

## సామాన్య వాక్యం

★ కింది వాక్యాలను చదువండి. పరిశీలించండి.

1) నితిన్ పరీక్షలు బాగా రాశాడు.

2) తుమ్మెదలు పువ్వులలోని తేనెను తాగాయి.

3) నెమలి నాట్యం చేస్తున్నది.

**పై వాక్యాలలోని కర్త, కర్మ, క్రియ లను గుర్తించండి.**

ఇట్లా సాధారణంగా కర్త, కర్మ, క్రియ కలిగిన వాక్యాన్ని **'సామాన్య వాక్యం'** అంటారు.

## సంశ్లిష్ట వాక్యం

★ కింది వాక్యాలను చదువండి. వాటిని కలిపిరాసిన విధానం చూడండి.

1) శిల్ప కాలేజికి వెళ్ళింది. శిల్ప చదువుకున్నది.

- శిల్ప కాలేజికి వెళ్ళి చదువుకున్నది.

2) మైత్రి ప్రాజెక్టుపని చేసింది. మైత్రి ప్రాజెక్టు పనిని అందరికీ చూపించింది.

- మైత్రి ప్రాజెక్టుపని చేసి, అందరికీ చూపించింది.

**పై వాక్యాలను కలిపి రాసినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.**

రెండు లేక మూడు వాక్యాలను కలిపి రాసేటప్పుడు చివరి వాక్యంలోని సమాపక క్రియ అట్లాగే ఉంటుంది. ముందు వాక్యాల్లోని సమాపక క్రియలు అసమాపక క్రియలుగా మారుతాయి. కర్త మళ్ళీ మళ్ళీ రాదు. ఇట్లా రాసిన వాక్యాన్ని **'సంశ్లిష్ట వాక్యం'** అంటారు.

**అ) కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా రాయండి.**

1) దీపిక అన్నం తిన్నది. దీపిక బడికి వెళ్ళింది.

______________________________

2) మహేశ్ లడ్డూలు తెచ్చాడు. మహేశ్ లడ్డూలు అందరికీ పంచాడు.

______________________________

3) సలీం గాంధీజీ ఆత్మకథ చదివాడు. సలీం ఎన్నో మంచి విషయాలు తెలుసుకున్నాడు.

______________________________

4) ఉపాధ్యాయుడు నిన్న రవి ఇంటికి వచ్చాడు. ఉపాధ్యాయుడు రవిని బడికి ఎందుకు రాలేదని అడిగాడు.

______________________________

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ తెలుగువారిలో జ్ఞానపీఠ్ అవార్డు పొందిన ముగ్గురిలో సి. నారాయణ రెడ్డి ఒకరు. మిగతా ఇద్దరి గురించి వివరాలు సేకరించి ప్రదర్శించండి.

SCERT TELANGANA

సూక్తి

అందరిలోనూ మంచిని చూడటం నేర్చుకుంటే
మనలోని మంచి పెరుగుతుంది.

– రామకృష్ణ పరమహంస

# చదువండి – తెలుసుకొండి

## హెలెన్ కెల్లర్



నా నేస్తాలు ఏమేం చూస్తారో తెలుసుకోవడానికి అప్పుడప్పుడు పరీక్షించే దానిని. ఈ మధ్య ఒక నేస్తం అడవిలో ప్రయాణించిందని తెలిసి "నువ్వేం చూశావ్?" అని అడిగాను ఎంతో ఉత్సుకతతో. "ఏమీ లేదు!" అనేసింది మామూలుగా!

ఆ మాటలకు నాకు ఆశ్చర్యం కలుగలేదు. ఎందుకంటే ఇలాంటి మాటలు వినడం అలవాటైంది. నిజంగా కళ్ళున్నవాళ్ళు చాలా తక్కువగా చూస్తుంటారన్న నమ్మకం నాకు నానాటికీ బలపడుతుందే కాని తగ్గడంలేదు. ఎవరైనా ఒక గంటసేపు అడవిలో తిరిగినా ఏ విశేషమూ చూడలేకపోవడం సంభవమేనా? అసలు ఏమాత్రం చూడలేని నేను, నా చుట్టూ ఉన్న ప్రకృతిని, పరిసరాలను, ప్రపంచాన్ని, గగుర్పాటు కలిగించే కోట్లకొద్ది విషయాలను నా స్పర్శ ద్వారా గ్రహిస్తుంటాను.

ఈ మాటలు అన్నది ఎవరోకాదు ఆమెనే 'హెలెన్‌కెల్లర్'. చిన్నప్పుడే భయంకరమైన వ్యాధితో చూపును, శ్రవణశక్తినీ, భాషణ శక్తినీ కోల్పోయింది. బ్రెయిలీ లిపి ద్వారా అక్షరాలు నేర్చుకొని, చదువడం నేర్చుకొన్నది. ఉన్నత చదువులు చదివి బ్రెయిలీ లిపిలో 'నా ఆత్మకథ' పేరుతో తన జీవిత విశేషాలను రాసింది.

ప్రపంచమంతా తిరిగి 'ప్రత్యేక అవసరాలున్న' పిల్లలను కలిసి వాళ్ళలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. మామూలు మనుషులకు కళ్ళు రెండేకానీ, ఆమె శరీరమంతా స్పర్శరూప నేత్రాలున్నాయి. ప్రతి స్పర్శకూ ఆమె మనసారా అనుభూతిపొంది, తన భావాలను అనర్గళంగా ప్రకటించేది. తనలాంటి వాళ్ళ జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి హెలెన్ కెల్లర్.

SCERT, TELANGANA

# 4 భాగ్యోదయం

– కృష్ణస్వామి ముదిరాజ్

చదువండి – ఆలోచించి చెప్పండి.



ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. పై బొమ్మలో మీకేమి కనిపించింది?
2. మొదటి చిత్రంలోలాగా ఉన్నవాళ్ళని మీరు చూశారా?
3. మొదటి చిత్రంలోవారికి రెండవ చిత్రంలో వారికి తేడా ఉందా? ఏమిటి?
4. పై చిత్రాల ద్వారా మీకేమర్థమైంది?

## పాఠం ఉద్దేశం

మానవులంతా సమానమే. అన్ని వర్గాల వాళ్ళకూ సామాజిక భాగస్వామ్యం మరియు చైతన్యం ఎంతో అవసరం. చైతన్యం రావాలి అంటే చదువుకోవడం ముఖ్యం. అన్ని వర్గాల వారికి చదువు ప్రాధాన్యతను వివరించి, వారిని ఉత్తేజపరచడానికి నడుం బిగించాలి అని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'జీవిత చరిత్ర' అనే ప్రక్రియకు చెందినది. వ్యక్తుల విశిష్టతలను తెలుపుతూ రాసే గ్రంథమే 'జీవిత చరిత్ర'. సమాజ అభ్యున్నతికి కృషిచేస్తూ, సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల జీవిత చరిత్రను రాస్తారు. భాగ్యరెడ్డి వర్మ కుమారుడు ఎమ్.బి. గౌతమ్ 'భాగ్యరెడ్డి వర్మ జీవితచరిత్ర' అనే గ్రంథం సంకలనం చేసాడు. ఆ గ్రంథంలోని కృష్ణస్వామి ముదిరాజ్ రాసిన అంశమే ఈ పాఠ్యభాగం.

## రచయిత పరిచయం



25-08-1893
15-12-1967

కృష్ణస్వామి ముదిరాజ్ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత విద్యావేత్త, విలేఖరి. పేదరైతు కుటుంబంలో జన్మించిన ఈయన హైదరాబాదులో విద్యాభ్యాసంచేసి హైదరాబాదు నగరానికి మేయర్‌గా పనిచేసి అభివృద్ధికి పాటుపడ్డాడు. 'దక్కన్‌స్టార్' అనే ఆంగ్ల వార పత్రికను స్థాపించి సంపాదకునిగా ఉండి విలువైన సంపాదకీయాలు, వ్యాసాలు రాశాడు.

హైదరాబాద్ చరిత్రను తెలుసుకోవడానికి ఈయన రచనలు ప్రామాణికాలు. 'పిక్టోరియల్ హైదరాబాద్' అనే అద్భుతమైన గ్రంథాన్ని దృశ్యరూపంగా మనకు అందించాడు. తన మిత్రుడు భాగ్యరెడ్డి వర్మతో కలిసి దళితుల అభ్యున్నతికి కృషి చేశాడు.

## విద్యార్థులకు సూచనలు

- మీ ఉపాధ్యాయులు చెప్పే పాఠం వినండి.
- పాఠాన్ని చదువండి. ఇంతవరకు మీరు తెలుసుకున్న విషయాలు పాఠంలో ఉన్నాయో, లేదో చెప్పండి.
- పాఠం చదువండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

SCERT, TELANGANA

## I

తన జాతి జనుల బాగుకోసం చిన్నప్పటి నుండే అంకితమయిన భాగ్యరెడ్డి వర్మ 1888లో పుట్టినాడు. ఆయన చిన్నప్పుడు చదువుకున్న చదువే ఆయన జీవిత గమనాన్ని నిర్దేశించింది. అంటరాని వర్గాలు అప్పటికి అనుభవిస్తున్న అవస్థల నుంచి గట్టెక్కించడానికి ఆయన అంకిత భావంతో పని చేశాడు. తాను చదివిన చదువు వల్ల కులవ్యవస్థ అంటే ఏమిటో దాని నిజస్వరూపం ఎటువంటిదో అవగతమయింది. ఇందుకు ధర్మశాస్త్రాలను, చరిత్రను బాగా చదివినాడు. వాటి వల్ల అంటరాని వర్గాల కడగండ్లను అర్థం చేసుకోవడానికి వాటిని నిర్మూలించి వారిలో సామాజిక వికాసం కలిగించడానికి ఆయనకు దారి దొరికినట్టయింది.




అత్యంత ముఖ్యమయిన ఈ పనికి సంబంధించి ఆచరణ, ఆలోచనలో ఆయన పూర్తి స్వేచ్ఛను అనుభవించాడు. స్వతంత్రంగా పని చేశాడు. ప్రభుత్వపక్షం నుంచి సైతం ఆయనకు అండ దొరికింది. అణగారిన కులాల నాయకులతో కూడా ఈ క్రమంలో పరిచయం పెరిగింది. క్రమ క్రమంగా వారి నుంచి సహకారం, నైతిక మద్దతు కూడగట్టుకున్నాడు. గొప్ప మనుషులలో, సంస్కర్తలలో ఉండే చిత్తశుద్ధిని అలవర్చుకుని ఆయన అంటరాని వర్గాల ఉన్నతి కోసం సంస్కరణ మొదలు పెట్టాడు.

ఒకవేళ హిందూమతం, హిందువులు తమ చరిత్రను లిఖిత బద్ధం చేయాలనుకుంటే సంస్కర్తగా భాగ్యరెడ్డివర్మ పేరు మొదటిస్థానంలో ఉంటుంది. అణగారినవర్గాల వికాసానికి ఆయన తన సమస్తాన్ని అర్పించాడు. తన తెలివితేటలను అందుకోసమే వెచ్చించాడు. ఏమీ ఆశించకుండా, తమకోసం ఎప్పటికీ పనిచేసే ఆయనను చూసి అంటరాని వర్గాలన్నీ ఆయనను తిరుగులేని నాయకునిగా ఒప్పుకున్నాయి.

SCERT, TELANGANA

చిత్తశుద్ధి, నిజాయితీ, పట్టుదలతో పనిచేసే వర్మ అచిరకాలంలోనే వారి నమ్మకాన్ని చూరగొనగలిగాడు. తమ దుస్థితికి కారణం తమ అజ్ఞానం, ఉదాసీనతేనన్న ఎరుకను తన అనుచరులలో కలిగేటట్టు చేయగలిగాడు.

మనుషులంతా పుట్టుకతో సమానమని, ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ కాదన్న సత్యాన్ని తెలుసుకునేటట్టు చేశాడు. అయితే లోలోపల జీర్ణించుకుపోయిన మూఢనమ్మకాలు అజ్ఞానాన్ని తొలగించడం అంతగా సులువుకాదన్నది తెలిసిందే. అయితే కొద్ది కొద్దిగానే అయినప్పటికీ ఆయన నిరంతర శ్రద్ధ వల్ల అంటరాని వర్గాలు చదువుపై చూపు పెట్టడం సాధ్యమైంది. ఇందువల్ల కొన్ని సాంఘిక దురాచారాలు మటుమాయం కావడం జరిగింది.

**ఆలోచించండి - చెప్పండి**

1. భాగ్యరెడ్డి వర్మ అణగారిన ప్రజల నైతిక మద్దతును ఎలా సంపాదించాడు?
2. భాగ్యరెడ్డి వర్మ ఏమి చదువుకున్నాడు?

## II

ఆయన అనేక బహిరంగ సభలు నిర్వహించాడు. సామాజిక స్వచ్ఛత గురించి చెప్పి తన జాతి జనులను ఏకతాటిపై నడుపగలిగాడు. ఆయన చేపట్టిన పనులలో కెల్లా మరుపురానిది దేవదాసి, వేశ్యా సంప్రదాయాలను అడ్డుకోవడం. పసివాళ్ళయిన ఆడ, మగ పిల్లలను దేవునికి వదిలి వేయడాన్ని తీవ్రంగా నిరసించాడు. తాగుడు వలన కుటుంబాలు ఎట్లా గుల్లగా మారిపోతాయో కుల పెద్దలకు ఆ మహమ్మారి గురించి చెప్పి వారిని మానిపించగలిగినాడు. నిరంతరం తన కార్యాచరణకు దొరికే సహకారంవలన ఆయన కొన్ని కుటుంబాలను ఈ దురాచారాలనుంచి బయటపడేలా చేశాడు.

ప్రతి ఏటా జరిగే మత సాంఘికసభలకు ఆయన హాజరయ్యేవారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రముఖులపై ఆయన ప్రభావం ఎంతగానో ఉండేది. ఆంధ్రమహాసభ, ఆదిహిందూ మహాసభ, అఖిలభారత అంటరానివర్గాల సభ వంటి సంస్థలు జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక సభలలో ఆయన చురుకుగా పాల్గొన్నాడు. ఆయన పాల్గొన్న ప్రతి సభలో తన జాతి జనులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై వివరంగా చెప్పేవాడు. ఆయన జన జీవితంలో కాలు పెట్టినదాదిగా మొత్తం 3,348 ఉపన్యాసాలు ఇచ్చినట్టు తేలింది. ఆయన అణగారిన వర్గాలలో చైతన్యాన్ని తేవడానికి కృషి చేసినాడు.

1925లో న్యాయమూర్తి రాయ్‌బాల ముకుంద్ అధ్యక్షత వహించిన ఒక సభలో హైదరాబాద్ సంస్థానంలో గల ఆది హిందువుల ప్రతినిధులంతా ఆయనను తమ మార్గదర్శకునిగా ఎన్నుకున్నారు. ఇది ఏ సామాజిక వర్గపు నాయకునికైనా గర్వకారణమవుతుంది. ఆయన 1925లో ఆదిహిందువుల ఆటల ప్రదర్శన నిర్వహించి, ఆదిహిందూ యువతీయువకులు సవర్ణ యువతీ యువకులతో సమంగా రాణిస్తారని నిరూపించాడు.

ఆది హిందువుల మేలుకోసం వర్మ నిరంతరం చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది ప్రముఖుల మనసులను చూరగొని వారు ఆదిహిందువులకు దగ్గరయ్యేలా చేసింది. భాగ్యరెడ్డివర్మ నిరంతర కార్యాచరణ సభల వలన ఆదిహిందూ సమాజం జాగరూకమయ్యింది. ఆదిహిందువులు సొంతకాళ్ళ మీద నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమని వర్మ బలమయిన నమ్మకం. ఈ విషయంలో ఆయన ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తన బాధ్యతను గుర్తించేలా చేశాడు.

SCERT TELANGANA

కృషి, పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఆదిహిందువుల కోసం ఎన్నో పాఠశాలలు నెలకొల్పింది. 1931 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా వర్మ ఎంతగానో శ్రమపడి అంటరాని వర్గాలను ఆది హిందువులుగా నమోదు చేయించాడు. ఇది ఆయన నాయకత్వ పటిమకు మచ్చుతునక. హిందూ సమాజం మొత్తంగా ఆయనకు ఋణపడి ఉండాలె. ఆ చర్యతో హిందూ సమాజాన్ని ఆయన చీలికలు, పేలికలు కాకుండా రక్షించగలిగాడు.

**ఆలోచించండి - చెప్పండి**

1. భాగ్యరెడ్డి వర్మ ఏయే దురాచారాలను రూపుమాపాడు?
2. ఆది హిందువులు అంటే ఎవరు?

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడటం

**అ) కింద ఇచ్చిన అంశాన్ని గురించి మాట్లాడండి.**

1) మనం చిన్నప్పుడు చదువుకున్న చదువు మన జీవిత గమనాన్ని మారుస్తుంది.

### ధారాళంగా చదవడం - అర్థం చేసుకోవడం

**అ) కింది వాక్యాలు చదువండి. పాఠంలో ఏ పేరాలో ఉన్నాయో గుర్తించండి. పేరా యొక్క సంఖ్యను ఇచ్చిన డబ్బా ' ' లో రాయండి.**

1) మనుషులంతా పుట్టుకతో సమానమనీ, ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ కాదన్న సత్యాన్ని తెలుసుకునేటట్లు చేశాడు. [ ]

2) ఆది హిందువులు సొంతకాళ్ళపై నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమని వర్మ బలమైన నమ్మకం. [ ]

3) ఇది ఆయన నాయకత్వ పటిమకు మచ్చుతునక. [ ]

**ఆ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.**

అణగారిన ప్రజల గొంతుక, మహిళా చైతన్యానికి ప్రతీక, సంస్కరణాభిలాషి శ్రీమతి తక్కెళ్ళ నారాయణ సదాలక్ష్మి. సదాలక్ష్మి 1928 డిసెంబర్ 23న సికింద్రాబాద్‌లో జన్మించింది. లింగ వివక్ష, అంటరానితనం వంటి జాఢ్యాలు అమితంగా ఉన్న ఆ రోజులలో ఆమె బయటికి వచ్చి విద్యను అభ్యసించింది. ఆమె ప్రాథమిక విద్య బొల్లారంలో, పాఠశాల ఉన్నత విద్య 'కీస్ హైస్కూల్' లో జరిగింది. పేదరికం, అంటరానితనం పేరుతో కులవివక్ష ఎదుర్కొంటున్న సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సదాలక్ష్మి లాంటి అమ్మాయి కాలేజీ చదువు

SCERT, TELANGANA

పూర్తిచేయడం అరుదైన విషయం. సేవాభావం కలిగిన ఆమె తనకు లభించిన స్కాలర్‌షిప్ డబ్బులను పేద విద్యార్థుల కొరకు ఖర్చుచేసేది. ఒకసారి దళితుల హక్కులకై జరుగుతున్న ఉద్యమంలోని సభలో బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసంగం సదాలక్ష్మిపై తీవ్రప్రభావం చూపింది. ఆ ప్రభావంతో నాడు మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న వివక్షను నిరసిస్తూ వారి హక్కుల కోసం ఉద్యమించింది. ఆ ఉద్యమాలే ఆమె రాజకీయ రంగ ప్రవేశానికి నాంది పలికాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, శాసనసభ తొలి మహిళా డిప్యూటి స్పీకరుగా పనిచేసిన సమర్థురాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధైర్యసాహసాలు కలిగిన తెలంగాణా విశిష్ట మహిళ సదాలక్ష్మి.

ప్రశ్నలు :

1) సదాలక్ష్మి ఎప్పుడు జన్మించింది?

2) ఆ రోజులలో గల జాఢ్యాలు ఏమిటి?

3) ఎవరి ప్రసంగం సదాలక్ష్మిపై ప్రభావం చూపించింది?

4) సదాలక్ష్మి ఎవరి హక్కుల కోసం ఉద్యమించింది?

5) "తెలంగాణా విశిష్ట మహిళ సదాలక్ష్మి" అని ఎందుకు అన్నారు?

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) భాగ్యరెడ్డి వర్మను తిరుగులేని నాయకుడిగా చేసిన అంశాలు ఏమిటి?

2) అణగారిన వర్గాల్లో చైతన్యం తేవడానికి భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషిని వివరించండి.

3) చిత్తశుద్ధితో పనిచేయడం అంటే ఏమిటి?

4) 'మానవులంతా సమానమే' అనే భావన కలగడానికి ఏమి చేయాలి?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను పారద్రోలడానికి మీరు ఏమి చేయగలరో వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.**

1) అంటరానితనాన్ని రూపుమాపే అంశాన్ని ప్రధానంగా తీసుకుని ఒక కథను రాయండి.

( లేదా )

2) ఒక సంఘ సంస్కర్తను ఇంటర్వ్యూ చేయడానికి 'ప్రశ్నావళి' ని తయారుచేయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) నిర్మూలించి : ____________________

2) ఆచరణ : ____________________

3) దురాచారము : ____________________

**ఆ) గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1) పది సంవత్సరములకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.

2) రైతు కృషి వలన పంటలు పండుతాయి.

**ఇ) కింద ఇచ్చిన పదాల వరుసలలో సంబంధంలేని పదాలకు సున్న ‘◯’ చుట్టండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1) | బంతి | జామ | చామంతి | గులాబి |
| 2) | బస్సు | కారు | నావ | ఆటో |
| 3) | పుస్తకము | కన్ను | పెన్ను | పెన్సిలు |
| 4) | కంప్యూటరు | ఫోను | టి.వి. | బండి |
| 5) | కలుపు | నలుపు | తెలుపు | పసుపు |

### వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను కలిపి రాయండి.**

1) అవరోధించేది + ఎవరు = ____________________

2) శిల్పము + ఎలా = ____________________

3) అంకితము + అయిన = ____________________

**ఆ) కింది పదాలను విడదీయండి.**

1) దగ్గరయ్యేలా = __________ + __________

2) మార్గమని = __________ + __________

3) ఎప్పుడైనా = __________ + __________

SCERT, TELANGANA

## సమాసం

★ కింది వాక్యాల్లో గీత గీసిన పదాలను గమనించండి.

1) ఎడ్ల బండికి <u>రెండు చక్రాలు</u> ఉన్నాయి.

2) శతకంలో <u>వంద పద్యాలు</u> ఉంటాయి.

3) <u>తల్లిదండ్రులు</u> దైవంతో సమానము.

పై వాక్యాల్లో గీత గీసిన పదాలు చదివారు కదా! ఆ మాటల్లో ఎన్ని పదాలు కలిసి ఉన్నాయో చెప్పండి.

రెండు చక్రాలు - రెండు, చక్రాలు

వంద పద్యాలు - వంద, పద్యాలు

తల్లిదండ్రులు - తల్లి, తండ్రి

ఈ విధంగా రెండు లేదా అంతకంటె ఎక్కువ పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడటాన్ని 'సమాసం' అంటారు. సమాసం యొక్క అర్థాన్ని వాక్యరూపంలో చెప్పేదే **'విగ్రహ వాక్యం'**.

## ద్విగు సమాసం

★ కింది సమాస పదాలను, విగ్రహ వాక్యాలను గమనించండి.

| | సమాసం | విగ్రహ వాక్యం |
|---|---|---|
| 1) | పది తలలు | పది సంఖ్య గల తలలు |
| 2) | ఆరు రుచులు | ఆరు సంఖ్య గల రుచులు |
| 3) | ఏడు రంగులు | ఏడు సంఖ్య గల రంగులు |

పై ఉదాహరణలలో మొదటి పదాలు సంఖ్యను చెప్పేవిగా (పది, ఆరు, ఏడు) ఉన్నాయి. ఈ విధంగా సమాసములో మొదటి పదం సంఖ్యను చెప్పేదిగా ఉంటే దానిని 'ద్విగు సమాసం' అని అంటారు.

అ) కింది పదాలకు విగ్రహ వాక్యాలను రాయండి.

1) రెండు చేతులు : ______________________

2) పద్దెనిమి పురాణాలు : ______________________

3) పంచ పాండవులు : ______________________

### భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషిచేసిన వారిలో ఎవరైనా ఇద్దరు సంఘ సంస్కర్తల గురించి సమాచారాన్ని సేకరించి తరగతి గదిలో ప్రదర్శించండి.

SCERT, TELANGANA

## సూక్తి

"అత్యున్నతమైన లక్ష్యాన్ని చేపట్టండి.
దాన్ని సాధించేందుకు మీ జీవితాన్నంతా ధారపోయండి."

"పట్టు వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది."

– స్వామి వివేకానంద

# చదువండి – తెలుసుకొండి

స్ఫూర్తి ప్రదాత

## పి. వి. నరసింహా రావు



"ఆయన దేశభక్తిని నిలువెల్లా నింపుకున్న రాజనీతిజ్ఞుడు. రాజకీయ వ్యవస్థ కంటే దేశమే అధికమని గట్టిగా విశ్వసించిన మహామనీషి."

– డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలాం

భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, విద్యావేత్త అయిన అబ్దుల్ కలాం పై మాటలు ఎవరి గురించి అన్నాడో తెలుసా? మన తెలుగువాడు, మొదటిసారి దక్షిణాది నుండి దేశ ప్రధానిగా ఎన్నిక కాబడినవాడు, తెలంగాణ ముద్దుబిడ్డ అయిన పి.వి.నరసింహారావు గురించి.

తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహామేధావి పి.వి.నరసింహారావు. ఆయన పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. ఆయన బహుభాషా కోవిదుడు, రచయిత, కవి, సాహితీవేత్త, వక్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, పరిపాలనాదక్షుడు, అన్నిటికి మించి ప్రజాసేవాపరాయణుడు. బహుముఖ ప్రతిభాసంపన్నుడు.

శాసనసభ్యుడిగా, రాష్ట్ర విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడిగా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా, మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశాన్ని ప్రగతిపథంవైపు నడిపించిన ధీశాలి పి.వి.నరసింహారావు. ఆయన జీవిత విశేషాలను తెలుసుకుందాం.

వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లి గ్రామంలో 28 జూన్ 1921న సీతారామారావు, రుక్మాబాయమ్మ పుణ్యదంపతులకు పి.వి.నరసింహారావు జన్మించాడు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వరంగల్ అర్బన్ జిల్లా భీందేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రత్నాబాయిలు పి.వి.ని దత్తత తీసుకున్నారు.

1924లో బాసర జ్ఞానసరస్వతి సన్నిధిలో తలిదండ్రులు అతనికి అక్షరాభ్యాసం చేయించారు. వంగర ప్రభుత్వ పాఠశాలలో ఓనమాలు దిద్దాడు. అటు తర్వాత వేలేరు, హుజురాబాద్‌లలో విద్యాభ్యాసం కొనసాగించాడు. ఏడో తరగతి నుండి పదో తరగతి వరకు హన్మకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. 1936లో మెట్రిక్ పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకం సాధించాడు.

చిన్నప్పుడు గణితం, విజ్ఞానశాస్త్రం అంటే ఎక్కువ ఇష్టపడేవాడు. చదువులోనే కాదు ఆటల్లో కూడా ఆరితేరినవాడే. ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలను బాగా ఆడేవాడు. భాష, సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం

SCERT, TELANGANA

వంటి విషయాలలో ఆసక్తి చూపేవాడు. లలిత సంగీతం, భజనలు, కీర్తనలు చక్కగా పాడేవాడు. చదువుకునే రోజుల్లో తానెప్పుడు క్లాస్ ఫస్టే అని, సెకండ్ రావటం ఎరుగనని 'ఐ విట్నెస్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒకసారి పి.వి. చెప్పాడు.

1938లో నిజాం రాష్ట్ర వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనడం చేత ఆయన రాష్ట్రంలో ఎక్కడా చదువకుండా ఆయనను కట్టడి చేశారు. పై చదువుల నిమిత్తం ఆయన మహారాష్ట్రలోని పూనె చేరుకున్నాడు. అక్కడ బియస్సీ పూర్తిచేశాడు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పట్టా పొందాడు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ ప్లీడర్‌గా పనిచేశాడు. బూర్గుల వ్యక్తిత్వం, న్యాయశాస్త్రంలో వారికిగల పరిజ్ఞానం వారు కేసులు వాదించే తీరును బాగా పరిశీలించేవాడు. వారి అడుగుజాడలలో నడుస్తూ సమర్థతతో కేసులు వాదించి మంచి న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నాడు. హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్యంపొందిన తరువాత స్వామి రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్‌కు అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఆయన లక్ష్యాలు, స్పష్టంగా ఉండేవి. యువకుడైన పి.వి.నరసింహారావు వారిని గురుతుల్యులుగా భావించేవాడు. రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం తేవటంలో వారికి అండగా నిలిచి తనకు వారసత్వంగా లభించిన భూమిలో కొంత భాగాన్ని దానంగా ఇచ్చాడు. ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకుంటూ రాజకీయ జీవితంలోనికి ప్రవేశించాడు. మొదట ఓటమికి గురైనా 1957లో మంథని శాసనసభా నియోజకవర్గం నుండి ఎన్నికై, తరువాతికాలంలో భారత ప్రధాని స్థాయి వరకు ఎదిగాడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నిరాడంబరత్వం పి.వి.ది. భారతదేశం రాజకీయంగా, ఆర్థికంగా అత్యంత కష్టదశలో ఉన్నప్పుడు తన రాజకీయ చతురతతో మిత్రపక్షాల మద్దతుతో మైనారిటి ప్రభుత్వాన్ని ఏర్పరచినా తన అనన్యచాతుర్యంతో ప్రధానమంత్రిగా ఐదు సంవత్సరాల చక్కటి పాలనను అందించిన విలక్షణ నాయకుడు.

పి.వి.నరసింహారావు శాంతి స్థాపన గురించి మాట్లాడుతూ "నిరాయుధీకరణ శాంతి స్థాపనకు దారి తీస్తుందనుకోవడం పొరపాటు. అణ్వస్త్రాలను నిర్మూలించవచ్చు. కానీ సంప్రదాయక ఆయుధాలతోనే దేశాలు ఘర్షణపడవచ్చు. ఘర్షణ పడాలనుకొన్నవారికి బాంబులు, అవి లేకుంటే తుపాకులు, అవీ లేకుంటే లాఠీలు, వట్టి చేతులు సరిపోతాయి. నిరాయుధీకరణ ఎంతో అవసరంకాని దానితోనే సరిపోదు. మనుషుల మస్తిష్కాలలో మార్పు రావాలి. హింస, ప్రతీకారం, పగతో కూడిన ఆలోచనలు కొనసాగితే ఏ ప్రయోజనం లేదు. సమాజంలో ఘర్షణ మనస్తత్వాన్ని నిర్మూలించాలి. అప్పుడే శాంతి నెలకొల్పబడుతుంది" అంటూ మానవుల ఆలోచనల్లో మార్పు రావాలని అప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందని ప్రపంచదేశాలకు చక్కని సందేశం అందించాడు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గురించి "భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో, వారసత్వంలో, సమాజంలో విచ్ఛిన్నకర శక్తులు విజయం సాధించకుండా అడ్డుకోగల శక్తి ఉన్నది. ఆ శక్తి అలాగే కొనసాగాలని నేను కోరుతున్నాను" అంటూ భావితరాలకు మన సంస్కృతిలో గల గొప్పతనాన్ని తెలియజెప్పిన గొప్ప దేశభక్తుడు పి.వి.నరసింహారావు.

సమర్థుడైన పాలకుడేకాక మంచి సాహితీవేత్త ఆయన. 1948లో కాకతీయ పత్రికను స్థాపించి పత్రికారచయితగా తన సాహిత్య ప్రయాణం మొదలుపెట్టాడు. 'విజయ' అను కలం పేరుతో కథలను రాశాడు. విశ్వనాథ వారి 'వేయిపడగలు' నవలను సహస్రఫణ్ పేరుతో హిందీలోకి అనువదించాడు. తన అనుభవాల ఆధారంగా రాసిన 'ది ఇన్‌సైడర్' ('లోపలి మనిషి' తెలుగు అనువాదం)ను అందించాడు. పదునాలుగు భాషలు మాట్లాడగలిగిన బహుభాషావేత్త, 1983లో అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో స్పానిష్‌లో మాట్లాడి క్యూబా అధ్యక్షుడు ఫెడర్‌కాస్ట్రోను అబ్బురపరచాడు. తాను నమ్మిన విలువలతో సుదీర్ఘమైన జీవనయానం చేసి డిసెంబర్ 23, 2004న ఢిల్లీలో గుండెపోటుతో తనువు చాలించాడు.

జీవితంలో కలిగే జయాపజయాలను, కష్టనష్టాలను నిబ్బరంగా ఎదుర్కొని నిలిచిన స్థితప్రజ్ఞుడు పి.వి.నరసింహారావు.

SCERT, TELANGANA

# 5 నీతి పరిమళాలు

– శతక కవులు

## చదువండి – ఆలోచించి – చెప్పండి.

సమత : మమతా! నీకు అన్ని తరగతుల్లో నచ్చిన పాఠాల్లోని ఒక పాఠం పేరు చెప్పు!

మమత : అన్ని తరగతుల్లో 'మంచి మాటలు' చెప్పే.... పాఠం బాగా నచ్చింది.

సమత : ఓహ్! నాకు కూడా ఆ పాఠమే నచ్చింది!

మమత : వాటిలో మనం ఎలా ఉండాలో చెప్తారు కదా!

సమత : అవును!

వినుత : ఎలా ఉండకూడదో కూడా తెలుస్తుంది.

మమత : అవునౌను! ఆ పద్యాలు కూడా కంఠస్థం చేయాలని మన ఉపాధ్యాయురాలు చెప్పింది కదా! నేనైతే అన్ని తరగతుల్లో చేసుకుంటూ వస్తున్నాను.

సమత : నేను కూడా చేస్తున్నాను. అవి చెప్పితే మా అమ్మ మెచ్చుకుంటుంది కూడా!

వినుత : నేను పద్యాలు బాగా పాడుతానని నాకు బహుమతి కూడా వచ్చింది.

సమత : ఔను. నిజమే. అందుకే ఈ పద్యాలు – వాటి గొప్పతనం గూర్చి మనం తెలుసుకోవాలి. అందరికీ చెప్పాలి.

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. పై చర్చలో పాల్గొన్న వాళ్ళెవరెవరు?
2. మీకు తెలిసిన కొన్ని మంచి మాటలను చెప్పండి.
3. మంచి మాటలు మనకు ఎందుకు అవసరం?
4. వాళ్ళ చర్చలో ఉన్న పాఠం ఏదై ఉంటుందని మీరు ఊహిస్తున్నారు?

### పాఠం ఉద్దేశం

నైతిక విలువలు, జీవన విధానాలు, మంచి నడవడి మొదలగు అంశాలను విద్యార్థుల్లో పెంపొందింపచేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT, TELANGANA




విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకంలో నూరు లేదా నూట ఎనిమిది పద్యాలు సాధారణంగా ఉంటాయి. శతకాల్లోని పద్యాలకు పద్యాలతో చివరన మకుటం ఉంటుంది. ప్రతీ పద్యం ప్రత్యేకమైన భావంతో ఉంటుంది.

ప్రస్తుత పాఠంలో - సుమతీ, దాశరథీ, భాస్కరా, కుమారా, వేమన, సర్వేశ్వర, నరసింహ, భర్తృహరి శతకాలలోని పద్యాలు ఉన్నాయి.

## కవుల పరిచయాలు



13వ శతాబ్దం

1) **సుమతీ శతక కర్త - బద్దెన :** మనిషి జీవితానికి అవసరమైన అనేక నీతులను, లోకవ్యవహారాలను తన పద్యాల్లో అందించాడు. ఈయన పద్యాలు చాలా సులభ విధానంలో ఉంటాయి. 'నీతిశాస్త్ర ముక్తావళి' అనే మరో గ్రంథం కూడా రాశాడు.



17వ శతాబ్దం

2) **దాశరథీ శతక కర్త - కంచర్ల గోపన్న :** ఈయన భద్రాచలంలోని శ్రీరాముని భక్తుడు. రామదాసుగా పేరొందినాడు. రామదాసు ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి గ్రామస్థుడు. శ్రీరాముణ్ణి కీర్తిస్తూ అనేక సంకీర్తనలు రాశాడు.



17వ శతాబ్దం


3) **భాస్కర శతక కర్త - మారద వెంకయ్య :** ఈయనను మారన అని కూడా పిలుస్తారు. ప్రతి పద్యంలో దృష్టాంతం చెప్పటం ఈయన శతకానికి ఉన్న ప్రత్యేకత. మారద వెంకయ్య రాసిన భాస్కర శతకం తెలుగులో 'తొలి దృష్టాంత' శతకంగా ప్రసిద్ధిని పొందింది.



19వ శతాబ్దం

4) **కుమార శతక కర్త - పక్కి వేంకట అప్పల నరసింహ కవి :** ఈయననే అప్పల నరసయ్య కవి అని కూడా పిలుస్తారు. 'కుమారీ' అనే మరో శతకం కూడా రాశాడు. పిల్లలను ఉద్దేశించి ఈయన రాసిన ఈ రెండు శతకాల పద్యాలు చాలా సులభశైలిలో ఉన్నాయి.

SCERT, TELANGANA



17వ శతాబ్దం

**5) వేమన శతక కర్త - వేమన :** వేమ భూపాలుడే వేమన. కడప జిల్లా ప్రాంతంవాడని పరిశోధకుల అభిప్రాయం. పిల్లలకు సులువుగా అర్థం అయ్యే విధానంలో పద్యాలు రాశాడు. ప్రజల భాషలో మంచి ఉపమానాలతో చెప్పడం ఈయన సహజ లక్షణం.



13వ శతాబ్దం

**6) సర్వేశ్వర శతక కర్త - యథావాక్కుల అన్నమయ్య :** ఈ అన్నమయ్య శివకవులలో ఒకడిగా ప్రసిద్ధిపొందినాడు. ఈయన సర్వేశ్వర శతకంలో 142 పద్యాలు రాశాడు. ఈయన రచనా విధానం చాలా స్పష్టంగా అనేక విషయాలను తెలిపేరకంగా ఉంటుంది.



19వ శతాబ్దం

**7) నరసింహ శతక కర్త - కాకుత్థ్సం శేషాచలదాసు :** ఈయననే శేషప్ప కవి అని పిలుస్తారు. ఈయన ధర్మపురి నరసింహ స్వామి భక్తుడు. ఆ స్వామిని స్తుతిస్తూ 'నరహరి', 'నృకేసరి' అనే మరో రెండు శతకాలను కూడా రాశాడు. వీరు జగిత్యాల జిల్లా ధర్మపురి గ్రామవాసి.




18వ శతాబ్దం

**8) సుభాషిత త్రిశతి అనువాదకులు - ఏనుగు లక్ష్మణ కవి :** భర్తృహరి అనే సంస్కృత కవి 'సుభాషిత త్రిశతి' అనే గ్రంథం రాసారు. దీన్ని తెలుగులో 'సుభాసిత రత్నావళి' అనే పేరుతో ఏనుగు లక్ష్మణ కవి అనువదించాడు. సుభాషిత త్రిశతి అనువాదకుల్లో ఈయన ఒకరు. వీరు పెద్దాపురం సంస్థానంలోని పెద్దాడ గ్రామవాసి.

## విద్యార్థులకు సూచనలు

- ☞ పాఠంలోని బొమ్మలను చూడండి. వాటి గురించి మాట్లాడండి.
- ☞ మీ ఉపాధ్యాయులు పద్యాలను చదివే విధానాన్ని శ్రద్ధగా గమనించండి. మీరూ చదువండి.
- ☞ పాఠం చదువండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ☞ గీతగీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

SCERT TELANGANA



# I



* నడువకుమీ తెరువొక్కట
గుడువకుమీ శత్రునింట, గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరుల మనసు నొవ్వగ సుమతీ! 1



* నోచిన తల్లిదండ్రికి దనూభవుడొక్కడె చాలు మేటి చే
జూచని వాఁడు వేఁడొకడు జాచిన లేదనకిచ్చువాఁడు నో
రాఁచి నిజంబకాని పలుకాడనివాఁడు రణంబులోన మేన్
దాచనివాఁడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ! 2

**ఆలోచించండి - చెప్పండి**

1. 'పరధనములను ముడువకు' అంటే మీకేమి అర్థమైంది?
2. 'చేయి చాచనివాడు' అంటే ఎలా ఉంటాడు అని మీరు భావిస్తున్నారు?

SCERT, TELANGANA

# II



* సిరిగలవానికెయ్యెడల జేసిన మేలది నిష్ఫలంబగన్
నెఱిగురిగాదు పేదలకు నేర్పున జేసిన సత్ఫలంబగున్
వఱపున వచ్చి మేఘుడొక వర్షమువాడిన చేలమీదటన్
కురిసిన గాక యంబుధుల గుర్వగనేమి ఫలంబు భాస్కరా! 3

**ఆలోచించండి - చెప్పండి**

1. సత్ఫలం కావడం అంటే ఏమిటి?
2. ఆచార్యుడిని ఎదిరించకపోవడం అంటే మీరేమనుకుంటున్నారు?



* ఆచార్యున కెదిరింపకు
బ్రోచిన దొర నింద సేయబోకుము, కార్యా
లోచనము లొంటి జేయకు
మాచారము విడువబోకు మయ్యకుమారా! 4



# III



✿ అల్పుడెపుడు పలుకు నాడంబరముగాను
సజ్జనుండు బలుకు చల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా?
విశ్వదాభిరామ! వినురవేమ! 5



✿ సత్యం బెప్పుడు తప్పఁడేనియు, దురాచారుండు గాఁడేని, యౌ
చిత్యం చేమఱఁడేని, దుర్జనుల గోష్ఠిం బొందఁడే భక్త సాం
గత్యం బాదటఁ బాయఁడేని మదనగ్రస్తుండు గాఁడేని నీ
భృత్యుండాతఁడు మూఁడు లోకములలోఁ బూజ్యుండు సర్వేశ్వరా! 6

**ఆలోచించండి - చెప్పండి**

1. సజ్జనుండు అంటే ఎవరు?
2. 'దుర్జనుల గోష్ఠి'కి దూరంగా ఉండడంవల్ల ప్రయోజనాలేవి?

# IV



తల్లిగర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్ళిపోయిననాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమెకాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జనజేసి విఱ్ఱవీగుటెకాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు
పొందుగామరుగైన భూమిలోపలబెట్టి
దానధర్మములేక దాచి దాచి
తుదకు దొంగలకిత్తురో దొరలకౌనొ
తేనె జుంటీగలియ్యవా తెరువరులకు
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర! 7

**ఆలోచించండి - చెప్పండి**

1. విఱ్ఱవీగటం అంటే మీకు ఏమి అర్థమైంది?
2. తేనెటీగలతో పోల్చడం సరైనదేనా? ఎందుకు?



✿ విద్యచే భూషితుండయి వెలయుచున్న
దొడరి వర్జింపనగుజుమీదుర్జనుండు
చారుమాణిక్యభూషిత శస్తమస్త
కంబుగల పన్నగము భయంకరముగాదె! 8

SCERT, TELANGANA

## తాత్పర్యాలు

1) ఓ చక్కని బుద్ధిగలవాడా! దారిలో ఒంటరిగా నడువకు. నీ శత్రువు ఇంట్లో భోజనం చేయకు. స్నేహంగా ఉంటూ ఇతరుల ధనాన్ని మీ సొంతం చేసుకోకు. ఇతరుల మనసు నొప్పించే రకంగా మాట్లాడకు.

2) కరుణ అనే సముద్రమే నిధిగా కలిగినవాడా! భద్రాచలంలో నివాసం ఉన్నవాడా! దశరథ మహారాజు కుమారుడా! శ్రీరామా! తల్లితండ్రులకు గొప్పవాడయ్యే ఒక కొడుకు ఉన్నా మంచిదే. అతడెలా ఉండాలంటే ఎవరి దగ్గర చేయి చాపుతూ బ్రతుకకూడదు. పదిమందికి దానం చేసే స్థితిలో ఉండాలి. అబద్ధాలు ఆడకూడదు. యుద్ధంలో వెన్ను చూపకూడదు. ఇలాంటి కొడుకే గొప్పవాడు.

3) ఓ సూర్యభగవానుడా! డబ్బు / సంపద ఉన్నవాడికి మేలు చేస్తే అది ప్రయోజనాన్ని కలిగించదు. వృథా అయినట్లే. అదే మేలు పేదలకు చేస్తే చక్కని ప్రయోజనాన్ని కలిగిస్తుంది. వృథాకాదు. ఎలాగంటే – నీటితో నిండుకున్న మేఘము వాడిపోతున్న / ఎండిపోతున్న పంట పొలాలపై వర్షం కురిపించాలి. అది ప్రయోజనకరం. అంతేకాని ఆ మేఘము తన వర్షాన్ని సముద్రంపై కురిపించిన ప్రయోజనం లేదుకదా! అది వృథా అయిపోతుంది.

4) కుమారా! ఉపాధ్యాయుడిని ఎదిరించకు. నీకు రక్షణగా ఉన్న వ్యక్తిని నిందించకు. ఏదైనా పనిచేస్తున్నప్పుడు నీ ఒక్కని ఆలోచనతో మాత్రమే చేయకు. మీ ఇంట్లో ఆచరించే ఆచారాన్ని ఎప్పుడు విడువకుండా ఉండుము.

5) విశ్వద, అభిరాములను అనుసరించే ఓ వేమా! అల్పబుద్ధితో ఉండేవాడు (లేని / చేయని విషయాలను ఎక్కువచేసి) ఆడంబరంగా చెప్తాడు. మంచి బుద్ధికలవాడి మాటలు అందరికి నచ్చేట్లు ఉంటాయి. అల్పబుద్ధివాని మాటలు కంచు శబ్దంలా ఇబ్బందిపెట్టేలా ఉంటాయి. మంచివాని మాటలు బంగారపు శబ్దంలా ఏ ఇబ్బంది పెట్టకుండే విధంగా ఉంటాయి.

6) ఓ దైవమా! ఎప్పుడు సత్యం తప్పకుండా ఉండేవాడూ, చెడు ఆచారాలను పాటించనివాడూ, ఔచిత్యాన్ని మరచిపోనివాడూ, చెడు సంగతుల మార్గంలో ఉండనివాడూ, భక్తుల సాంగత్యాన్ని ఎప్పుడూ విడువనివాడూ, కోరికలకు లోనుకానివాడూ, ఇట్లాంటి వ్యక్తులే నీ సేవకులు అవుతారు. అలా నీ సేవకుడైన వాడే విశ్వంలో పూజించబడుతాడు. (గౌరవనీయుడు అవుతాడు).

7) ఆభరణాలచే ప్రకాశించేవాడా! దుష్టులను చంపేవాడా! పాపములను దూరంచేసేవాడా! శ్రీ ధర్మపురిని నివాసంగా కలిగినవాడా! నరసింహా!

అమ్మ కడుపు నుండి పుడుతున్న నరుడు తన వెంట ఏ ధనాన్ని తెచ్చుకోడు. పుట్టాక తాను సంపాదించిన ధనాన్ని తాను చనిపోయేటప్పుడు వెంట తీసుకుపోలేడు.

SCERT, TELANGANA

లక్షలు సంపాదించినవాడైనా తాను తినేది అన్నము, ఉప్పుతో కూడిన పదార్థాలే. అంతేకాని బంగారం తినలేడుకదా!

డబ్బు సంపాదించి నేను సంపాదించాను అని చెప్పుకోవటమే కానీ తాను సంపాదించిన ధనాన్ని తినలేడుకదా!

మనిషి తాను సంపాదించిన ధనాన్ని దానం ఇవ్వడు. ధర్మం చేయడు. ఆ ధనాన్ని భూమిలో దాచిపెడ్తాడు.

అలా దాచిన ధనాన్ని దొంగలపాలో, రాజులపాలో చేస్తాడు. ఎలాగంటే తేనెటీగలు తాము కష్టపడి సంపాదించి తెచ్చి తేనె తుట్టెలో దాచి దాచి చివరకు బాటసారి పాలుచేస్తాయి. అంతేకాని అవి ఆ తేనెను తాగవుకదా! లోభి కూడా డబ్బు విషయంలో అంతేకదా!

8) గొప్పగా చదువుకొని ప్రకాశించేవాడైనా వాడు చెడ్డవాడైతే వానికి దూరంగానే ఉండాలి. ఎలాగంటే కాటువేసే పాము తలపై అందమైన రత్నం ఉందని ఆ రత్నాన్ని తీసుకోవటానికి పాము దగ్గరకు వెళ్ళలేము కదా! అలాగే విద్యావంతుడైన దుర్జనుడికి దూరంగా ఉండాలి.

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడడం

**అ) కింది ప్రశ్నలను చదవండి. వాటి గురించి మాట్లాడండి.**

1) "శతక పద్యాలను ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలి! వాటిని ఆచరించాలి" ఎందుకు? సమర్థించండి.

2) ఈ పాఠంలోని ప్రతీ పద్యాన్ని కంఠస్థం చేయండి. వాటి తాత్పర్యాలను సొంతమాటల్లో చెప్పండి.

### ధారాళంగా చదవడం - అర్థం చేసుకోవడం

**అ) కింది పద్యాన్ని సరిచేసి రాయండి.**

లోచనము లొంటి జేయకు
ఆచార్యున కెదిరింపకు
మా చారము విడువబోకుమయ్య కుమారా!
బ్రోచిన దొర నిందసేయబోకుము, కార్యా!

SCERT TELANGANA

## ఆ) కింది గద్యాన్ని చదువండి. 5 ప్రశ్నలను రాయండి.

శరీరం ఆరోగ్యంగా ఉండాలి. అప్పుడు మనసు ఆరోగ్యంగా ఉంటుంది. శరీరం, మనసు రెండూ ఆరోగ్యంగా ఉంటేనే మనం ఉల్లాసంగా / ఆహ్లాదంగా ఉంటాం. అన్ని రకాల మంచి పనులు చేయగలుగుతాం. అనేక విజయాలను సాధిస్తాం. గొప్ప కీర్తిని పొందగలుగుతాం. ఇదంతా జరగాలంటే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. అదీ మన ఇంటి ఆహారమైతే మరీ మంచిది. ఆ ఆహారమే మనకు ఆరోగ్యాన్ని ఇస్తుంది. శక్తిని పెంచుతుంది. అందుకే మన పెద్దలు 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని చెప్పినారు.

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

## ఇ) కింది పద్యాన్ని చదువండి.

ఎప్పుడు తప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వగూడదది యెట్లన్నన్
సర్పంబు పడగనీడను
గప్పవసించిన విధంబు గదరా సుమతీ! – బద్దెన

**పై పద్యం ఆధారంగా కింది వాక్యాల్లోని 'తప్పు' 'ఒప్పు' లను గుర్తించండి.**

1) తప్పులు వెదకెడు పురుషుడిని కొల్వకూడదు. ( )

2) తప్పులు వెదకెడి వాడిని పాముతో పోల్చారు. ( )

3) 'గప్ప' అంటే కప్పుకోవటం అని అర్థం. ( )

4) 'ఉన్న' అనే అర్థం వచ్చే పదం 'వసించిన'. ( )

5) తప్పులు వెదకేవాని దగ్గర ఉంటే పాము పడగనీడన ఉన్నట్లు కాదు. ( )

SCERT, TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) 'నీ ఒక్కని ఆలోచనతోనే పనిచేయకు' అని ఎందుకు అంటారో వివరించండి.

2) పాఠంలోనని పద్యంలో కంచు, బంగారం అనే వాటి ప్రసక్తి ఎందుకు వచ్చిందో తెలుపండి.

3) సంతానం ఎలా ఉండాలి?

4) సర్వేశ్వర శతక కర్తను గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) పాఠంలోని శతక పద్యాల ఆధారంగా మనం అలవర్చుకోవాల్సిన మంచి గుణగణాలను వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది అంశాన్ని గురించి రాయండి.**

1) ఏదైనా ఒక పద్యం ఆధారంగా ఒక కథను రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) మేటి : ______________________

2) వాడిన : ______________________

3) విత్తము : ______________________

4) చారు : ______________________

**ఆ) కింద ఇచ్చిన పదాలను చదువండి. వాటిలోని పర్యాయ పదాలను గుర్తించి ఇచ్చిన ఖాళీలలో రాయండి. (పద పట్టికను ఉపయోగించుకోండి)**

**కూరిమి, సమరం, స్నేహితం, పసిడి, తల్లి, యుద్ధం, పాము, పన్నగం, బంగారం, జనని, మిత్రుత్వం, రణం, అమ్మ, సర్పం, పుత్తడి**

1) ________ ________ ________

2) ________ ________ ________

3) ________ ________ ________

4) ________ ________ ________

5) ________ ________ ________

SCERT, TELANGANA

**ఇ) కింది పదాలకు నానార్థాలను రాయండి.**

1) పయము = ________________ ________________

2) వర్షము = ________________ ________________

3) భవుడు = ________________ ________________

**ఈ) కింది వ్యుత్పత్తులకు పదాలను రాయండి.**

1) దశరథుని కుమారుడు = ______________________

2) ఆచరించి చూపించేవాడు = ______________________

3) నర, సింహ రూపములను కలిగినవాడు = ______________________

**ఉ) తంబోల ఆట**

- పాఠంలోని పద్యాలలోని ఏవైనా 20 పదాలను కింది గళ్ళలో రాసుకోండి. ఉదా : ధనము

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |
| | | | |

- ఇప్పుడు మీ ఉపాధ్యాయుడు పద్యాలలోని పదాలను చెపుతాడు.
- వాటిని జాగ్రత్తగా వినాలి. మీ ఉపాధ్యాయుడు చెప్పిన పదం మీరు రాసుకున్న గళ్ళలో ఉంటే వాటికి ' ✓ ' పెట్టుకోండి.
- ఇలా ' ✓ ' పెట్టుకుంటున్నప్పుడు ఎవరివి మొత్తం 20 పదాలు పూర్తయితే వారు గెలిచినట్లు.

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను కలిపి రాయండి.**

1) తల్లి + తండ్రి = ________________

2) మేలు + అది = ________________

3) కార్య + ఆలోచన = ________________

4) భూమిన్ + ఏ + ఊరిలో = ________________

5) తేదు + ఎవ్వదు = ________________

SCERT, TELANGANA

ఆ) కింది పదాలను విడదీసి రాయండి.

1) లక్షాధికారి = ______________ + ______________

2) మఱుగైన = ______________ + ______________


3) విశ్వదాభిరామ = ______________ + ______________

4) నిందసేయకు = ______________ + ______________

5) వేఱొకడు = ______________ + ______________

ఇ) కింది సమాస పదాల్లోని ద్విగు సమాస పదాలను గుర్తించి ఆ కింద ఇచ్చిన వృత్తంలో రాయండి.

| | | | |
|---|---|---|---|
| లక్షరూపాయలు | తల్లిగర్భము | ఐదేళ్ళు | దానధర్మాలు |
| పదిమేఘాలు | భద్రగిరి | నాలుగు సముద్రాలు | షడ్రుచులు |




## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ మీ పాఠ్యాంశాల్లోని శతక కవులు, శతక పద్యాలు కాకుండా ఏవైనా ఐదు శతకాల పేర్లను, వాటి మకుటాలను, ఆ శతక కవుల పేర్లను పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి.

**సూక్తి**

"వాగ్భూషణమ్ భూషణమ్"

మంచి మాట అనే ఆభరణమే

మనిషికి అసలైన ఆభరణం.

\- భర్తృహరి

SCERT, TELANGANA

# చదువండి - తెలుసుకొండి

స్ఫూర్తి ప్రదాత

## అరిగె రామస్వామి



సమాజంలో అట్టడుగున పడి ఉన్న పీడిత, తాడిత, నిమ్న జాతుల ప్రజల సముద్ధరణకై కంకణం కట్టుకొని వారిలో చైతన్యం కలిగించటానికి అహోరాత్రులు కృషి చేసిన దీనజనోద్ధారకుడు, గొప్ప సంఘ సంస్కర్త, దేశభక్తుడు అరిగె రామస్వామి. ఆనాడు నిజాం నిరంకుశ పరిపాలనలో ప్రజలకు ఏ విషయంలోనూ స్వేచ్ఛలేదు. ఇక ఆ రోజులలో వెనుకబడిన తరగతుల ప్రజల పరిస్థితి మరింత దుర్భరంగా ఉండేది. హిందూ సమాజంలో అంటరానివారుగా అణగి ఉన్న వీరిమీద పలుకుబడిగల వర్గాలవారు, ప్రభుత్వ ఉద్యోగులు దౌర్జన్యాలు, దౌష్ట్యాలు చేయడమేగాక, అనేక గ్రామాలలో వారితో వెట్టిచాకిరీ చేయించుకోవడం కూడా జరుగుతుండేది. అజ్ఞానంలో, కరుడుగట్టిన మూఢాచారాల చక్రంలో చిక్కుకొని నలిగిపోతున్న పీడిత ప్రజానీకానికి ఆశాజ్యోతిని చూపించిన ప్రముఖ హరిజన నాయకులు హైదరాబాదు సంస్థానంలో ఆనాడు ముగ్గురున్నారు. వారిలో ఒకరు అరిగె రామస్వామి, రెండోవారు భాగ్యరెడ్డివర్మ, మూడో వ్యక్తి బి.ఎస్.వెంకట్రావు.

రామస్వామి 1895 లో, సికింద్రాబాదులోని ఒక నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించాడు. కొద్దిపాటి విద్యాభ్యాసం తరువాత, రైల్వే ఆడిట్ ఆఫీసులో ఆఫీసుబాయిగా జీవితాన్ని ప్రారంభించి పలురకాల ఉద్యోగాలు చేశాడు.

ఆయనకు చిన్నతనం నుండి ఆధ్యాత్మిక చింతన అధికం. 1912లో భూమానంద శ్రీ మందపల్లి హనుమంతరాజ యోగీశ్వరుల ప్రభావానికిలోనై వారి శిష్యుడైనాడు. ఆనాటి నుంచీ సంపూర్ణంగా శాకాహారియై గురువు అడుగుజాడలలో సమాజ కళ్యాణానికి కృషి చేయనారంభించాడు. గురువు ఆశీస్సులతో 'సునీత బాల సమాజం' పేరిట ఒక సంస్థను నెలకొల్పి, సికింద్రాబాదు, కుమ్మరిగూడా మొదలైన బస్తీలలో సంఘ సంస్కరణకు పూనుకొన్నాడు. ఈ సమాజం ముఖ్య ఉద్దేశ్యాలలో : ప్రజలలో బాగా వ్యాపించి ఉన్న త్రాగుడు దురభ్యాసాన్ని మాన్పించడం, నిరక్షరాస్యతా నిర్మూలనకు కృషి చేయడం, హరిజనులలో ఉన్న ఉపతెగలు మాల, మాదిగ, మాల దాసరి మొదలైనవాటిని తొలగించి వారిలో సమైక్యతను పెంపొందించడం, మూఢాచారాలను, మూఢ విశ్వాసాలను, ఎక్కువ తక్కువలనే భావాలను పోగొట్టటానికి కృషిచేయడం, సాంఘిక న్యాయాన్ని సాధించడం, జంతుబలిని నిషేధించడం ముఖ్యమైనవి. రామస్వామి హరిజనులలోను, ఇతర వెనుకబడిన తరగతులవారిలోనూ ఈ ఉద్దేశాలను బాగా ప్రచారం చేసి, కొద్దిరోజులలోనే సికింద్రాబాదులో అన్ని వర్గాల వారి మన్ననలను పొందాడు.

రామస్వామి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలో కార్యవర్గ సభ్యుడుగా, ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యుడుగా, నిజాం రాష్ట్ర ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యవర్గంలోనూ చాలా కాలం సభ్యుడుగా ఉన్నాడు. 1950–1952లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సంయుక్త కార్యదర్శిగా పనిచేశాడు. సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడుగా, హైదరాబాదు జిల్లా బోర్డు సభ్యుడుగానూ ఎంతో సేవచేశాడు. పోలీసు చర్య తరువాత కేంద్ర ప్రభుత్వం భారత పార్లమెంటుకు హైదరాబాదు సంస్థానం నుంచి నామినేట్ చేసిన పార్లమెంటు సభ్యులలో రామస్వామి ఒకడు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికలలో వికారాబాదు ద్విసభ్య నియోజకవర్గం నుంచి జరిగిన ఎన్నికలలో డా॥ చెన్నారెడ్డిగారితో పాటుగా హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనాడు. డా॥ బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో 1954 నుంచి 1956 వరకు ఉపమంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత కూడా శాసనసభకు ఎన్నికై, కొంతకాలం కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో ఉపమంత్రిగా ఉండి సేవ చేశాడు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడుగా నియుక్తుడై కొంతకాలం పనిచేశాడు.

ప్రసిద్ధ గాంధేయవాది, నిరాడంబరుడు, నిస్వార్థ సేవాపరాయణుడు తాను విశ్వసించిన సిద్ధాంతాలను, విశ్వాసాలను, చిత్తశుద్ధితో ఆచరించిన స్థిరచిత్తుడు, తాడిత పీడిత జననాయకుడు అరిగె రామస్వామి. ఆదర్శాల విషయంలో ఆయన ఎన్నడూ రాజీపడలేదు. 1973 జనవరి 26వ తేదీన రామస్వామి మరణించాడు. తెలంగాణ ప్రాంతపు హరిజనోద్యమంలోనూ, శ్రామిక జనావళి విమోచనోద్యమ చరిత్రలోనూ రామస్వామికి గల స్థానం మహోన్నతమైనది.

SCERT, TELANGANA

# 6 తెలుగు మహిళ

– ఇల్లిందల సరస్వతీ దేవి

## చదువండి – ఆలోచించి చెప్పండి.

ఆడపిల్లంటే అనురాగ దీపిక
అంధకారంలో వెలుగుల జాబిలి
ఆడపిల్లంటే ఏడడుగుల హరివిల్లు
తల్లిగా చెల్లిగా ఇల్లాలుగా
ఏడుగడగా ఎన్నో ప్రేమలు పంచుతుంది
అన్ని రంగులకు మూలమైన
తెల్లదనం మనస్సులో నింపుతుంది.

SCERT TELANGANA

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. పై గేయంలో ఎవరి గురించి ఉంది?
2. ఆడపిల్లను వేటితో పోల్చారు?
3. అంధకారంలో వెలుగుల జాబిలి అని ఎవరి గురించి అన్నారు? ఎందుకు?

### పాఠం ఉద్దేశం

తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో స్త్రీలు ముఖ్యపాత్ర వహిస్తున్నారు అని తెలియజేయడం ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశం.



విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'వ్యాసం' అనే ప్రక్రియకు చెందినది. వివరించి చెప్పబడేది లేదా రాయబడేది వ్యాసం. ప్రస్తుత పాఠ్యభాగం ఇల్లిందల సరస్వతీదేవి రచించిన తెలుగువాణి - ప్రపంచ తెలుగు మహాసభల సంచిక-1975 లోనిది.

## రచయిత్రి పరిచయం



15-06-1918
31-07-1998

ఇల్లిందల సరస్వతీదేవి స్వాతంత్ర్యానికి పూర్వమే సృజనాత్మకత రంగంలోకి అడుగుపెట్టిన ప్రసిద్ధ రచయిత్రి. ఈమె వందలాది కథలు, కొన్ని నవలలు, రేడియో నాటికలు, అనేక వ్యాసాలను రచించిన బహుముఖ ప్రజ్ఞావంతురాలు. 1982లో ఈమె రచించిన 'స్వర్ణ కమలాలు' కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ వచ్చింది. రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం, సుశీలా నారాయణరెడ్డి పురస్కారాన్ని కూడా పొందింది. 'తులసీ దళాలు', 'రాజహంస' ఈమె కథా సంపుటాలు.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- ☞ పాఠంలోని బొమ్మలను చూడండి. వాటి గురించి మాట్లాడండి.
- ☞ మీ ఉపాధ్యాయులు చెప్పే పాఠం శ్రద్ధగా వినండి. (బొమ్మ ద్వారా తెలుసుకున్న విషయాలను పాఠంతో పోల్చుకోండి).
- ☞ పాఠాన్ని చదువవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ☞ గీత గీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

## I

జాతి సంస్కృతినీ నాగరికతనూ ప్రజల వేషభాషలను బట్టీ ఆచారవ్యవహారాలను బట్టీ గుర్తించవచ్చు. వాకిట్లో ముగ్గూ, గడపలకు పసుపు కుంకుమలతో బొట్లూ, మామిడాకు బంతిపూలతో గుమ్మాలకు తోరణాలూ కనబడితే ఆ ఇల్లు పదహారణాల తెలుగువారి ఇల్లని ఏ విదేశీయుడైనా చెప్పగలుగుతాడు. ఆధునిక నాగరికతలో మునిగి తేలుతున్నా, దేశాంతరములో ఉన్నా తమ సంస్కృతినీ నాగరికతనూ సామాన్యంగా ఎవరూ విస్మరించరు. అందులో స్త్రీలు ఏమాత్రము విస్మరించలేరు.

మన జాతి సంస్కృతినీ నాగరికతనూ ఎటువంటి విపత్కరమయిన పరిస్థితులలో కూడా కాపాడింది ఎవరోకాదు – మన స్త్రీలు. వారు పరంపరాగతమైన సదాచారాలనూ అనుశ్రుతంగా వస్తున్న అలవాట్లనూ పట్టుదలతో దీక్షతో ఆచరిస్తున్నందువల్లనే మనజాతి సంస్కృతీ నాగరికతా సంరక్షింపబడ్డాయి.

ఆధునిక కాలములో సాంఘిక జీవనములో ఎన్ని మార్పులు వచ్చినా ప్రాచీనాదర్శాలు ఎంత నశించిపోయినా ఒక ఆదర్శము మాత్రము ఇంకా నిలిచిఉన్నది. వేయి మందిలో ఒక స్త్రీ అయినా తన పరిమితులలోనే పైకి కనబడకుండ నాగరికతనూ సంస్కృతినీ మతవిశ్వాసాలనూ మొలకెత్తించి పోషిస్తూ వాటితో సంబంధ సామరస్యాలను విడనాడకుండా ప్రతినిత్యమూ ఆ వెలుగులో తన భర్తను పిల్లలనూ నడిపిస్తుంది. గృహసీమకు రాణి అయిన గృహిణి అడుగుజాడలతో పురుషుడు నడుస్తున్నాడు.

మన స్త్రీలలో పరంపరాగతమైన నైతిక బలోద్వేగమూ దీక్ష జీవించి ఉన్నాయి. కష్టాలను ఓరిమితో సహించిన సీతమ్మా, యముడితో పోరాడి పతిప్రాణాలను దక్కించుకున్న సావిత్రీ, ఘోరమైన తపస్సుచేసి పరమశివుడిలో అర్ధభాగాన్ని పొందగలిగిన పార్వతి, త్రిమూర్తులను పసిపాపలనుగాచేసి తన శీలాన్ని కాపాడుకున్న అనసూయ, సూర్యచంద్రాదుల గతులను అరికట్టిన సుమతీ మన స్త్రీలకు ఆదర్శమూర్తులు. వివాహమనే పవిత్రవంతమైన సంస్థ ఈనాటికీ చెక్కు చెదరకుండా నిలిచిఉన్నది.



SCERT, TELANGANA

స్త్రీలు తమ ఆదర్శాలను సాధించటానికి పట్టుదలతో భక్తి శ్రద్ధలతో దీక్షతో నోములో వ్రతాలో ఆచరించి ఒక విశిష్టమైన శారీరక మానసిక క్రమశిక్షణను అలవరచుకున్నారు. నోములూ వ్రతాలూ స్త్రీల జీవితంలో పరమపవిత్రమైన కార్యాలు – అతి ముఖ్యమైన ఘట్టాలు, ఉపవాసాలు వాటిలో ఒక భాగము.




ఈ నోములూ, వ్రతాల ద్వారా స్త్రీలు ఆపేక్షించేది తమ కుటుంబ సుఖమొక్కటే కాదు – సంఘంలో అందరి సుఖసంతోషాలనూ కోరుకుంటారు. ఒకమాటలో చెప్పాలంటే వారు కోరుకునేది సర్వేజనాః సుఖినోభవంతు.

**ఆలోచించండి – చెప్పండి**

1. ప్రజల వేషభాషలను బట్టి దేన్ని గుర్తించవచ్చు?
2. మన స్త్రీలకు ఆదర్శమూర్తులు ఎవరు?
3. నోములూ వ్రతాల ద్వారా స్త్రీలు ఆపేక్షించేది ఏమిటి?

## II



ఉగాదికి తీపి పులుపు చేదు రుచులతో పచ్చడిచేసి జీవితము కష్టసుఖాల కలయిక అని తెలియజెప్తుతారు స్త్రీలు. నూతన సంవత్సరంనాడు ఏ చెడుపనీ ఏ పొరబాటు పనిచేసినా సంవత్సరం పొడుగునా ఫలితమిట్లాగే ఉంటుందని సూచన చేస్తారు.

వినాయక చవితికి పిల్లలతో విఘ్నేశ్వర పూజ చేయించి జీవితములో ఏ మంచిపనికీ విఘ్నము కలగకుండా ఆ దేవుని ప్రార్థిస్తారు.

శ్రావణమాసము స్త్రీలకు మంగళకరమైన మాసము. మంగళ గౌరీవ్రతమూ వరలక్ష్మీవ్రతములతో సందడిగా ఉంటుంది. కథ లోపమయినా భక్తిలోపం లేకుండా వ్రతమాచరిస్తారు.

నాగుల చవితినాడు తలారా స్నానముచేసి చిమ్మిలీ చలిమిడీ ఆవుపాలూ పుట్టలోని నాగులయ్యకు సమర్పించి సంతానము లేకపోతే సంతానము కలగాలనీ, ఉంటే వృద్ధిలోకి రావాలనీ కోరుకుంటారు.

ఆశ్వీయుజ కార్తీక మాసాలలో వచ్చేవి దసరా దీపావళీ పండుగలు. దసరాపండుగకు ముందు దేవీనవరాత్రులూ దుర్గపూజలూ దీక్షతో భక్తితో చేస్తారు. దీపావళి నరకాసుర వధానంతరం ప్రజలు జరుపుకున్న ఉత్సవాలు, ఆశ్వీయుజమాసం మొదలుకొని దీపావళి వరకూ పార్వతీదేవి ఘోరమైన తపస్సుచేసి పరమశివుడిని మెప్పించి ఆయనలోని అర్థభాగాన్ని పొందిందన్న పురాణగాథ ఒకటి ఉన్నది. ఈ రెండు పండుగలూ ఘనంగా జరుగుతాయి తెలుగువారి ఇళ్ళల్లో.

సంక్రాంతి ఋతుసంబంధమైన పండుగ. పంటలు ఇళ్ళకు చేరే కాలము. భోగినాడు పిల్లలకు రేగిపళ్ళూ చెరుకుముక్కలూ తలమీద పోసి భోగిపీడ పోగొట్టుకునే పండుగ. పండుగనాడు గృహస్థుల పితృదేవతల సంతృప్తి కొరకు దానధర్మాలు చెయ్యాలి.

**ఆలోచించండి - చెప్పండి**

1. కథలోపమయినా భక్తిలోపం లేకుండా వ్రతమాచరించడం అంటే మీకేం అర్థమయింది.
2. ఋతు సంబంధమైన పండుగ అంటే ఏమిటి?

SCERT TELANGANA

## III

ఇలా సంవత్సరం పొడుగునా పెద్దవీ చిన్నవీ పండుగలు వస్తూనే ఉంటాయి. వాటికి తగిన ప్రాముఖ్యత వాటికీ ఉండనే ఉన్నది. ఈ ప్రాముఖ్యతను విస్మరించకుండా ఆచారాన్ని చెక్కుచెదరనీయకుండా కాపాడుతారు తెనుగువారింటి ఆడబడుచులు.

ప్రాచీనులు అధిక విద్యావతులు కాని స్త్రీలకు విద్యుక్త ధర్మాలనూ లౌకిక జ్ఞానాన్నీ, పురాణ పరిచయాన్నీ, చారిత్రాత్మక విశేషాలనూ, వేదాంత తత్త్వాలనూ, వైద్యవిషయాలనూ, పరంపరాగతమైన ఆచార వ్యవహారాలనూ – ఒకటేమిటి – సకల శాస్త్రాలనూ పాట ద్వారా బోధచేశారు. ఈ పాటలే వారికి విద్యాపీఠాలు. ఈ పాటలలోని సాంఘిక జీవనము అతిసహజమైనది. ఇవి సాంఘిక జీవితానికి కుటుంబజీవితానికీ ప్రతిబింబాలు. ఆంధ్రుల నాగరికతకూ సంస్కృతికీ ఈ పాటలు మూలాధారాలు. వీటిలో గృహిణి ఆశలూ, ఆశయాలూ, జీవితానందమూ, వాటికి సంబంధించిన వాతావరణమూ తప్ప మరొకటి లేదు. స్త్రీలు గృహకృత్యాలు నెరవేర్చుకుంటూ ఈ పాటల ద్వారా తమ విద్యుక్తధర్మాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ పరమార్థిక చింతనను కూడా సాధించారు. పెద్దలపట్ల వినయ విధేయతలూ, భక్తిగౌరవాలూ, పిన్నలపట్ల వాత్సల్యమూ, పేదలపట్ల దయాదాక్షిణ్యాలూ, బంధుప్రీతి, అతిథి, అభ్యాగతుల సత్కారమూ ఇటువంటివన్నీ గృహ వాతావరణములో అబ్బిన సుగుణాలే. గృహమొక రాజ్యముగా పరిపాలిస్తున్న స్త్రీ మాతృమూర్తిగా ఒక సామ్రాజ్ఞిగా నిండు మనసుతో గంభీరంగా నిబ్బరంతో ఎన్ని కష్టాలు వచ్చి మీదపడినా తన ఆదర్శాలను విడనాడకుండా తన సంతతికి కూడా బోధిస్తుంది.



తెలుగువారి వంటకాలూ, రుచులూ, అలవాట్లూ, నమ్మకాలూ, ఆచారాలూ, మర్యాదలూ మన్ననలూ ఆశీస్సులూ ఆశలూ ఆశయాలూ – అన్నిటికీ అన్నీ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వీటన్నిటికీ మూలము – ప్రాణం – జీవగఱ్ఱ స్త్రీ ఆమే జాతికి జ్ఞానజ్యోతి.

**ఆలోచించండి – చెప్పండి**

1. పాటల ద్వారా ఏయే విషయాలు తెలిసేవి?
2. విధ్యుక్త ధర్మాలు అంటే ఏమిటి?
3. గృహ వాతావరణంలో అబ్బే సుగుణాలు ఏవి?

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడడం

**అ) కింది ప్రశ్నకు జవాబును చెప్పండి.**

1) స్త్రీ గురించి మీ సొంత మాటల్లో చెప్పండి.

### ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) పాఠం చదువండి - పట్టికలో సూచించిన పేరాలకు విషయం ఆధారంగా శీర్షికను నిర్ణయించండి.**

| పేరా సంఖ్య | పేరాకు శీర్షిక |
|---|---|
| 4వ పేరా | |
| 11వ పేరా | |
| 14వ పేరా | |

**ఆ) కింది సంభాషణను చదివి ఐదు ప్రశ్నలను తయారుచేయండి.**

పిల్లలు : నమస్కారం టీచర్!

టీచరు : నమస్కారం పిల్లలూ! రేపటి నుండి దసరా సెలవులు కదా! సెలవుల్లో ఏం చేస్తారు?

రమ : మా అమ్మమ్మ వాళ్ళ ఊరికి పోతా టీచర్.

పిల్లలు : టీచర్ పండుగల గురించి చెప్పండి.

టీచర్ : అలాగే! మన దేశం ఒక పుణ్య భూమి. ఈ దేశంలో భారతీయులు ప్రకృతి ఆరాధనలో భాగంగా చెట్లును, పుట్టను, గుట్టను, పశుపక్ష్యాదులన్నింటిని పూజిస్తారు, గౌరవిస్తారు. ప్రతి పండుగ వెనుక పూర్వులు మనకు గొప్ప సందేశాన్ని అందించారు.

లత : టీచర్ ఉగాది, వినాయక చవితి మొ॥గు పండుగల గురించి చెప్పరా.

టీచర్ : చైత్ర మాసంలో మొదటి తిథి పాడ్యమి కదా! ఆ రోజు వచ్చే పండుగనే ఉగాది. మనం జరుపుకునే ఉగాది, వినాయక చవితి, బతుకమ్మ, సంక్రాంతి పండుగలన్నీ కూడా ప్రకృతి ఋతుమార్పుల కనుగుణంగా జరుపుకునే పండుగలు.

రవి : దసరా, దీపావళి పండుగలు ఎందుకు జరుపుకుంటారు?

SCERT, TELANGANA

టీచర్ : అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకుంటాం. ఆశ్వయుజ మాసం శుద్ధ దశమి రోజున దసరా జరుపుకుంటాం.

దివ్య : బతుకమ్మ పండుగను కూడా అప్పుడే జరుపు కుంటాం కదా! టీచర్.

టీచర్ : అవును. బతుకమ్మ ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు సాక్ష్యం. సామాజిక సమైక్యతకు, సమరస భావానికి నిదర్శనం.

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) "గృహ సీమకు రాణి గృహిణి." ఎలాగో వివరించండి.

2) ఇల్లిందల సరస్వతీదేవి గురించి రాయండి.

3) మన సంస్కృతిని సంప్రదాయాలను కాపాడటానికి మీరేం చేస్తారు?

4) 'పాటలే విద్యాపీఠాలు' అంటే మీకేం అర్థమయింది?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాల గురించి సొంతమాటల్లో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.**

1) మీకు నచ్చిన పండుగ గురించి వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

( లేదా )

2) మీ పాఠశాలలో జరిగే పాటల పోటీల గురించి ఆహ్వానపత్రం తయారుచేయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) విస్మరించు : ____________________

2) ఆపేక్ష : ____________________

3) అపవాదు : ____________________

**ఆ) గీత గీసిన పదాలకు పర్యాయ పదాలను రాయండి.**

1) <u>వివాహ</u> బంధం ఎంతో పవిత్రమైనది. __________ __________

2) పండుగ రోజు <u>నూతన</u> వస్త్రాలు ధరిస్తారు. __________ __________

**ఇ) బతుకమ్మ పూల పండుగ కదా! అట్లే కింది పండుగలు దేనికి సంబంధించినవో రాయండి.**

1) సంక్రాంతి : __________

2) హోళి : __________

3) ఉగాది : __________

4) రంజాన్ : __________

5) దీపావళి : __________

6) క్రిస్మస్ : __________

### వ్యాకరణాంశాలు

**☆ కింది వాక్యం చదువండి. పరిశీలించండి.**

'రామ లక్ష్మణులు చాలా గొప్పవారు'.

పై వాక్యంలో నామవాచక పదాలను సులభంగా గుర్తించవచ్చు. అవి రామలక్ష్మణులు. వీటిని రాముడు మరియు లక్ష్మణుడు అని విడిగా చెప్పుకొంటాం. ఈ విధంగా సమ ప్రాధాన్యంగల నామవాచకాల మధ్య ఏర్పడే సమాసాన్ని **'ద్వంద్వ సమాసం'** అంటారు.

**అ) కింది వాక్యాలలోని ద్వంద్వ సమాస పదాలను గుర్తించి ఆ పదాలకు విగ్రహ వాక్యాలను పట్టికలో రాయండి.**

1) వ్యాపారంలో లాభనష్టాలు సహజమే.

2) కూరగాయలు రైతుబజారులో దొరుకుతాయి.

3) అందరు కలిసి కష్టసుఖాలు పంచుకోవాలి.

4) భార్యా భర్తలు అన్యోన్యంగా ఉండాలి.

5) తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎంతో ప్రేమ చూపిస్తారు.

SCERT, TELANGANA

| క్ర.సం. | ద్వంద్వ సమాస పదం | విగ్రహ వాక్యం |
|---|---|---|
| 1) | | |
| 2) | | |
| 3) | | |
| 4) | | |
| 5) | | |

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- స్త్రీల గొప్పతనాన్ని తెలిపే పాట / పద్యం / కథలు తెలుసుకొని రాయండి. తరగతిలో ప్రదర్శించండి.

**సూక్తి**

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుతారో
అక్కడ దేవతలు ఆనందంగా ఉంటారు.

SCERT, TELANGANA

## చదువండి - తెలుసుకొండి

### ఉప్పుల మల్సూర్



సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామంలో 1928లో జన్మించిన ఉప్పుల మల్సూర్ అతి సామాన్య జీవితం గడిపిన రాజకీయ నాయకుడు. నమ్మిన సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించాడు. నిజాం సైన్యానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా సాయుధపోరాటంలో ఆయుధం చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నాడు. స్వాతంత్ర్యానంతరం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మల్సూర్ తనకు నెలనెలా వచ్చే జీతాన్ని కూడా పార్టీకే ఇచ్చేవాడు. స్వయంగా తను చెప్పులు కుట్టగా వచ్చిన డబ్బులతోనే జీవితం గడిపేవాడు. మల్సూర్ భార్య కూడా కూలీపనికి వెళ్ళి భర్తకు చేదోడుగా ఉండేది. దళిత ఆణిముత్యంగా పేరుగాంచిన ఉప్పుల మల్సూర్ 1999 జనవరి 13న మరణించాడు. ఆయన మరణానంతరం వారి పిల్లలు తమ సొంత ఇంటిని మల్సూర్ జ్ఞాపకార్థం పాఠశాలకు ఇచ్చారు.

# 7 శ్రమజీవి

- కనపర్తి రామచంద్రాచార్యులు

### కింది అంశం చదువండి - ఆలోచించి చెప్పండి.

మానవాళికి కరోనా గొప్ప పాఠం నేర్పించింది. మన ఆరోగ్యం మన చేతుల్లో, మన చేతల్లో ఉందని తెలిసింది. పెను రక్కసి విశ్వాన్ని కబళించినవేళ కరోనాను జయించిన భారతావనిగా నిలబడ్డాం. ఇందుకోసం వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, సైనికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమిష్టిగా కృషిచేశారు. వారందరినీ స్మరించడం మన కర్తవ్యం గదా!!

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. పై పేరా దేని గూర్చి తెలుపుతుంది?
2. సామాజిక ఆరోగ్యం కోసం ఎవరెవరు సేవలందించారు?
3. మన కోసం ఇంకా సేవలందిస్తున్నవారు ఎవరు?

### పాఠం ఉద్దేశం

శ్రమ పునాదిపైనే సమాజం నిలబడి ఉంది.

శ్రామికుల ఘనతను, శ్రమ జీవన సౌందర్యాన్ని

తెలియజేయడమే పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'వచన కవిత' ప్రక్రియకు చెందింది. ఛందస్సు, మాత్రాగణాల నియమం లేకుండా, స్వేచ్ఛగా భావయుక్తంగా, వాక్యాలతో ఉంటుంది. అభివ్యక్తీకరణ ప్రధానంగా కొనసాగుతుంది.

ఈ పాఠం కనపర్తి రామచంద్రాచార్యులు రచించిన 'రాళ్ళలో రాగాలు' కవితా సంకలనంలోనిది.

## రచయిత పరిచయం



**08-08-1947**
**15-06-2011**

కనపర్తి మాలక్ష్మమ్మ, రంగయ్య దంపతులకు జన్మించిన రామచంద్రాచార్యుల స్వస్థలం పూర్వపు మెదక్ జిల్లా ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని గట్లమల్యాల గ్రామం. తల్లి దగ్గరే భారత, రామాయణ, భాగవతాలు నేర్చుకున్నాడు. మొదట పశు సంవర్ధక శాఖలో, తర్వాత ఉపాధ్యాయునిగా పనిచేశాడు.

హృదయాంజలి, అక్షర శిల్పాలు, వెలుతురు పూలు, నైమిశారణ్యం, నగరంలో వెన్నెల మొదలగునవి ఈయన రచనలు. సరళంగా ఉండే ఈయన రచనాశైలి పలువురి మన్ననలు పొందింది. వచన కవితా ప్రవీణ బిరుదును, వేముగంటి పురస్కారాన్ని, జాతీయ సాహిత్య పరిషత్ పురస్కారాన్ని అందుకున్న కనపర్తి స్వర్ణ కంకణ సత్కార గ్రహీత.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలను చూడండి. వాటిని గురించి మాట్లాడండి.
- మీ ఉపాధ్యాయులు కవిత చదివే విధానాన్ని శ్రద్ధగా వినండి.
- మీరు కూడా చదివే విధానం నేర్చుకోండి.
- అర్థం కాని పదాల కింద గీతలు గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను పదపట్టిక లేదా నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

# I



ఆమె ఝాన్సీలక్ష్మి కాదు,
వీరనారి రుద్రమదేవీ కాదు;
ఈ సమాజం గుర్తుంచుకోవడానికి -
ఆమె ఏ గొప్ప నాయకురాలూ కాదు!

ఆమెను నా చిన్నప్పట్నుంచీ
నేను చూస్తూనే ఉన్నాను -
ఉదయం వీధి తలుపులు తెరవగానే
సూర్యుని కంటే ముందే
నాకు ఆమె దర్శనమౌతుంది!

రేగిన దుమ్ముమబ్బుల మధ్య -
ఆమె రూపు రేఖలు అస్పష్టంగా  కన్పిస్తాయి!
ఆ ఊడ్పు చప్పుళ్ళలో -
ఆమె గుండె నిట్టూర్పులు స్పష్టంగా విన్పిస్తాయి!

చేతిలో నిడుపాటి చీపురుకట్ట
చంకలో వెదురుతో అల్లిన చెత్తబుట్ట :
నేలతల్లి సేవలో పండిపోయిన ఆమె -
ఎన్నెన్నో అనుభవాల పుట్ట!

తెల్ల చీర కట్టుకొని
అహింసలా ఆమె నడిచివస్తుంటే -
వీధులన్నీ పులకించిపోతాయి!
మైలపడ్డ తమ జీవితాలకు -
కొత్తకాంతి వస్తుందని మురిసిపోతాయి!

ఆమె రానినాడు
వీధులన్నీ వ్యాధిగ్రస్తులైనట్లు
నల్లమొహాలు వేసుకుంటాయి!!

**ఆలోచించండి - చెప్పండి**

1. 'నేల తల్లికి సేవ చేయడం' అంటే మీకేం అర్థమైంది?
2. ఆమె రానినాడు వీధులు వ్యాధిగ్రస్తులు కావడమంటే మీరేమనుకుంటున్నారు?

SCERT, TELANGANA

## II

తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో –
నిత్యం ఊడ్చి ఊడ్చి పాపం,
వంగిన నడుంతో ఆమె వీధికంకితమైపోతే –
ఆ వీధి మాత్రం –
ఎవరి పేరుకో అంకితమైపోయింది!

అయినా తెల్లవారి లేస్తే –
బ్రతుకు వీధిలో పడే ఆమెకు –
గాంధీ వీధైతేనేం.
నెహ్రూ వీధైతేనేం.
ప్రతి రోడ్డు ఆమెకు బిడ్డలాంటిదే!
ప్రతి చౌరస్తాకు ఆమె తల్లిలాంటిదే!!

అలాంటి ఆమె రానినాడు –
రాలేదని తిడతారే తప్ప –
ఎందుకు రాలేదని
విచారించే సహృదయం ఎవరికుంది?!

మల్లమ్మో, మరియమ్మో, మంగమ్మో
ఆమె ఎవరైతేనేం?
మన ఆరోగ్యం కోసం –
సదా సమ్మార్జన సేవతో తపించే ఆమెలో –
నేనొక 'మహాత్ముని' చూస్తాను!
ఒక 'మదర్ థెరిస్సా'ను చూస్తాను!!
నాదేశమాతకు చేసినట్లే,
ఆమెకు అభివందనం చేస్తాను!!



### ఆలోచించండి – చెప్పండి

1. ఆ వీధి మాత్రం ఎవరి పేరుకో అంకితమైపోయింది' అనడంలో ఆంతర్యమేమిటి?
2. విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించడం అంటే ఏమిటి?

SCERT, TELANGANA

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడటం

**అ) కింది ప్రశ్నకు జవాబును చెప్పండి**

1) వీధులు శుభ్రం చేసేవారి సేవలను / ఘనతను గూర్చి సొంతమాటల్లో చెప్పండి.

### ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) కింది వాక్యాలను చదువండి. ఆ భావం వచ్చే కవితా పంక్తులు ఎక్కడ ఉన్నాయో గుర్తించి రాయండి.**

1) దుమ్ము ధూళి పొరల మధ్య ఆమె మసక మసకగా కన్పిస్తుంది.

_______________________________________________

_______________________________________________

2) మురికి వీధులు కొత్తకాంతి వస్తుందని మురిసిపోతాయి.

_______________________________________________

_______________________________________________

3) భారత మాతకు నమస్కరించినట్లే ఆమెకు నమస్కరిస్తాను.

_______________________________________________

_______________________________________________

4) ఆమె ఎందుకు రాలేదని ఎంత మంది ఆలోచిస్తారు?

_______________________________________________

_______________________________________________

**ఆ) వాసాల నర్సయ్య రచించిన కింది గేయ పంక్తులు చదువండి. భావం ఆధారంగా వాక్యాలలో తప్పొప్పులను (✗ / ✓) గుర్తించండి.**

చిన్న చిన్న ప్రాణులందు
చీమ కూడ ఒకటే గాని
చీమ బ్రతుకే ఆదర్శము
చిన్న పెద్దకైన గాని!

కష్టపడుచు బ్రతుకు చీమ
కలసి మెలసి బ్రతుకు చీమ
కాలముతో పోటీపడి
చాల పొదుపు చేయు చీమ!!

**(బాలగేయ కుసుమాలు - వాసాల నరసయ్య)**





SCERT, TELANGANA

1) చీమ మనకందరికీ ఆదర్శం. ( )

2) చీమలు కలహించుకొంటాయి. ( )

3) చీమ కాలంతో పోటీ పడుతుంది. ( )

4) చీమ పెద్ద ప్రాణి. ( )

## II వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) కనపర్తి రామచంద్రాచార్యుల గూరించి రాయండి.

2) విచారించే సహృదయం అంటే ఏమనుకుంటున్నారు?

3) మన చుట్టూఉన్న సమాజంలో మనకు ఎవరెవరు సేవలందిస్తున్నారు?

4) 'ఆమె నడిచి వస్తుంటే వీధులన్నీ మురిసిపోతాయి' అని కనపర్తి అన్నాడు గదా! దీనిపై మీ అభిప్రాయం తెలుపండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) కనపర్తి వర్ణించిన శ్రమజీవి ఔన్నత్యం సొంతమాటల్లో, వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి రాయండి.**

1) నీవు, నీ మిత్రుడు మార్కెట్లో కలిశారు. అక్కడ వీధులు శుభ్రం చేస్తున్న కార్మికులను చూశారు. వారి గొప్పదనం / సేవలు తెలిపేటట్లు నీవు – నీ మిత్రుడు మాట్లాడే సంభాషణలు రాయండి.

( లేదా )

2) 'సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత ప్రధానం' అని సందేశం అందిచేలా పోస్టరు తయారుచేయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) దర్శనం : ____________________

2) నేలతల్లి : ____________________

3) అంకితం : ____________________

4) నల్లమొహం : ____________________

**ఆ) కింది పదాలకు అర్థాలను జతపరచండి.**

1) కాంతి ( ) i) స్త్రీ

2) నారి ( ) ii) నమస్కారం

3) అభివందనం ( ) iii) వెలుతురు

**ఇ) కింది గళ్ళలో కొన్ని పాఠాల పేర్లు, కవి / రచయితల పేర్లు ఉన్నాయి. వాటిని వెతికి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| డ్డి | రె | ణ | య | రా | నా |
| పొ | డు | పు | క | థ | లు |
| రి | క్షా | వా | లా | వి | మి |
| అ | న్న | మ | య్య | జీ | స్వా |
| శాం | తా | దే | వి | మ | ష్ణ |
| భా | గ్యో | ద | యం | శ్ర | కృ |
| న | ద్దె | బ | న | త | పో |

____________________

____________________

____________________

____________________

____________________

____________________

____________________

SCERT, TELANGANA

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి అవి ఏ సమాసాలో రాయండి.**

1) అమ్మానాన్నలు : ______________________ - ______________
2) కూరగాయలు : ______________________ - ______________
3) సూర్యచంద్రులు : ______________________ - ______________
4) ఊరూవాడా : ______________________ - ______________
5) తట్టాచీపురూ : ______________________ - ______________

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ వివిధ వృత్తుల వారిని గురించి తెలుసుకొండి. వారు అందించే సేవలను పట్టికగా రాసి ప్రదర్శించండి.

| వృత్తి | వారందించే సేవ |
|---|---|
| 1) డాక్టరు | వైద్యం చేయడం. |
| 2) వడ్రంగి | కట్టెతో వస్తువులు తయారుచేయడం. |
| 3) | |
| 4) | |
| 5) | |
| 6) | |
| 7) | |
| 8) | |

**సూక్తి**

శ్రమ పునాదిపైనే అభివృద్ధి అనే సౌధం నిర్మించబడుతుంది.

SCERT, TELANGANA

# 8 హస్తకళా నైపుణ్యం

– పరాంకుశం దామోదరస్వామి

## చదువండి – ఆలోచించండి.

కింది సంభాషణను చదువండి. ప్రశ్నలకు సమాధానాలను చెప్పండి.

మేఘన : రక్షితా! మీ ఇంటి అలంకరణ చాలా బాగుంది.

రక్షిత : ధన్యవాదాలు! అదంతా కళాకారుల ఘనత!

మేఘన : మీ ఇంటి అలంకరణ బాగుంది, అంటే కళాకారుల ఘనత అంటావు, ఏమిటి?

రక్షిత : కాదా, మరి! ఈ ఇల్లు ఇంత అందంగా ఉండటానికి కారణం, నిర్మల్, లేపాక్షి, కొండపల్లి, ఏటికొప్పాక, పెంబర్తి మొ॥ ప్రాంతాలలో కళాకారుల చేతుల్లో మలచబడిన వివిధ రకాల కళాఖండాల వల్లనే కదా!

మేఘన : నిజమే! దానికి తోడు మీ కళాభిరుచి కూడా! మీ ఇంటి అందానికి కారణం.

### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

1. పై పేరాలో దేని గురించి మాట్లాడుకుంటున్నారు?
2. పై సంభాషణలో ఎవరి విషయం ప్రస్తావించారు?
3. ఏయే ప్రాంతాలలో ఏయే వస్తువులు చేసే కళాకారులు ఉన్నారు?
4. కళాభిరుచి అంటే ఏమిటి?

### పాఠం ఉద్దేశం

మానవుడు తన జీవితంలో కోరుకునేది ఆనందం. ఆ ఆనందం పొందే మార్గాలు ఎన్నో ఉన్నా, వాటిలో మానవుని మెదడుచే (ఆలోచనచే) సృష్టించబడిన 'కళ'కు ప్రత్యేకస్థానమున్నది. ఎన్నో అపురూపమైన వస్తువులను తన మస్తిష్కంలో ఆవిష్కరించి, వాటికి రూపాన్నిచ్చి 'తన హస్తకళానైపుణ్యంతో' మనల్ని అబ్బురపరచడం చూస్తున్నాం. ఇలా తమ హస్తకళా నైపుణ్యంతో ప్రపంచాన్ని తమవైపుకు తిప్పుకున్న పెంబర్తి కళాకారుల నైపుణ్యాన్ని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం. ఇత్తడి లోహంతో వీరు తయారుచేసే వివిధ రకాల అందమైన వస్తువుల గూర్చి తెలుసుకుందాం...



విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాస ప్రక్రియకు చెందినది. ప్రస్తుత పాఠం పరాంకుశం దామోదర స్వామి గారు రచించిన 'ఈ నేల - ఈ గాలి' వ్యాస సంపుటి నుండి గ్రహించబడినది.

## రచయిత పరిచయం



15-08-1941
10-09-1992

పరాంకుశం దామోదరస్వామి గారు ప్రస్తుత హన్మకొండ జిల్లా శాయంపేట గ్రామంలో జన్మించాడు.

1963 నుండి 1987 మార్చి దాక ఆంధ్రజ్యోతి దినపత్రిక న్యూస్‌బ్యూరోలో వివిధ స్థాయిల్లో, 1987 నుండి 1991 వరకు ఆంధ్రప్రభ పత్రికలో పనిచేశాడు.

ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న కాలంలో 'రాజధాని లేఖ' శీర్షికను నిర్వహించి వందలాది వ్యాసాలు రాసాడు.

ఈయన వ్యాసాలను (లభ్యమైన వాటిని) 'ఈ నేల - ఈ గాలి' వ్యాస సంపుటిగా ప్రచురించాడు.

'జాతీయ సమైక్యత, సహోదరత్వానికి" దోహదం చేసే జర్నలిస్టుకు ఇచ్చే అవార్డును 1985లో యునైటెడ్ హిందూ ముస్లీం ఫ్రంట్ ఈయనకు ప్రదానం చేసి సత్కరించింది.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని విషయాలను గ్రహించండి. దాని గురించి మాట్లాడండి.
- మీ ఉపాధ్యాయులు చెప్పే విషయాన్ని వినండి.
- పాఠాన్ని చదువండి. ఇంతవరకు మీరు తెలుసుకున్న విషయాలు పాఠంలో ఉన్నాయో లేవో చెప్పండి.
- పాఠం చదువండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఆ పదాలకు అర్థాలను పదపట్టిక / నిఘంటువులో చూసి లేదా మీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

# I

అది పెంబర్తి గ్రామం. లోహాలలో హస్తకళా నైపుణ్యం చూపి, అపురూపమైన, అపూర్వమైన కళాఖండాలను సృష్టిస్తున్న కేంద్రమది.

పెంబర్తి గ్రామం వరంగల్లు జిల్లాలో జనగామ తాలూకా కేంద్రానికి సమీపంలో వున్నది. హైదరాబాద్ నగరానికి 60 మైళ్ళ దూరంలో వున్నది.



ఇత్తడి రేకులపై నగిషీ, పురాణ, చారిత్రక గాథల చిత్రాలు, నృత్య భంగిమలు, సుందరంగా పూలు, లతలు చెక్కి - ఇత్తడికి బంగారం లాంటి విలువ కలిగిస్తారు అక్కడి కళానిపుణులు.

పెంబర్తి గ్రామంలో ప్రస్తుతం ఈ కళానిపుణుల కుటుంబాలు 25 వరకు వున్నాయి. ఇత్తడి బోళ్లు (పాత్రలు) సిద్ధం చేసే కుటుంబాలు 25 వున్నాయి. వీరంతా విశ్వబ్రాహ్మణులు. గతంలో వీరి కుటుంబాలు 500 వరకు వుండేవి.

కాకతీయ రుద్రమదేవి కాలంలో వీరి పూర్వీకులు శిల్పులు. కాకతీయ శిల్పకళారీతికి భాగస్వాములు. సామ్రాజ్యం క్షీణించడంతో శిల్పకళకు అవసానదశ వచ్చింది. జీవనోపాధికోసం బంగారం, వెండితో ఆభరణాలు చేయడం ప్రారంభించారు.

రాళ్లతో చైతన్యం కలిగించిన ఆ చేతులు, సున్నితమైన బంగారం, వెండిపై నగిషీలు చెక్కడం విడ్డూరమే అయినా, వారికి 'కళా హృదయం' అని చెప్పక చెబుతున్నది.

పెంబర్తి గ్రామంలో 'ఏకాంబరేశ్వరి' ఆలయం ఒకటి వుంది. ఆ ఆలయం, పూర్వీకులు చెక్కిన చివరి శిల్పం.

ఈ కళానైపుణ్యం తరతరాలుగా, వంశపారంపర్యంగా సంక్రమించింది. వారి రక్తంలో కళాసంపద భావనా శబలత, సాంకేతిక విజ్ఞత ఇమిడిపోయాయి. కళాఖండాలను సృష్టించడం వారి నిత్యనైమిత్తికం. అది వారి జీవనం.

రాళ్ళపై ఉబ్బెత్తుగా మానవ, జంతు స్వరూపాలు, పూవులు, కాయలు, తీగలు చెక్కినట్టే, ఇత్తడి రేకుపై చెక్కుతారు. వారి కళారీతిలో కాకతీయ, లేపాక్షి శిల్పశైలి వ్యక్తం అవుతుంది. దేశపరివ్యాప్తంగా ఎక్కడ శిల్పాలయాలు వున్నా ఏ సంప్రదాయం వున్నా దాన్ని ఆకళింపుచేసుకొని ఇత్తడిపై మలచడం వారి ప్రతిభ.

**ఆలోచించండి - చెప్పండి**

1. ఇత్తడికి బంగారంలాంటి విలువ కలిగిస్తారు అక్కడి కళానిపుణులు. అంటే మీకేమర్థమయ్యింది?
2. పెంబర్తి శిల్పులకు ఉగ్గుతో వచ్చిన విద్యగా చెప్పుకోతగినది ఏది?

SCERT, TELANGANA

బిందెలు, గంగాళాలు, కొప్పెరలు, చెంబులు మొదలైన వస్తువులపై దశావతారాలు, నవగ్రహాలు, గీతోపదేశాలు, రామరావణ యుద్ధాలు, సముద్ర మథనాలు – కృష్ణలీలలు, గోపికా పరివేష్ఠితుడై గోపాలుడు, లేపాక్షి, హంసలు, కాకతీయనందులు, అమరావతీ ఏనుగులు – ఎన్నో మరింకెన్నో వారి ప్రతిభలో చోటు చేసుకున్నాయి.



ఇక విద్యుద్దీపాల అలంకరణలు ఎన్నో రకాలు వున్నాయి. గోళాకారంగా, స్తూపాకారంగా, గంటాకారంగా, బెడ్‌లాంపులు, నెమలి ఆకారంలో లాంపులు చేయడంలో వీరి పనితనం చెప్పుకోదగింది.

దేవతా విగ్రహాలు, కవచాలు, ధ్వజస్తంభాలు, వాహనాలు, పూజాసామగ్రి, బంగారంతో, వెండితో, రాగితో, ఇత్తడితో పోతపోయడం కూడా పెంబర్తి శిల్పులకు ఉగ్గుతో వచ్చిన విద్య.

తెలంగాణా ప్రాంతంలోని పలు దేవాలయాలలోను, కోస్తా జిల్లాలో కొన్ని దేవాలయాలలో వీరి కళాసంపద చోటుచేసుకున్నది. మహారాష్ట్రలోని తుల్జాభవాని దేవాలయం వీరి కళానైపుణ్యానికి కాణాచి.

## II

కుతుబ్‌షాహి, అసఫ్‌జాహి (నిజాం నవాబులు) రాజుల కాలంలో నవాబులు, జాగీరుదారులు, ధనికులు పెంబర్తి కళాకారులను విస్తారంగా పోషించారు. బంగారు, వెండితో పాందాన్‌లు, నాగర్‌దాన్‌లు, హుక్కాలు, పన్నీరుబుడ్లు మొదలైన వస్తువులేకాక, వారి స్త్రీజనానికి ఆభరణాలు చేయడం వీరి సొత్తే! ఒక దశలో పెంబర్తి గ్రామాన్ని 'చాందనీఘర్' అని నవాబులు ప్రీతితో పిలిచేవారట.

నవాబుల కాలం తరువాత బంగారు, వెండితో పనులు చేయడం ఆగిపోయింది. క్రమేణ ఇత్తడిపై తమ "పనితనాన్ని" చూపడం ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరి కళానైపుణ్యానికి మెచ్చి, 1956లో పెంబర్తిలో "విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్, ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ"ని నెలకొల్పి ప్రోత్సహించింది. ప్రస్తుతం కళాకారులందరు తమ వస్తువులను సహకార సంఘం ద్వారానే విడుదల చేస్తుంటారు.

**ఆలోచించండి – చెప్పండి**

1. పెంబర్తి గ్రామాన్ని 'చాందినీఘర్' అనటానికి గల కారణమేమిటి?
2. పెంబర్తి వారు ఇత్తడిని వారి కళకు ఎంచుకోవడానికి దారితీసిన పరిస్థితులేమిటి?

SCERT, TELANGANA

దేశంలో ఎన్నో కళా ప్రదర్శనలలోనే కాక, విదేశాలలో జరిగిన ప్రదర్శనలో పెంబర్తి కళాఖండాలు చోటుచేసుకున్నాయి. ఎక్స్‌పో-70, ఏషియన్-1972, క్రాఫ్ట్ ఇండియా - 1974 మొదలైన అంతర్జాతీయ హస్తకళా ప్రదర్శనలో పాల్గొన్నారు.



ప్రముఖులను సన్మానించినప్పుడు, బహుమతులు ఇచ్చినప్పుడు వాడుతున్న షీల్డులను ఇక్కడే తయారుచేయించం ఆయా సంస్థలకు మామూలు అయిపోయింది.

వీరికి కావలసిన ఇత్తడి రేకులు కలకత్తాలోని కాపర్ కార్పొరేషన్ సరఫరా చేస్తుంది. ఇది చాలా మేలురకమైనది. 72% రాగి, 28% యశదము మిశ్రమంతో ఇత్తడిలో మేలురకం వస్తుంది. బంగారువన్నె వస్తుంది. చక్కగా సాగుతుంది. నగిషీకి అనుకూలంగా ఉంటుంది.

నగిషి చెక్కడం విధానం - అదొక శాస్త్రం. అది వారికి ఉగ్గుపాలతో అబ్బిన విద్య. చెక్కడానికి వంద రకాల ఉలులు, మేకులు వాడుతారు, పనిముట్లను వారే సిద్ధం చేసుకుంటారు. ఆ తీరువి మరెక్కడా లభించవు.

ఆ కళాకారులతో ముచ్చటిస్తున్నప్పుడు, ఆ కళపట్ల వారికున్న అభినివేశం వ్యక్తం అవుతుంది. నైపుణ్యానికి ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవాలన్న ఉబలాటం కనిపిస్తుంది.

“మేము కేవలం అన్నం మీద ఆధారపడే జీవులం కాదు. కళ కోసం కూడా జీవిస్తాం. మా పనితనం చూపడానికి బంగారం, వెండి లభించని కాలం వచ్చింది. అందువల్ల ఇత్తడిపై చూపుతున్నాం. అది కూడా కరువు అయ్యేకాలం వస్తే, మళ్ళా రాళ్ళే శరణ్యం” అని శ్రీ అయిలాచారి అన్నారు. ఆ మాటలలో హృదయం వుంది. ఆత్మ విశ్వాసం వుంది. ధైర్యం వుంది.



“ఇది ఉద్యోగాలు దొరకని కాలం. పై చదువులు చదివినా లాభం లేదు. మా కులవృత్తి మాకు వుంది. దానిని వదులుకొని, ఇంకొక దానికి అర్రులు చాచటం అసందర్భం. నా కులవృత్తికి మెరుగులు దిద్దుతాను. రాణ తెస్తాను” అని మెట్రిక్యులేషన్ చదివిన 18 సంవత్సరాల వెంకటేశ్వర్లు అన్నాడు. ఆ మాటలలో పట్టుదల కనిపించింది. స్థైర్యం కనిపించింది. అది వారి కులవృత్తి, అది వారి హస్తకళ, అది వారి గృహ పరిశ్రమ.

SCERT, TELANGANA

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

### విని, ఆలోచించి మాట్లాడడం

**అ) కింది ప్రశ్నకు జవాబును చెప్పండి.**

1) పెంబర్తి కళాకారుల నైపుణ్యాన్ని గూర్చి చెప్పండి.

### ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) కింది పేరాను చదువండి.**

మేము కేవలం అన్నం మీద ఆధారపడే జీవులం కాదు. కళకోసం కూడా జీవిస్తాం. మా పనితనం చూపడానికి బంగారం, వెండి లభించని కాలం వచ్చింది. అందువల్ల ఇత్తడిపై చూపుతున్నాం. అది కూడా కరువు అయ్యేకాలం వస్తే, మళ్ళా రాళ్ళే శరణ్యం" అని శ్రీ అయిలా ఆచారి అన్నారు. ఆ మాటలలో హృదయం వుంది. ఆత్మ విశ్వాసం వుంది. ధైర్యం వుంది.

**ప్రశ్నలకు జవాబులను రాయండి.**

1) పెంబర్తి వారు ప్రాధాన్యత ఇచ్చే అంశమేది?

2) ఇత్తడిలోహాన్ని ఉపయోగించడానికిగల కారణమేమిటి?

3) అయిలా ఆచారి గారి మాటల్లో మీకేం కనిపించింది.

**ఆ) కింది గద్యాన్ని చదువండి.**

బిద్రీ అనేది ఒక లోహకళ. హస్తకళ. ఇది నల్లని వస్తువులపై బంగారు, వెండి తీగల అల్లిక ద్వారా చేసేకళ. ఇది ప్రధానంగా బీహార్‌లో ప్రారంభమైనా, తరువాత హైదరాబాదుకు విస్తరించింది. ఈ కళకు భారతదేశ భౌగోళిక గుర్తింపు లభించింది.

మొదట ఈ కళ పర్షియా నుండి బహమనీ సుల్తానుల ద్వారా 14వ శతాబ్దంలో బీహారుకు చేరింది. బీహార్ పలుప్రాంతాలలో అనేకమంది ఈ కళాకారులు వలసరావడం ద్వారా వారు హైదరాబాద్ నవాబుల వద్దకు వచ్చి ఆశ్రయం పొందారు.

**ప్రశ్నలకు జవాబులను రాయండి.**

1) బిద్రీకళ లక్షణం ఏమిటి?

2) ఇది ఏ ప్రాంతంలో జన్మించింది?

3) హైదరాబాద్ ఈ కళాకారులను ఆదరించినవారెవరు?

SCERT TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులను రాయండి.**

1) ఈ పాఠ్యభాగ రచయిత గూర్చి రాయండి.

2) పెంబర్తి వారిది 'కళా హృదయం' అని చెప్పక చెబుతున్న అంశములేవి?

3) పెంబర్తి కళాకారులకు ఉగ్గుతో వచ్చిన విద్యలుగా చెప్పుకోతగినవేవి?

4) పెంబర్తి వారు ఉపయోగించే ఇత్తడి లోహ వివరాలను రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబును రాయండి.**

1) పెంబర్తి హస్తకళానైపుణ్య విశిష్టతను మీ సొంతమాటల్లో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది అంశాన్ని గురించి రాయండి.**

1) పెంబర్తి కళాకారుల 'హస్తకళానైపుణ్యాన్ని' తెలుసుకోవడానికి, ప్రత్యక్షంగా వెళ్ళి అక్కడి కళాకారున్ని ఇంటర్వ్యూచేయడానికి ప్రశ్నావళిని రూపొందించండి.

లేదా

పెంబర్తి కళాకారులు తయారుచేసిన కళాఖండాలను దర్శించిన తరువాత ఇద్దరు మిత్రులు పొందిన అనుభూతిని "సంభాషణ" రూపంలో రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

1) అపురూపం : ____________________

2) జీవనోపాధి : ____________________

3) మెరుగులు దిద్దుట : ____________________

SCERT, TELANGANA

ఆ) కింది పదానికి సంబంధించిన పదాలను రాయండి.

హస్తకళానైపుణ్యం

ఇ) కింది పదాలకు సరియైన పదాలను (పర్యాయ పదాలను) రాయండి.

1) చైతన్యం = ________________ ________________

2) అభినివేశం = ________________ ________________

## వ్యాకరణాంశాలు

అ) కింది వాక్యాలను చదువండి. కర్త, కర్మ క్రియలను గుర్తించండి.

1) మాధవి శ్రీనివాస్‌కు బహుమతి ఇచ్చింది.

2) క్రికెట్ ఆటలో మనదేశం ఆస్ట్రేలియాను ఓడించింది.

3) ఇందిర సింహాన్ని చూసింది.

4) సంజయ్ జామపండ్లు తిన్నాడు.

| కర్త | కర్మ | క్రియ |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

ఆ) కింది వాక్యాలను చదివి సామాన్య, సంశ్లిష్ట వాక్యాలను గుర్తించుము.

1) మధు మాట్లాడడు. మధు చేసి చూపిస్తాడు.

2) రవి ఊరికి వెళ్ళి, మామిడి పండ్లు తెచ్చాడు.

3) అమ్మ నిద్రలేచింది. అమ్మ ముఖం కడుక్కుంది.

4) రోహిత్ బడికి వెళ్ళి, పద్యాలు నేర్చుకొన్నాడు.

SCERT, TELANGANA

ఇ) కింది పదాలలో ద్వంద్వ, ద్విగు సమాస పదాలను వేరుచేసి రాయుము.

| | | | |
|---|---|---|---|
| నవరసాలు | అన్నదమ్ములు | తల్లిదండ్రులు | దశదిశలు |
| కూరగాయలు | ఎనిమిది బొమ్మలు | షట్చక్రవర్తులు | గురుశిష్యులు |

| ద్వంద్వ సమాస పదాలు | ద్విగు సమాస పదాలు |
|---|---|
| | |
| | |
| | |
| | |

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

➡ ఏదేని 'హస్తకళకు సంబంధించిన' వివరాలను మీ గ్రంథాలయం నుండి సేకరించి రాయండి.

**సూక్తి**

చదువులో ఆనందాన్ని పొందితే
జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటావు.
– మహాత్మాగాంధీ

SCERT, TELANGANA

# కథా విభాగం

(ఉపవాచకం)

SCERT, TELANGANA

# 1. హంస ఎవరిది?

పూర్వం కపిలవస్తు నగరాన్ని శుద్ధోదనుడు అనే రాజు పరిపాలించేవాడు. అతని కొడుకు గౌతముడు. అతనికి సిద్ధార్థుడు అనే పేరు కూడ ఉన్నది. గౌతముడు చిన్నతనం నుండి పెద్దల మీద గౌరవం, భూతదయ వంటి సుగుణాలతో పెరిగాడు. దేవదత్తుడు అతని చిన్ననాటి మిత్రుడు.



ఒకనాడు వాళ్ళిద్దరు నదీ తీరానికి పోయారు. అక్కడ ఆకాశంలో హాయిగా ఎగిరే హంసలను దేవదత్తుడు చూశాడు. వాటిని వేటాడాలని బాణంతో కొట్టాడు. ఆ బాణం ఒక హంసకు తగిలి గిలగిల కొట్టుకుంటూ గౌతముని ముందుపడ్డది. గౌతముడు జాలితో, కింద పడ్డ హంసను ఒడిలోకి తీసుకొని నెమ్మదిగా బాణం తీశాడు. దాని శరీరాన్ని నిమురుతూ దానికి ఊరట కలిగించాడు.


అప్పుడు దేవదత్తుడు అక్కడికి వచ్చి, "నేను హంసను కొట్టాను కాబట్టి అది నాదే!" అన్నాడు. "మిత్రమా! ఆకాశంలో హాయిగా ఎగిరే హంసను ఎందుకు హింసించావు? జీవహింస పాపం కదా!" అంటూ హంసను ఇవ్వడానికి గౌతముడు ఇష్టపడలేదు. దాంతో వాళ్ళ కొట్లాట రాజుగారి దగ్గరికి పోయింది.

SCERT TELANGANA



ఇద్దరూ రాజాస్థానంలో న్యాయాధికారికి విన్నవించారు. దేవదత్తుని బాణం వల్ల హంస చచ్చిపోతే అది అతనిది అయ్యేది. కాని భూతదయతో గౌతముడు దాని ప్రాణాన్ని కాపాడినందు వల్ల అది గౌతమునిదే అవుతుందని న్యాయాధికారి తీర్పు చెప్పాడు. ఈ తీర్పుతో దేవదత్తుడు సంతోషపడలేదు. వెంటనే న్యాయాధికారి ఒక పీటను తెప్పించి దానిమీద హంసను ఉంచమన్నాడు. గౌతముణ్ణి, దేవదత్తుణ్ణి విడివిడిగా హంసను పిలువమన్నాడు. అది ఎవరి దగ్గరకు పోతే అది వారిది అవుతుందని చెప్పాడు. మొదట దేవదత్తుడు హంసను పిలిచాడు.

అతని కోపపు చూపుకు, కఠినమైన పిలుపుకు హంస రాలేదు. గౌతముడు ఆప్యాయంగా హంసను పిలువగానే ఆ హంస అతని ప్రేమపూర్వకమైన పలుకులకు ఎగిరి వచ్చి, చేతిపైన వాలింది. గౌతముని అహింసా పద్ధతికి సభలోని వారంతా చప్పట్లు కొట్టారు. రాజు, న్యాయాధికారి సంతోషించారు.



**అందువల్ల కాఠిన్యం కంటే ప్రేమ, దయ ఉన్నవాళ్ళకే అందరి మన్నన దొరుకుతుంది.**

# 2. సమయస్ఫూర్తి


తన ఆస్థానంలో ఉండే బీర్బల్ అంటే అక్బర్‌కు చాలా అభిమానం. ఇది ఆస్థానంలోని మిగిలిన వారికి నచ్చేది కాదు. తాము బీర్బల్ కన్నా తెలివైన వాళ్ళమని వాళ్ళ ఉద్దేశం. ఈ విషయాన్ని అక్బర్ గమనించాడు.

అక్బర్ ఒకనాడు సభలోని వాళ్ళందరినీ ఉద్దేశించి ఇట్లా అన్నాడు. “మీకు నేనొక పరీక్ష పెడుతున్నాను. అదేమంటే మన ఆగ్రా పట్టణంలో ఎన్ని కాకులు ఉన్నవో లెక్కబెట్టి చెప్పండి. సరైన జవాబు చెప్పినవారిని అందరికన్నా తెలివైనవారుగా ఒప్పుకుని మంత్రిపదవి ఇస్తాను”.

అందరూ ఇదే అవకాశమనుకొని, తాము బీర్బల్ కన్నా తెలివైన వాళ్ళమని నిరూపించుకోవచ్చని కాకులను లెక్కబెట్టేందుకు పోయారు.

రాజుగారి ఆస్థానంలోని ఉద్యోగులందరూ ఊరిమీద పడి కాకులను లెక్కబెడుతుంటే ప్రజలంతా ముక్కు మీద వేలు వేసుకొన్నారు.

అందరూ ఊరంతా తిరుగుతూ ఇండ్లమీద, చెట్లమీద, నది ఒడ్డున, వీధుల్లో, వాడల్లో, చెత్తా చెదారాలలో వెతుకుతూ కాకులను లెక్కపెడుతునే ఉన్నారు.



SCERT, TELANGANA

అందరిలో ఒకటే భయం. ఎవరు తమకన్నా ముందు పోయి రాజుగారికి లెక్క చెబుతారో, తాము పెడుతున్న లెక్క సరైనది అవునో కాదో అని భయపడుకుంటూనే కాకులను లెక్కబెట్టసాగారు. కాని బీర్బల్ అయితే ఏమీ లెక్కపెట్టకుండా హాయిగా ఇంట్లో విశ్రాంతి తీసుకోసాగాడు.

రాజు చెప్పిన రోజు రానే వచ్చింది. అందరూ రాజుగారి సభలో కూర్చున్నారు.

"ఆగ్రా పట్టణంలో ఎన్ని కాకులున్నవో లెక్కపెట్టారా?" అని అక్బర్ అడిగాడు.

"ఇంకా లేదు ప్రభూ! మాకు ఇంకొంత సమయం కావాలి" అన్నారందరూ, బీర్బల్ తప్ప.

"బీర్బల్! నువ్వు చెప్పు" అన్నాడు అక్బర్.

"ప్రభూ! ఆగ్రా పట్టణంలో మొత్తం ఆరువేల ఎనిమిది వందల మూడు కాకులున్నాయి" అన్నాడు బీర్బల్.

వెంటనే ఒకతను లేచి...

"ప్రభూ! నేను ఎంతో కష్టపడి లెక్కపెడితే ఎనిమిది వేల కన్న ఎక్కువనే కాకులున్నాయి..... బీర్బల్ తప్పు చెబుతున్నాడు" అన్నాడు.


"లేదు ప్రభూ! నేను లెక్కపెడితే ఐదువేల కాకులే ఉన్నాయి" అన్నాడు మరొకతను.

"ఏం బీర్బల్! వీళ్ళ లెక్కకు నీ లెక్కకు అంత తేడా ఉన్నది కదా! సమాధానం చెప్పు" అన్నాడు అక్బర్ కోపంగా.

అందరూ బీర్బల్ పని అయిపోయిందని అనుకున్నారు. తమకు మంత్రిపదవి రాకపోయినా బీర్బల్ బండారం బయటపడి, అతని పదవి ఊడుతుందని, బీర్బల్ పీడ పోతుందని అందరు సంబురపడ్డారు.

అప్పుడు బీర్బల్, "ప్రభూ! నేను చెప్పిన సంఖ్యనే సరియైనది. మొదటి వ్యక్తి లెక్కపెట్టినప్పుడు కాకుల చుట్టాలు పక్క ఊరినుండి మన ఊరికి వచ్చాయి. అందుకే అతనికి ఎక్కువ కాకులు కనిపించాయి. రెండో వ్యక్తి లెక్కపెట్టేటప్పుడు మన ఊరి కాకులు పక్క ఊళ్ళోని చుట్టాల ఇంటికి పోయాయి. అందుకే లెక్క తక్కువ వచ్చింది" అన్నాడు.

బీర్బల్ సమయస్ఫూర్తికి అక్బర్ ఫక్కుమని నవ్వాడు. తమకంటే బీర్బల్‌కే తెలివితేటలు, సమయస్ఫూర్తి ఎక్కువ అని సభలోని వాళ్ళందరూ ఒప్పుకున్నారు.



SCERT, TELANGANA

# 3. ఊరు - అడవి

- పొట్లపల్లి రామారావు

బ్రహ్మాండంగా మండుతుంది ఎండ.

గడ్డిపోచలేకుండా మారి రుద్రభూమివోలె కనిపిస్తుంది నేల, నిప్పులా మండుతున్న ఎండలో నుంచి నడచిపోతున్నాను. నా శరీరంలోని సర్వశక్తులు ఎండ ఊడ్చేసింది. దాహబాధకు శరీరమంతా నీరసంగా ఉంది. ఎక్కడ నీరు జాడ కనుపించడంలేదు దప్పి తప్ప నాకు.

"ఎంత కోపముంది?"

వేరే సంగతి స్మృతిలోలేదు, దూరాన వచ్చి చెట్ల కింద, ఓ ఊరు కనుపించింది. పచ్చని చెట్లను, మనుష్యుల ఇళ్లను చూడటంతోనే నీరు త్రాగినట్టే కొత్త ప్రాణం వచ్చింది నాకు. ఊళ్ళోకి పోయి ఒక ఇంటి ముందు ఆగి "దాహం" అని అరచాను.

"ఏ ఊరు మీది?"



SCERT TELANGANA

మొదలుమొదలు అడిగాడు ఆయన దాహముకన్నా అది ముఖ్యావసరమైనట్టు. దాహబాధతో ఊరు, పేరు చెప్పబుద్ధిపుట్టలేదు నాకు. నేను మాట్లాడలేదు, ఆయన అట్లాగే నిలబడ్డాడు. పేరు చెప్పంది నీళ్ళు పోయనన్నట్లు ఆయన అట్లా నిలబడడం నాకు బాగుండలేదు. కొంచెంసేపు నిలబడి ఇంకొక ఇంటికి పోయాను.

"ఎవరు మీరు?"

మళ్ళీ అదే ప్రశ్న?

మళ్ళీ అదే ప్రశ్న వినడం నాకు బాగనిపించలేదు, కొంచం కోపం వచ్చింది.

"నాకు దాహం వేస్తుంది" అన్నాను.

"ఎవరంటె మాట్లాడరెందుకు?"

"ఎవరైతే ఏమిటయ్యా... దాహం యియ్యటానికి?"

"ఎవరైంది చెప్పకూడదా?"

"దాహానికి ఎవరైతే ఏమిటి?"

"ఎవరిని అడిగితే ఇంత బాధ ఏమిటయ్యా?"

అక్కన్నుంచి ఇంకో ఇంటికి పోయాను.

"మీ పేరేమిటి?"

మళ్ళీ అదే ప్రశ్న. నాకు మరీ కోపం వచ్చింది.

"ఎవరైతే ఏముంది?"

"కాదు ఏమి మీ పేరు?"

"ఏదో ఒక పేరు."

"ఏమిటయ్యా... చెపుదూ?"

"అబ్బా! పేరు! పేరు! ఏపేరైతే ఏముంది?"

"అంత విసుగు ఎందుకయ్యా?"

"నీరు, నీరు అని ప్రాణాలు వదులుతున్నవాణ్ణి పేరు-పేరు! అని ఏడిపిస్తారేమిటి?"

కోపంతో ఊరుదాటిపోయాను. ఊరుదాటినవెనుక, నా తెలివితక్కువతనంమీద, తొందరపాటుమీద నాకు కోపం వచ్చింది. ఎందుకంటె ఊరుపోయి అడవి వచ్చింది. అడవిలో నీళ్ళు ఎక్కడ దొరుకుతావి? ఏమిచేయాలో నాకేమి తోచలేదు. పిచ్చివాడి మోస్తరు. అడవిలో పోతున్నాను. నా శరీరం నా వశం తప్పదొడగింది. నాకాళ్ళు తడబడ దొడగాయి. మృత్యువు ముంచుకొస్తున్నట్టు కళ్ళు చీకట్లు కమ్మదొడగయి. దాహముతో అడవి మధ్య చచ్చిపోతానేమో అని భయం వేయదొడగింది. ఇంతలో హఠాత్తుగా ఓ చిన్న వాగు ఎదురైంది. నా విగతజీవాలు వాగు రూపంలో ప్రత్యక్షమైనట్లు పొంగిపోయాను. వాగులో బాటసారులు ఓ చెలమతోడి ఉంటారు. చెలమలోకి తలవంచి అమృతము త్రాగినట్టు ఆ నీరంతా త్రాగేసాను. దాహానికి నీరుదొరికినందుకు నాకు ఎంతో ఆనందమైంది. నీరు తాగుతూ, తాగుతూ నాకు ప్రాణదానం చేసిన ఆ మూగతల్లికి కోటి నమస్కారాలు చేసాను.

కాని అన్నిటికన్న నాకు మహా ఆనందం కలిగించిన విషయమేమిటంటె ఆ చెలిమ నా ఊరు. పేరు గూర్చి ప్రశ్నలు వేయలేదని, యిదియేదో అసాధారణ విషయమని నాలో నేను అలౌకికానందంతో పొంగిపోయాను.

SCERT, TELANGANA

# 4. రిక్షావాలా!

– పబ్బరాజు గోపాల్‌రావు

## I

అవి జ్యేష్ఠమాసపు రోజులు. ఎండ విపరీతంగా ఉంది. ఎండతో పాటు వడగాడ్పు కూడా ప్రచండంగా వీస్తున్నది. శ్రమజీవులకు పనిచేయనిదే కడుపు నిండదు.

ఉదయం ఎనిమిది గంటలకు పట్టణం చివరన శిథిలావస్థలోనున్న పూరిగుడిసె నుండి తన జీవనోపాధియైన రిక్షాను తీసుకొని పట్టణప్రాంగణంలోకి బయలుదేరాడు రంగడు. రోజులాగే తను తిరుగుతున్న బజార్లు, చౌరస్తాలు, బస్సు స్టాండులు కలయతిరిగాడు. ఒక్క బాడుగా దొరికిన పాపానపోలేదు.

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. సూర్యుడు ఆకాశమధ్యానికి చేరుకొని ఎండను మరింత తీవ్రపరుస్తున్నాడు. వడగాడ్పు మరీ విజృంభించింది. ప్రొద్దుట నుండి రంగడు నోరు కదిపిన పాపాన పోలేదు. ఎండకు తోడు ఆకలి మంట కూడా ఆకాశాన్నంటుకొంటున్నది. తిన్నగా ఒక మూలాన రిక్షానాపి, నడివీధిలో నీటికుళాయి వద్దకు వెళ్ళి, పొట్టనిండా ఇన్ని నీళ్ళు త్రాగి, "తనలాంటి వాళ్ళకి పనిదొరకని రోజున అన్నానికి బదులు ఈ నీళ్ళే ఆహారం" అనుకుంటూ రిక్షా వద్దకు వచ్చి, రిక్షానీడన జాగిలపడి, ముప్ఫై సంవత్సరాలుగా, అంగుళం మేర జరగని, ఆశాజ్యోతి స్ఫురించని తన జీవితాన్ని గురించి ఆలోచిస్తున్నాడు. ఆకలిమూలంగా ప్రేవులు, 'గుఱ్ఱు, గుఱ్ఱు' మంటూ పిల్ల కూతలు కూస్తున్నై. 'అసలు శ్రమజీవుల జీవితమే సముద్రంలో బుడగలాంటిది. బుడగల్లాంటి శ్రామికుల్లో తనూ ఒకడు.'

రంగడిలా అనుకూంటుండగనే "ఒరేయ్ రిక్షా!... ఇలారా...! అన్న అధికారపూర్వక స్వరం స్ఫుటించింది.

రంగడు పోయే ప్రాణాలను ఎగతోడుకొని "వస్తున్నా బాబూ!" అంటూ ముందుకు పరుగెత్తాడు.

అపర విఘ్నేశ్వరుడిలా వున్న ఓ వ్యాపారి "చౌరస్తా కెళ్ళాలి బాడుగెంత?" అన్నాడు.

"ఇంత ఇవ్వమని అడుగుదామా! అక్కర్లేదని వెడతాడేమో! పొద్దుటి నుండి ఒక్క బాడుగేనా దొరకలేదు. ఇది కూడా చేజారిపోతుందేమోనని" 'తమదయ' అన్నాడు రంగడు.

వ్యాపారి రిక్షా ఎక్కి కూర్చున్నాడు. రిక్షా శరవేగంతో ముందుకు పోతున్నది. మూడు నాలుగు ఫర్లాంగుల దూరం పోయే వరకు ఇలాంటి విఘ్నేశ్వరులను మోసి మోసి వృద్ధాప్యానికి వచ్చిన రిక్షా యిరుసు కాస్తా విరిగి నేలకూలింది.



అదృష్టవశాత్తూ వ్యాపారస్తునికి గాని, రంగడికిగాని గాయాలేమీ తగల్లేదు. కాని నడివీధిలో నలుగురి ఎదుటా క్రిందపడి భంగపడ్డందుకు వ్యాపారస్తుని అభిమానం హద్దులు దాటి, కోపోద్రిక్తుడై రంగడిమీద చేయి చేసుకున్నాడు. చొక్కా కూడా సరిగాలేని రంగడి వీపు మీద పాదరక్షతో నాలుగయిదు దెబ్బలు కొట్టినా కోపోపశమనం జరక్క, నోటికి వచ్చినట్లు తిట్టుకుంటూ వెళ్లిపోయాడు.

ప్రొద్దుటి నుంచి ఒక్క బాడుగ దొరక్క, తిండికిలేక, సాయంత్రం దొరికిన ఒక్క బాడుగ డబ్బులురాక, చావుదెబ్బలు తిన్నాడు. జీవనాధారమైన రిక్షా విరిగింది. సాయంత్రం ఆరుగంటల వరకల్లా రిక్షాతో సహా కిరాయి పైకం ఇవ్వకపోతే 'సేట్జీ' గుమాస్తాను ఇంటికి పంపుతాడు. తను సేట్జీకి ఇప్పుడేం సమాధానం చెపుతాడు?'

రంగడు తన దీనావస్థను పలు విధాలుగా ఊహించుకుంటూ ఇంటికి బయలుదేరాడు.

రంగడికి తల్లిదండ్రులు లేరు. ఒక్క చెల్లెలు మాత్రం ఉంది. అన్న రాకకు ఎదురుచూస్తున్న రామికి ఇంటి ముందర రిక్షా చప్పుడు కాగానే గుడిసె బయటకి వచ్చింది. విరిగిపోయి రిక్షాను లాక్కుంటూ, అతి దీనంగా, నీరసంగా సమీపిస్తున్న అన్నను చూడగానే ఏదో సంఘటన జరిగి ఉంటుందని అందుకే అంత నీరసంగా వస్తున్నాడనుకుంది.

రంగడు రిక్షానలా విడిచేసి, భారంగా గుడిసెలోకి ప్రవేశించి కుక్కిమంచంలో మేనువాల్చాడు.

"మంచి నీళ్ళివ్వనా అన్నా!" అంటూ రామి మందలించింది.

రంగడు సమాధానం ఇవ్వలేదు.

రామి తనలోతాను 'పేదాళ్ళకు రోజూ ఏదో ఒక కష్టాలు' అంటూ నిట్టూర్చింది.

రామి కనులనుండి రాలుతున్న అశ్రువుల్ని చూచి రంగడికి అంతలోనే భాతృప్రేమ పెల్లుబికింది.

"కన్నీరెందుకు చెల్లీ? మనబోటి వాండ్రకు బ్రతుకంతా ఇట్లాంటివి బోలుడు వస్తూంటాయి. గొప్పవాళ్ళంతా తినడానికి బ్రతుకుతుంటే, మనం బ్రతకడానికి తింటూంటాం. విచారపడి చేసేదేమిటి? నీతి – నిజాయితీ జీవితాలకి భవితవ్యం. ఎల్లకాలం కష్టాలు కాపురముండవు. కాని అనుకున్నంత త్వరలో మాత్రం పరిష్కారం కావు."

భవిష్యత్తులోని భయంకర దృశ్యం లోలోపల కనిపిస్తూన్నా అనుభవించక తప్పదని చెల్లెలిని ఎలాగో ఓదార్చాడు రంగడు.

## II

రాత్రి సుమారు పదిగంటలకు "ఓయ్ రంగన్నా! ఆరు గంటలకల్లా రిక్షా కిరాయి వప్పజెప్పాల్సిన వాడివి ఇంతవరకు రాకపోవడం మూలంగా సేట్‌జీ కోపగించి, నిన్నూ, రిక్షాను తీసుకురమ్మన్నాడు. పద... ఆలస్యం చేయకు" అన్న సేట్జీ గుమాస్తా కేక వినపడింది.

రంగడు ఉలిక్కిపడి లేచి, జరిగిన యావత్తు సంగతినీ, ఆ వచ్చిన వ్యక్తితో చెప్పి, ఉదయమే సేట్‌జీతో తప్పక మాట్లాడుతాను. ఈ రాత్రికి క్షమించమని బ్రతిమాలాడు.

గుమాస్తా సానుభూతిని ప్రకటిస్తూ "రంగా! సేటు విషయం నీకు తెలియంది కాదు. వాడంత కంకుష్టకుడు కాబట్టే అంతటి వాడయ్యాడు. ఇప్పుడు నిన్ను తీసికెళ్ళకపోతే నేటి నీ అవస్థే, రేపు నాకూ పడుతుంది" అన్నాడు.

తనకోసం, తోటివారిని కష్టాల్లో ఇరికించే మనస్తత్వం కాదు రంగడిది. అందుకే ఆ గుమాస్తా సహాయంతో విరిగిన బండిని తీసుకొని సేట్జీ ఇల్లు చేరుకున్నాడు.

రిక్షా ఇరగొట్టినందుకు యాభై రూపాయలు చెల్లించి, విడిపించుకుంటా"నన్నాడు రంగడు. సేట్జీ 'సరే' నంటూ గుడిసె గిర్వీ వ్రాయించుకొని అణాబిళ్ళ అంటించి, రంగడి సంతకం చేయించుకొని రిక్షాను బాగుచేయించి, యెప్పటిలాగే రోజు కిరాయికిచ్చాడు.

రంగడు బాకీ తీర్చాలనే పట్టుదలతో రాత్రింబవళ్ళు కష్టించడం ప్రారంభించాడు. కాని ఎంత కష్టించినా రిక్షా కిరాయిపోను చెల్లెలికీ, తనకీ పొట్టగడవడమే కష్టమయేది. అయినా పట్టుదల రంగడిలో వీసమెత్తయినా బీరుపోలేదు.

నెలరోజులు దాటాయి. రాత్రి పన్నెండు గంటలకు లేచి, రిక్షా తీసుకొని రైల్‌స్టేషన్‌కు బయలుదేరాడు. బండి వచ్చింది. ప్రయాణీకులంతా కలకలంతో బయటికి వస్తున్నారు. 'రిక్షా...! రిక్షా...! అంటూ ఓ మనిషిని సమీపించాడు రంగడు.

ఆ వ్యాపారస్తుడు రంగడి రిక్షా ఎక్కుతూ 'చౌరస్తాకు తీసికెళ్ళు' అన్నాడు.

అతను చౌరస్తావద్ద దిగి రంగడిచేతిలో నాలుగణాల బిళ్ళపెట్టి వెళ్ళిపోయాడు.

రంగడు ఇంటికి చేరుకొని రిక్షా మూలకు చేరుస్తుండగా రిక్షాలోంచి ఒక బరువుగల సంచి క్రిందపడింది. "మిణుకు మిణుకు" మంటున్న దీపాన్ని పెద్దది చేసి, సంచిని చేతిలో పట్టుకొని లోనికెళ్ళి తెరచిచూచాడు. సంచినిండా ముత్యాలున్నాయి.

చౌరస్తాలో రిక్షాదిగి వెళ్ళిన వ్యక్తి ముత్యాల వర్తకుడనీ, అతనే సంచి మరిచిపోయి ఉంటాడనీ, రంగడు నిశ్చయించుకున్నాడు. తను ఇప్పుడు అక్కడికెళ్ళి, పాపమా వర్తకుడికి అందజేతామన్నా, ఇంతటి మహాపట్నంలో అతనెక్కడ?

SCERT, TELANGANA

తనెక్కడ...? రోజులాగే రంగడు రిక్షాతీసుకొని, ఉదయం ఎనిమిది గంటలకు పత్రికా కార్యాలయానికి వెళ్ళి "ఎవరో ముత్యాల వ్యాపారి రాత్రి తన రిక్షాలో సంచీ మరిచిపోయాడనీ, ఆయన వచ్చి గుర్తులు చెబితే ఇవ్వగలననీ" ప్రకటన వేయించాడు. రిక్షావాని నిజాయితీకి పత్రికాధిపతులు అచ్చెరువు పడ్డారు.

ప్రకటన చూచుకొని వ్యాపారి సంతోషంతో రంగడి ఇంటికి వచ్చాడు. రంగడు జరిగిన సంగతి వ్యాపారికి చెప్పి, ముత్యాల సంచి చేతికందించాడు. సంచీ అందుకుంటూ, కృతజ్ఞతతో రంగడి ముఖాన్ని పరిశీలించి చూచాడు. "ఇంకెవరూ?... తనానాడు చేయి చేసుకున్న రిక్షావాడే" వ్యాపారస్తుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. రంగడు కారణమడిగాడు.

వ్యాపారస్తుడు సంఘటనను వివరించి చేతులు పట్టుకొని క్షమాపణ వేడుకున్నాడు. వెంటనే జేబులోంచి వేయి రూపాయిల కట్టను తీసి రంగడికి ఇస్తూ తన వ్యాపారంలో భాగస్వామిగా చేర్చుకున్నాడు. రంగడు కృతజ్ఞతాసూచకంగా చేతులు మోడ్చి వ్యాపారస్తునికి నమస్కరించాడు.



ఇంటి గిర్వీ క్రింది చెల్లించవలసిన రూపాయలు వడ్డీతో సహా చెల్లిస్తూ ఇంటిని విడిపించుకున్నాడు. వెంటనే చెల్లెలికో సంబంధాన్ని కుదిర్చి పెళ్ళి వైభవంగా జరిపాడు. రంగడి జీవితరథం నవనవోన్మేషంతో కాంతిపుంజాలను విరజిమ్ముతూ సుఖమయమైన పథంలో ప్రయాణిస్తోంది. అందుకే నీతి, నిజాయితీ మనిషికి పెట్టని ఆభరణాలంటారు.

# 5. బకాసురుడి విందు

- పోల్కంపల్లి శాంతాదేవి

## I

లీలకు ఈ రోజు మొదటిసారి పెళ్ళిచూపులు. ఒక మధ్యతరగతి అమ్మాయి పెళ్ళి చూపుల ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతాయో అలాగే జరిగాయి.

పిల్లను శల్యపరీక్ష చేస్తున్నట్లుగా. నిర్భయంగా కళ్ళు పత్తికాయలు చేసుకొని చూశాడు వరుడు. పిల్ల ఓరగా అయినా స్పష్టంగానే చూసింది.

"ఇంట్లోకి వెళ్ళమ్మా!" లీల తండ్రి నారాయణరావు చెప్పాడు.



"ఆఁ ఇక ఇచ్చిపుచ్చుకోవడాల సంగతి మాట్లాడుకొందామా?" మధ్యవర్తి వ్యవహారంలోకి దిగాడు.

"పిల్ల నచ్చిన తరువాత కదా?"

"చెప్పవయ్యా, సుధాకర్! పిల్ల నచ్చిందా?!

"ఆఁ" సంతృప్తితో తలాడించాడు. "కొంచెం ఆ పళ్ళు ఎత్తులేకపోతే బాగుండేదండీ! అయిన పర్వాలేదనుకోండి నాకు నచ్చింది!"

పక్క గదిలో తలుపు పక్కనే నిలబడి ఉంది లీల. వరుడు అంత నిర్మొహమాటంగా, ఏమనడానికైనా తనకు హక్కు ఉన్నట్టుగా తన పళ్ళమీద కామెంట్ చేయడం నచ్చలేదు. ఆ పిల్ల ఒళ్లు మండిపోయింది.

"ఏమ్మా? అబ్బాయి నచ్చాడా?" అని తనను అడగరేం?

"ఆయన కళ్ళు అంత మిడిగుడ్లలా ఉన్నాయేం? అయినా పర్వాలేదు. నచ్చాడు" అని చెప్పేది,

పెద్దల వ్యవహారం చాలా నిర్మొహమాటంగా ఖచ్చితంగానే నడిచింది.

వరుని రేటు పదివేలుగా తేలింది. ఇంకా ఆడపిల్లల లాంఛనాలు, అవీ ఇవీ...

నారాయణరావు ముఖం కొంచెం పాలిపోయింది. ఆయన అయిదువేల నగదూ, ఉంగరం, గడియారం లాంటి లాంఛనాలైతే తనవల్ల అవుతుందనుకున్నాడు. ఆ మాటే తేల్చి చెబితే ఈ సంబంధం ఇప్పుడే బెడిసికొడుతుందేమోనన్న జంకుతో.

"ఆదివారం నేనక్కడికి వస్తాను! అప్పుడు అన్నీ మాట్లాడుకుందాం" అన్నాడు.

పెళ్ళిచూపుల కార్యక్రమం ముగిసిపోయింది.

◈ ◈ ◈

## II

"ఏమిటే నువ్వు మాట్లాడేది?" లీల తల్లి విడ్డూరంగా అడిగింది.

"వరకట్నం పదివేలు కాదు!... కట్నం పేరుతో అతడు ఒక్కపైసా తీసుకొన్నా నేనతడిని చేసుకోను!" లీల ఖచ్చితంగా చెప్పింది.

"కట్నం ఇవ్వకపోతే అతడెందుకు చేసుకొంటాడే నిన్ను? రంభవని చేసుకొంటాడా? మినిస్టర్ బిడ్డవని చేసుకొంటాడా?" ఆమె తీవ్రంగా అంది.

"చేసుకోకపోతే సరే."

"పెళ్ళీ పెటాకులు లేకుండా మా గుండెలమీద కుంపటిగా ఉండిపోతానంటావా!"

నా కంటే అయిదేళ్ళు పెద్దవాడు అన్నయ్య! వాడుకాని గుండెల కుంపటి నేనయ్యానా?"

"వాడికీ నీకూ పోలికేమిటే? వాడు మగాడు. ఏనుగు చచ్చినా వెయ్యే. బతికినా వెయ్యే అన్నట్టు మగాడు పెళ్లి చేసుకొన్నాసరే, చేసుకోకపోయినాసరే.

SCERT, TELANGANA

"మన జాతిని మనమే కించపరచుకోవడం ఎందుకమ్మా? మగాడి అండ ఆడదానికి ఎంత అవసరమో, ఆడదానితోడు మగాడికి అంతే అవసరం. ఆడది సంపాదించుకోనన్నాళ్ళు అతడి గొప్పతనం చెల్లింది కాని, ఇప్పుడు ఆడది సంపాదించుకొంటోంది. అతడి పప్పులేం ఉడకవు."

"బాగుందమ్మా వాదం! సంపాదనే సమానత్వం తీసుకవస్తుందా? నువ్వు కట్నం ఇచ్చి అతడిని పెళ్ళిచేసుకోకపోతే అతడికి పెళ్ళి కాదనా? మధ్యవర్తి చెప్పనే చెప్పాడు. మీ నాన్నగారిని చాటుకు పిలుచుకొని. సిరిపురం వాళ్ళు పన్నెండు వేలు ఇచ్చి రెండెకరాల పొలం వ్రాసిచ్చి, పట్నంలో ఇల్లు కొనిస్తామని వెంటపడ్డారట. తొందరగా సంబంధాన్ని నిశ్చయం చేసుకోకపోతే చేయిదాటి పోతుందట. ఇంత మంచి సంబంధం చేజార్చుకోవడం మీ నాన్నకు ఇష్టంలేదు. అందుకే ఆ పల్లెలో ఆ రెండెకరాలు బేరం పెట్టడానికి వెళ్ళారు."

"మిమ్మల్ని సర్వనాశనం చేసే ఈ పెళ్ళి నేను చేసుకోను! నన్ను ఎక్కువగా బలవంతం పెడితే నా శవమే చూస్తారు!"

లీల విసురుగా గదిలోకి వెళ్ళిపోయింది.

◈ ◈ ◈

ఆరేడిళ్ళు వాడుకొనే నూతి దగ్గర ఆడంగుల సంభాషణ ఇలా సాగుతోంది.

"విన్నావా, పిన్నీ! మొన్న సుశీలమ్మ కూతురికి పెళ్ళిచూపులయ్యాయా...! వాళ్ళు పదివేల కట్నం లాంఛనాలు గట్రా అడిగారట, తండ్రి ఎలాగో తంటాలుపడి ఇవ్వడానికి సిద్ధపడితే, కట్నం తీసుకొనే వరుణ్ణి నేను చేసుకోను పొమ్మందట, ఆ పిల్ల!"

"ఆ ఎత్తుపళ్ళకే అడిగి ఉంటారు పదివేలు." కిసుక్కున నవ్వు. "ఈవిడేమైనా తిలోత్తమా? ఊర్వశా? లేక పెద్ద ఉద్యోగస్తురాలా? వాళ్ళ నాన్న ఇండియా ప్రధానా? "నువ్వే ఒక కట్నం! వేరేకట్నమేల భామా!" అని ఆ వరుడు ముందుకురావడానికి? ఈవిడొక్కతి మీదినుండి ఊడిపడింది కాబోలు!"

"ఆ పిల్లదంతా మగరాయుడి పోజులెద్దూ! రిజల్టు వస్తూనే ట్రైనింగ్‌కు వెళుతుందట, ఉద్యోగం చేస్తుందట!"

"చేయనీ! ఎంతమంది చేయడంలేదు! తనేమిటో ప్రత్యేకంగా పుట్టుకొచ్చినట్టు కట్నం తీసుకొనేవాడిని పెళ్లిచేసుకోననడమేమిటి? ఆ పిల్లవాడికి కట్నం ఇచ్చి ఇంకెవ్వరూ పెళ్ళి చేయరనా?"

"మళ్ళీ ఎవరితోనూ అనకు కాని, మా రమణిని ఆ పిల్లవాడికి ఇద్దామనుకొంటున్నాం. నారాయణరావుకు పోటీ వెళ్ళినట్టు అప్పుడే ఎందుకు అడగాలని ఊరుకొన్నాం. అటో, ఇటో తేలుతూనే వాళ్ళు అడిగిన దానికి ఓ రెండువేలు ఎక్కువిచ్చి చేసినా బాధలేదు. రాజాలాంటి సంబంధమాయె! ఉద్యోగం చేస్తున్నాడు. పైగా పల్లెలో పొలం, ఇల్లు ఉన్నాయి. మనకు తగిన సంప్రదాయం కూడా."

ఈ సంభాషణలో పాల్గొని కిసుక్కున నవ్వినావిడే తన పాత్ర మినహాయించుకొని అందరి మాటలూ సుశీలమ్మ చెవిలో వేసింది. "ఆ రాధమ్మ గుంటకాడి నక్కలా కాచుక్కూర్చుంది. మీరు పిల్లమాట విని అంత మంచి సంబంధం పోగొట్టుకోకండి వదినా! నయానో, భయానో ఒప్పించండి ఆ పిల్లను!"

సుశీలమ్మ కంటనీరు పెట్టుకొని, పమిటతో తుడుచుకొంటూ "ఏం చేయనమ్మా? బొత్తిగా పెడసరం పిల్ల అయింది. బలవంతం చేస్తే చస్తానంటూంది?" అంది.

◈ ◈ ◈

SCERT, TELANGANA

## III

నారాయణరావు పల్లె నుండి అప్పుడే తిరిగి వచ్చాడు. ఆయన ముఖం వాడిపోయి అలసట సూచిస్తుంది. అయినా పని సాధించుకు వచ్చిన ఉత్సాహం ఆయన దాచుకోలేకపోతున్నాడు.

"ఒకేసారి వారం రోజులు వెళ్ళారే? ఈ పూటొస్తారు. ఆ పూటొస్తారు అని మూడు రోజుల నుండి మీ కోసం చూస్తున్నాను."

"పోయిన పని కానిదే ఎలా వస్తాను? డబ్బు చేతిలో వేసుకొనే వచ్చాను. మనం ఇదో అదో అని తాత్సారం చేస్తే ఆ సంబంధం కాస్తా జారిపోతే..."

"ఇల్లు అలుకగానే పండుగ కాదు లెండి" అంటూ ఆవిడ ముఖం ముడుచుకొని భర్తకు స్నానానికి నీళ్ళు తోడబోతూ, "ఇవాళ ఎక్కడి నుండో మీకు ఉత్తరం వచ్చింది. అల్మారాలో ఉంచాను చూడండి" అంది.

నారాయణరావు అల్మారా తెరిచి కవరు తీసుకొన్నాడు. "వస్తామని, ఇంకా రాలేదేమిటని రాశారేమో! ఒకేసారి కట్నం డబ్బు తీసుకువెళ్ళి, వాళ్ళ చేతిలో పెట్టి, ఏకంగా ముహూర్తం పెట్టుకురావాలి!"

కవరు చించి ఉత్తరం బయటికి తీశాడు.

"శ్రీ సుధాకర్ రావుగారికి.

నమస్కారం.

నా ఎత్తుపళ్ళమీద మీరు కామెంటు విసరినప్పుడు మీరు కొంచెం సోషల్‌గా ఉంటారనిపించింది. తరువాత తెలుపుతామని బెట్టుచేయకుండా పెళ్ళిచూపుల రోజే మీ అభిప్రాయం (నేను నచ్చానని) చెప్పడం దాన్ని బలపరిచింది. కాని, పెద్దమనుషులు కట్నకానుకలు మాట్లాడుకొంటున్నప్పుడు మీరు మౌనం వహించడం చూస్తే నా ఊహ తలకిందులైంది.

మీరు చదువుకొన్నారు. ఉద్యోగం చేస్తున్నారు. వెనక స్థిరాస్తివుంది. మీకెందుకింకా మీకు కాబోయే భార్య సర్వలాంఛనాలతో రావాలన్న కోరిక?

మా స్థితిగతులేమిటో మీకు తెలియకపోతే నేను చెబుతాను!

మా నాన్నగారు మధ్యతరగతి గృహస్థు. నా తర్వాత ఆడపిల్లలున్నారు పెళ్ళిళ్ళకు. చదువులకు మగపిల్లలున్నారు. ఏ నెల కానెల తల భారమయ్యే ఖర్చుతో సతమతమయ్యే సంసారి మా నాన్నగారు.

అతడి నుండి మీరు పదివేల కట్నం, గట్రా అడిగారు!

ఎక్కడి నుండి తెస్తారు అంత డబ్బు?

తిండిగింజల కాధారమైన పొలం అమ్ముతున్నారు.

నా ఒక్కదాని పెళ్ళికే ఈ ఆస్తి అమ్మితే ముందు పిల్లల భవిష్యత్తు ఏమిటి?

భారతంలో ఓ కథ ఉంది.

బకాసురుడనే ఓ రాక్షసుడు ఉంటాడు. వాడు రోజూ ఊరిమీదపడి చేతికందిన వాడిని పట్టుకొని కరకర నమిలేస్తుంటే ఊరంతా హడలిపోయి వాడితో ఒక ఒప్పందం చేసుకొంటారు. నిత్యం ఓ బండెడన్నం, బండికి కట్టిన దున్నలు, బండికట్టుకొని వెళ్ళిన మనిషి వాడికాహారం అవుతారని, ఇలా విచ్చల విడిగా ఊరిమీదపడి తినకూడదని!

SCERT, TELANGANA

బకుడు ఒప్పుకుంటాడు.

బకుడి విందు వంతు ప్రకారం నిత్యం ఒక్కొ ఇంటికి వస్తూంటుంది.

వంతు తగిలిన ఇంటివారి శోకం వర్ణించడం ఎవరి తరం?

అలాంటి శోకమే ఇప్పుడు ప్రతి ఆడపిల్ల తల్లిదండ్రులూ అనుభవిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

బండిలో అన్నం, బండికి కట్టిన జీవాలు, బండితోలిన మనిషీ వాడికాహారమైపోయినట్టే – ఒక ఆడపిల్ల పెళ్ళిచేసి పంపేటప్పటికి వరకట్నమనే ఈ బకుడికి ఆహారమౌతున్నారు ఆడపిల్ల తల్లిదండ్రులు. ఆడపిల్లను అత్తవారింటికి పంపి సర్వం కోల్పోతున్నారు.

ఆనాడు బకుడి వధకు భీముడిని పంపింది కుంతీదేవి!

వరకట్నమనే ఈ బకుడి సంహారానికి ఇంకా భీముడు పుట్టలేదు.

పిల్ల తల్లిదండ్రుల శాపనార్థాలేవీ ఈ బకుణ్ణి కించిత్ కూడా బాధించడం లేదు. వాడు విజయగర్వంతో వీగిపోతూనే ఉన్నాడు. ఈ బకుడికి ఆహారమయ్యే వంతు ప్రతి ఇంటికీ వస్తూనే ఉంటుంది.

మిమ్మల్ని సంస్కారం చూపమని అడగడం తెలివి తక్కువ.

స్త్రీకి పురుషుడి అండ ఎంత అవసరమో అతడికీ ఆమె తోడు అంతే అవసరం!

ఈ తంతంగానికి ప్రతి మధ్యతరగతి కన్యాదాత బలైపోతున్నాడు.

వివాహపు తంతు ముగిసేసరికి ఇరువైపులా ఎంత మిగులుతుందని చూసుకొంటే వధువు ఒంటిమీద కొద్దిగా నగలు, పట్టుచీరలు, వరుడికి సూటూ బూటూ గడియారం లాంటివి. కట్నాలు, కానుకలు పట్టుకురాలేక బంధువులకు అగచాట్లు!

బంధువులు రాకపోతే, భజంత్రీలు మోగకపోతే వధువు మెడలో పడే ఆ మూడుముళ్ళు గట్టిగా పడవా? ఆ సంబంధం గట్టిగా నిలవదా?

ఈ ఆచారాలు ఒకనాడు ఏదో ఒక ఉద్దేశంతో, ప్రయోజనం కోసమే ఏర్పడి ఉండొచ్చు. ఈనాడు మనది బీదదేశం. ప్రతి పైసా అమూల్యంగా వాడుకోవలసిన ఈ రోజుల్లో అర్థంలేని ఈ ఆచారాలవల్ల ఎంతో డబ్బు వ్యర్థమైపోతూంది! ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అర్థంలేని, ప్రమాదకరమైన ఆచారం!

నిజంగా నేను మీకు నచ్చితే, నా భావాలను మెచ్చితే కానీ కట్నం లేకుండా రెండు పూల దండలతో నన్ను పెళ్ళిచేసుకోండి! ఉంటాను – లీల."

## IV

నారాయణరావుకు ఒళ్ళు మండుకొచ్చింది. మర్యాదస్తుడు కాబట్టి ఈమె చేసిన ఘనకార్యానికి తిరిగి దుయ్యబట్టకుండా, ఆ ఉత్తరం తనకే పంపించి ఊరుకొన్నాడు! ఇంకే ఉత్తరమూ లేదందులో.

"లీలా!" పిలుపుకాదు, గర్జన.

"ఏమిటి నాన్నా?"


విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక
SCERT, TELANGANA

ఆయన కూతురు ముఖంలోకి ఎగాదిగా చూశాడు.

"ఏమిటి నాన్నా? అలా చూస్తావు?"

"ఇంత గొప్పదానివి ఎప్పుడు అయిపోయావా అని!"

తండ్రి చేతిలో ఉత్తరం చూస్తూనే, సుధాకరరావు ఏదో రాశాడని తెలుసుకొంది లీల. కాని, నిబ్బరంగా నిలబడింది.

"పెళ్లి చేసుకోకుండా నువ్వు ఏం చేయాలనుకొన్నావ్?"

"ఆడపిల్లకు పెళ్ళికంటే మరో పరమావధి లేదని చెప్పేకాలమా ఇది నాన్నా?"

"ఉద్యోగం చేసి నీ జీవితం నీవు గడుపుకోవడంతోనే సమస్యలు తీరిపోతాయనుకొన్నావా? పెళ్ళికాని ఆడపిల్ల బయట కాలుపెడితే ఎన్ని నిందలు చుట్టుకొంటాయో నీకు తెలియదా?"

"పెళ్ళయిన ఆడది బయట కాలుపెట్టినా నిందలు చుట్టుకొంటూనే ఉంటాయి! కాకపోతే కొంచెం తక్కువేమో!"

"కన్న తల్లిదండ్రులపట్ల నీకేమీ బాధ్యత లేదా?"

"బాధ్యత ఎందుకులేదు నాన్నా? ఆ బాధ్యత కోసం నా ఆదర్శాలనూ, ఆలోచనలనూ బలిపెట్టుకోవాలా? చూస్తూ ఈ బకాసురుడి విందుకు మిమ్మల్ని బలిచేయలేను!"

"ఇది బలికాదమ్మా తల్లిదండ్రుల బాధ్యత! ఆడపిల్లను కన్నాక ఒక అయ్యచేతిలో పెట్టాకే తృప్తి!"

"అందుకోసం మీరెంత అవస్థపడుతున్నారో నేను చూడడం లేదా?"

"ఈ బాధలోనే ఉందమ్మా ఆనందం."

"ఉన్నదంతా ఊడ్చి పెట్టి, మీరు పొందే ఆనందమేమిటి? అవతలింకా పిల్లలు లేరూ?"

అంత ఆగ్రహంలోనూ ఆయన కూతురు వేదన అర్థం చేసుకోకపోలేదు! ఆర్ద్రంగా కూతురి చుబుకం ఎత్తాడు.

"నువ్వొక్కదానివి ఈ నిర్ణయం తీసుకొంటే దేశంలో పెళ్ళికొడుకు లందరికీ ప్రాయశ్చిత్తం జరుగుతుందా అమ్మా! ఎడారిలో వర్షపుబిందువులా ఎంత వరకు ఫలిస్తుంది నీ త్యాగం?"

"నా ఒక్కదానివల్ల ఏం ఉపకారం జరుగుతుందని ప్రతి వర్షబిందువూ కురవడం ఆగిపోతే ప్రపంచం గతి ఎలా మారుతుందో నువ్వు ఊహించలేవా నాన్నా? నీ బిడ్డ ఒక ఉత్తమ గృహిణిగా మసలుకొని మీకు కీర్తి తేవాలన్న తాపత్రయం విడిచి ఆమె ఒక మనిషిగా, వ్యక్తిత్వంతో బతకాలని ఆశీర్వదించండి నాన్నా?"



SCERT, TELANGANA

# పదాలు - అర్థాలు

### అ

అధికం = ఎక్కువ

అనుశ్రుతం = వారినోట, వీరినోట విన్నది

అపవాదు = నింద

అభివందనం = నమస్కారం

అసురులు = రాక్షసులు

అమందము = ఎక్కువైనది

అమరులు = దేవతలు

అరసికులు = మొరటువారు

అల్పుడు = బుద్ధి తక్కువ కలవాడు

అవరోధం = అడ్డగింత

అవలీల = చులకన, సులువు

అశుభం = చెడు

అంబుధి = సముద్రం

### ఆ

ఆపేక్ష = కోరిక

ఆచరణ = నడత, ఆచారము

ఆచార్యుడు = గురువు

ఆలోచనము = ఆలోచించడం

ఆడంబరము = యుద్ధ వాద్య ధ్వని

ఆర్జన = సంపాదన

### ఇ

ఇత్తురు = ఇస్తారు

ఇరవు = స్థానం

### ఉ

ఉన్నతి = ఔన్నత్యము, పొడవు

ఉల్లాసం = సంతోషం

ఉసూరు = నిస్సత్తువ, ఊపిరి

### ఊ

ఊడ్పు = ఊడవడం

### ఎ

ఎద = హృదయం

ఎలమి = సంతోషం

### ఒ

ఒంటి = ఒంటరిగా

ఒరులు = ఇతరులు

### క

కట్టుబానిస = పనికి తగిన ప్రతిఫలం లేకుండా చాకిరీ చేసే వ్యక్తి

కరుణ = దయ

కర్మ = పని

కలత = క్షోభము

కాంతి = వెలుతురు

SCERT, TELANGANA

| | | |
|---|---|---|
| కుడుచు | = | తిను |
| కూడు | = | జమచేయు |
| కూరిమి | = | స్నేహం |
| కొరత | = | తక్కువ |

**గ**

| | | |
|---|---|---|
| గానం | = | గీతం, పాట |
| గికురించు | = | చూపు తప్పించు |
| గొడుగు | = | ఛత్రం, ఛత్రి |
| గోచరించు | = | అగుపడు |
| గోపార్భకులు | = | గోపాలుర పిల్లలు |
| గృహం | = | ఇల్లు |

**చ**

| | | |
|---|---|---|
| చందం | = | విధం |
| చయ్యన | = | వెంటనే |
| చారు | = | అందమైన |
| చిక్కము | = | ఉట్టి, పశువుల మూతికి తగిలించెడి బుట్ట |
| చెలరేఁగి | = | మిక్కిలి విజృంభించి |
| చేలు | = | పంటపొలాలు |

**జ**

| | | |
|---|---|---|
| జనులు | = | ప్రజలు |
| జలం | = | నీరు |
| జలజము | = | తామరపువ్వు |
| జిజ్ఞాస | = | తెలుసుకోవాలనే కోరిక |
| జుంటీగలు | = | తేనెటీగలు |

**డ**

| | | |
|---|---|---|
| డాచంక | = | ఎడమచంకలో |

**త**

| | | |
|---|---|---|
| తండంబు | = | గుంపు |
| తనూభవుడు | = | కొడుకు |
| తుదకు | = | చివరకు |
| తెనిగించు | = | తెలుగుచేయు |
| తొడరు | = | ప్రయత్నించు |
| తెరువరి | = | బాటసారి |

**ద**

| | | |
|---|---|---|
| దండ | = | సమీపం |
| దుర్జనుడు | = | చెడ్డవాడు |
| దర్శనం | = | కన్పించడం |
| దురితము | = | పాపము |
| దురాచారం | = | చెడ్డ నడవడి |

**న**

| | | |
|---|---|---|
| నగవు | = | నవ్వు |
| నరుడు | = | మానవుడు |
| నర్మభాషణం | = | పరిహాసపు మాటలు |
| నారి | = | స్త్రీ |
| నిగూఢం | = | మరుగుపుచ్చినది |
| నిబిడీకృతం | = | దట్టంగా చేయబడినది |
| నిర్మలం | = | మలినంలేని |
| నిష్ఫలం | = | ఫలితం లేనిది |

SCERT, TELANGANA

నుడువకు = మాట్లాడకు

నెచ్చెలి = స్నేహితురాలు

నెఱపు = నెరవేర్చు, చేయు

నింగి = ఆకాశం

## ప

పట్టుదల = వదలని పట్టు

పన్నగము = పాము

పన్నిదము = ఉపాయము, ఎత్తుగడ

పయము = నీరు

పరంపరాగతం = క్రమంగా వచ్చినది

పరులు = ఇతరులు

పరిపాటి = అనుక్రమము

పలుకు = మాట

పల్లము = ఒంపు

పల్లవము = చిగురు

పస = సారము, సమృద్ధి

పూర్వులు = ముందుతరంవారు

పొరపాటు = తప్పు

ప్రగాఢం = దృఢం

పైరు = సస్యము

## ఫ

ఫలము = ఫలితము

## బ

భాసించు = ప్రకాశించు

బ్రోచటం = రక్షించడం

## భ

భూషణాలు = ఆభరణాలు

## మ

మబ్బు = మేఘం

మరగుట = సలసల క్రాగుట, అంటక్రాగుట

మరుగు = రహస్యస్థలం

మస్తకం = తల

మాణిక్యం = నవరత్నాల్లో ఒకటి

మార్గదర్శకుడు = దారిచూపువాడు

మాసం = నెల

ముడువడం = మూటలా చేయడం

మురియు = మురిసిపోవు (సన్నగా నవ్వు)

మెరుగు = కాంతి, మేలైన

మెసగు = తిను

మేటి = గొప్ప

మేలు = మంచి

మొనయన్ = ప్రయత్నంతో

మ్రగ్గు = బాధపడు

మ్రోలు = శబ్దము చేసి

## య

(ఏరు) యేరు = నది

## ర

రక్తి = అనురాగం, రాగం

రణము = యుద్ధము

రమ్యం = అందం

SCERT, TELANGANA

ల

లక్ష్యము = గురి

లవణం = ఉప్పు

లాలిత = సున్నితమైన, మృదువైన

వ

వత్సము = దూడ

వధించు = చంపు

వర్జింపు = వదలడం

వలువలు = బట్టలు

వఱపున = వానలేని

వాడిన = ఎండిన

వాత్సల్యం = ప్రేమ

వాఙ్మయం = సాహిత్యం

విఘ్నము = ఆటంకం, అడ్డంకి

విచారించు = ఆలోచించు

విత్తము = ధనము

విపత్తు = ఆపద, కష్టం

విమల = శుభ్రమైన

విలంబం = ఆలస్యం

విలువ = వెల

విశ్వాసం = నమ్మకం

వీక్షించు = చూచు

వెలయు = ఉండడం

వెఱఁగు = ఆశ్చర్యం

వెలయ = తెలిసేవిధంగా

వేత్రదండం = బెత్తం

వంశనాళం = వేణువు

శ

శిల = రాయి

శృంగం = కొమ్ము

శైశవము = బాల్యం

స

సక్కడించు = నేరుగాచేయు (వదులుచేయు)

సఖుడు = మిత్రుడు

సదా = ఎల్లప్పుడు

సమ్మర్జనం = ఊడవడం

సర్వస్వం = మొత్తం

సంకెల = కాలికట్టగు ఇనుపగొలుసు

సంవాదం = సమాచారం

సంగడీలు = స్నేహితులు

సంఘం = సమూహం, గుంపు

సార్థకం, సార్థక్యం = సఫలం

సేకరణ = సంగ్రహణ

సౌక్కము = శుభ్రమైన, మలినంలేని

SCERT, TELANGANA

# పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అభివందనం | = | నమస్కారం, వందనం |
| అలవోక | = | స్వేచ్ఛ, అప్రయత్నం |
| అంబుధి | = | సముద్రం, సంద్రం |
| ఆచార్యుడు | = | గురువు, ఉపాధ్యాయుడు |
| ఆశ | = | ఇచ్ఛ, ఈప్స, కాంక్ష |
| ఇల్లు | = | గృహం, నిలయం, సదనం, భవనం |
| ఉసూరు | = | నిస్సత్తువ, బడలిక |
| ఎద | = | హృదయం, మది, డెందం |
| కనకం | = | బంగారం, పసిడి, పుత్తడి |
| కరుణ | = | దయ, జాలి |
| కర్మ | = | పని, చేసేది |
| కష్టాలు | = | బాధలు, తిప్పలు, యాతన, గోస |
| కాంతి | = | జిగి, కోరిక, వెలుతురు, వెలుగు |
| కూరిమి | = | స్నేహము, మిత్రత్వము, చెలిమి, సోపతి |
| గుండె | = | హృదయం, ఎడద |
| గొడుగు | = | ఆతపత్రం, ఛత్రం |
| గృహిణి | = | ఇల్లాలు, భార్య, పత్ని |
| గంగ | = | భాగీరథి, జాహ్నవి |
| జ్ఞానం | = | తెలివి, బుద్ధి, ఎరుక |
| తల్లి | = | అమ్మ, జనని, మాత |
| దుష్టులు | = | దుర్మార్గులు, దుర్జనులు |

| | | |
|---|---|---|
| నటన | = | నాట్యం, నృత్యం |
| నరుడు | = | మానవుడు, మనిషి |
| నారి | = | పడతి, స్త్రీ |
| నిజాయితీ | = | న్యాయమైన, సత్యమైన |
| నిర్మూలించి | = | వేరుచేయనిదిగాజేయు, నాశముచేయు |
| నింగి | = | ఆకాశం, అంబరం, అంతరిక్షం |
| నుడువు | = | మాట, పలుకు |
| పతి | = | భర్త, మగడు, నాథుడు |
| పన్నగము | = | సర్పము, పాము |
| పయము | = | నీరు, ఉదకము |
| పక్షి | = | పిట్ట, ఖగం, పతగం, నీడజం |
| పద్మం | = | తామర, అంభోరుహం, అబ్జం |
| ప్రీతి | = | ఇష్టం, కోరిక |
| బురద | = | అడుసు, కర్దమం, పంకం |
| భక్షించు | = | తిను, కుడుచు |
| భూవరుడు | = | రాజు, ప్రభువు |
| బ్రోచు | = | రక్షించు, కాపాడు |
| మట్టి | = | మన్ను, మృత్తిక |
| మబ్బు | = | మేఘం, జలదము, అభ్రము |
| మాత | = | తల్లి, అమ్మ, జనని |
| మేటి | = | ఘనమైన, గొప్పనైన |
| మేను | = | శరీరం, దేహం, తనువు |

SCERT, TELANGANA

మొల్లము = ఎక్కువ, దట్టంగా

రణము = యుద్ధము, సమరము

లాభం = దొరకడం, ప్రాప్తి, లబ్ధి, గిట్టుబాటు

వర్జించు = విడిచిపెట్టు, వదులు

వాస్తవం = నిజం, సత్యం, యథార్థం

విత్తము = ధనము, డబ్బు

వివాహం = పరిణయం, పాణిగ్రహణం, పెళ్ళి

శిల = రాయి, బండ

సరళం = తేలిక, సులభం

సర్వస్వం = మొత్తం, అంతా

సిరి = శ్రీ, ధనము

స్త్రీ = నారి, వనిత, ఇంతి, మహిళ

సూర్యుడు = రవి, భానుడు

## నానార్థాలు

అడుగు = పాదం, పద్యపాదం, పాతాళం, యాచించు

అర్భకులు = పిల్లలు, బలహీనులు

అవరోధం = అడ్డు, అంతఃపుర స్త్రీ, స్వర్గం, ముట్టడి

అక్షరం = నాశనములేనిది, పరబ్రహ్మం

ఆశ = దిక్కు, కోరిక, నమ్మకం

కర్ణిక = చెవికమ్మ, తామర దుద్దు

కుడుచు = తిను, తాగు

కృషి = వ్యవసాయం, ప్రయత్నం

గహనము = తెలియనిది, గుహ, అడవి, ప్రవేశింపలేనిది, దుఃఖం, నీరు, కష్టం

గుణం = స్వభావం, వింటినారి, దారం

చైతన్యం = తెలివి, ప్రాణము

జలజము = తామర, శంఖం

జాతి = వర్ణం, ఛందస్సు, సంతానం, పుట్టుక, కులం

దండ = హారం, దగ్గర, ప్రక్కన

ధర్మం = న్యాయం, పుణ్యం, ఆచారం

నెఱి = అందం, ఆచారం, క్రమము

పల్లవము = చిగురు, లత్తుక రంగు

ప్రీతి = సంతోషం, స్నేహం, ప్రేమ

మబ్బు = మేఘం, అజ్ఞానం, చీకటి

మట్టికరచు = అగచాట్లుపడు, పడిపోవు, ఓడిపోవు

శిల = ఱాయి, మణిశిల, కర్పూరం

శిల్పం = చిత్రరువులు వ్రాయుట, పనితనం, కార్యం, నేర్పు

శృంగం = పర్వత శిఖరం, బూర, కొమ్ము

SCERT, TELANGANA

## వ్యుత్పత్త్యర్థాలు

అమరులు = మరణము లేనివారు (దేవతలు)

ఆచార్యుడు = ఆచరించి చూపేవాడు (గురువు)

దాశరథి = దశరథుని కుమారుడు (శ్రీరాముడు)

పయోనిధి = పయస్సు (నీరు) నిధిగాగలది (సముద్రం)

భక్ష్యము = భక్షింపతగినది (తినతగినది)

నరసింహుడు = నర, సింహ రూపములను కలిగి ఉన్నవాడు (నరసింహస్వామి)

సర్వేశ్వరుడు = సర్వ ఐశ్వర్యములను కలిగిఉన్నవాడు (దేవుడు)

## ప్రకృతి - వికృతి

| | |
|---|---|
| అక్షరం - అక్కరం | పక్షి - పక్కి |
| ఆధారం - ఆదరువు | పుస్తకం - పొత్తం |
| ఆశ - ఆస | ప్రాణం - పానం |
| కథ - కత | బంధం - బందం |
| కష్టం - కస్తి | భక్తి - బత్తి, బగితి |
| కార్యం - కర్జం | భాష - బాస |
| కుమారుడు - కొమరుడు | మర్యాద - మరియాద |
| గుణం - గొనం | మేఘము - మొగులు |
| గృహం - గీము, గేహం | విద్య - విద్దె, విద్దియ |
| గౌరవం - గారవం | వేషం - వేసం |
| జ్యోతి - జోతి | శాస్త్రం - చట్టం |
| దేశం - దేసం | శ్రీ - సిరి |
| ధర్మం - దమ్మం | సఖుడు - సకుడు |
| పద్యం - పద్దెం, పద్దియం | సుఖం - సుకం |
| పణిత - పన్నిదము (పందెము) | |

SCERT, TELANGANA

## పాఠ్యపుస్తక అభివృద్ధి బృందం - 2022

### సంపాదకులు

**డా॥ నందిని సిధారెడ్డి,** పూర్వ అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

**శ్రీ దేశపతి శ్రీనివాస్,** పూర్వ ప్రత్యేకాధికారి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

**ఆచార్య బన్న అయిలయ్య,** ప్రధానాచార్యులు, ఆర్ట్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యాకళాశాల, వరంగల్.

### రూపకల్పనలో పాల్గొన్నవారు

**సువర్ణ వినాయక్,** ప్రధానోపాధ్యాయుడు, తెలుగు కో-ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ.

**గాజుల రవీందర్,** ఎస్.ఎ., జి.హెచ్.ఎస్, కార్ఖానగడ్డ, కరీంనగర్.

**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, సి.పి.ఎల్. అంబర్‌పేట్, హైదరాబాద్.

**కె.కె.వేంకటశర్మ,** భాషోపాధ్యాయుడు (తెలుగు), జి.హెచ్.ఎస్., మొఘల్‌పుర నెం-1, హైదరాబాద్.

**చక్రవర్తుల శ్రీనివాస్,** భాషోపాధ్యాయుడు (తెలుగు), జడ్.పి.హెచ్.ఎస్., చర్లపల్లి, వరంగల్ రూరల్.

**ఎస్. జ్యోతి,** భాషోపాధ్యాయిని, జి.హెచ్.ఎస్.టి.డి. సింగ్, బాబానగర్, హైదరాబాద్.

**సనా ఫాతిమా,** భాషోపాధ్యాయిని, యం.ఎస్.క్రియేటివ్ పాఠశాల, హైదరాబాద్.

**పల్లెర్ల రామమోహనరావు,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా. వేముల, మూసాపేట, మహబూబ్‌నగర్.

**డా॥ గట్టు త్రివేణి,** భాషోపాధ్యాయిని, యు.పి.ఎస్.-అంగరాజుపల్లె, మంచిర్యాల.

**డా॥ వొజ్జల శరత్‌బాబు,** ఎస్.ఎ., ప్ర.ఉ.పా., రాజ్‌భవన్, హైదరాబాద్.

**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., లోనికలాన్, మునిపల్లి మండలం, సంగారెడ్డి.

**కటుకోజ్వల మనోహరాచారి,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., కోరుట్ల, జగిత్యాల జిల్లా.

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, జూబ్లిహిల్స్, ఆత్మకూరి రామారావు పాఠశాల, హైదరాబాద్.

**సంబరాజు రవిప్రకాశ రావు,** ఎస్.జి.టి., ప్రా.పా., గోవిందాయిపల్లె తాండ, కడ్తాల్, రంగారెడ్డి.

### సమన్వయం, విషయనిపుణులు

**తహసీన్ సుల్తానా,** ప్రొఫెసర్, భాషావిభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.

### చిత్రకారులు

**కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. వెంకటేశ్వరనగర్, నల్లగొండ జిల్లా.

SCERT, TELANGANA

## పాఠ్యపుస్తక అభివృద్ధి బృందం - 2022

**ముఖచిత్రం, డి.టి.పి., లేఔటు & డిజైనింగ్**

**పి.ప్రతిమ,** హైదరాబాద్.

**పాఠ్యపుస్తక ప్రచురణ కమిటీ**

**సంచాలకులు,** పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ, హైదరాబాద్.

**సంచాలకులు,** రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**సంచాలకులు,** ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, తెలంగాణ, హైదరాబాద్.

SCERT, TELANGANA

# నోట్స్

SCERT, TELANGANA